తెలుగు గత వారం రోజుల్లో పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
1-7-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 150 పేజీలు: 12 వెల: 6.50

'సార్క్'కు ప్రత్యామ్నాయ కూటమికి యత్నం

2029కి 52 మిలటరీ ఉపగ్రహాలు నింగిలోకి

9లో

# చార్జీల మోత



## వందేభారత్ సహా అన్ని ఎక్స్‌ప్రెస్‌ల రైలు చార్జీలు హెచ్చింపు

### ఎసి, జనరల్ క్లాసు రేట్లు మార్పు

### సబర్బన్, సీజన్ టిక్కెట్లు యధాతథం

### నేటి అర్థరాత్రినుంచి అమలులోకి

**హైదరాబాద్ (తార్నాక), జూన్ 30 ప్రభాతవార్త :** భారతీయ రైల్వే టికెట్ల ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. పెంచిన టికెట్ల ధరలు జులై ఒకటి అర్ధరాత్రి నుంచి అమలులోకి రానున్నాయి. టికెట్ల ధరల పెంపుపై రైల్వే బోర్డు అన్ని జోన్లకు సర్క్యులర్‌ను సోమవారం జారీ చేసింది. రైలు చార్జీల పెంపు మెయిల్, ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లకు వర్తించనున్నది. పెరిగిన ధరలు జులై ఒకటి నుంచి అమలులోకి వస్తాయని ఇప్పటికే రైల్వే బోర్డు ప్రకటించింది. రైల్వే మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం. పెరిగిన ఛార్జీ జనరల్, స్లీపర్, ఏసీ క్లాసులకు వర్తించనున్నది. ఎసి చైర్ క్లాస్, ఎసి త్రీ టైర్, త్రీ టైర్ ఎకానమీ, ఎసి టూ టైర్, ఎసి ఫస్ట్ క్లాస్, ఎగ్జిక్యూటివ్ క్లాస్‌లలో కిలోమీటరుకు 2 పైసలు పెంచుతున్నట్లు రైల్వేశాఖ తెలిపింది.

నోటిఫికేషన్ ప్రకారం, ఎసి కోచ్‌లతో పాటు, నాన్ ఏసీ కోచ్‌ల ఛార్జీ కూడా పెరిగింది. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల సెకండ్, స్లీపర్, ఫస్ట్ క్లాస్ నాన్‌ఎసి కోచ్‌ల ఛార్జీని కిలోమీటరుకు ఒక పైసా పెరిగింది. జనరల్ క్లాస్‌లో కిలోమీటరుకు అర పైస పెంపు ఉంటుంది. జనరల్ కోచ్‌ల్లో సెకండ్ క్లాస్ ఆర్డినరీలో 500 కిలోమీటర్ల వరకు చార్జీల పెంపు ఉండదని రైల్వేశాఖ తెలిపింది. 501 కిలోమీటర్ల నుంచి 1500 కిలోమీటర్ల వరకు రూ.5. ఇక 1501 కిలోమీటర్ల నుంచి 2055 >>2

# సిలికాన్ తరహాలో అమరావతి క్వాంటం వ్యాలీ

## • 2026 జనవరినాటికి ఆవిష్కరణ • డీప్‌టెక్నాలజీ, ఎఐ, ఏరోస్పేస్, రక్షణ రంగాలకు ఎపిలో విస్తృత అవకాశాలు • వ్యాలీకి అనుబంధంగా ఎకోసిస్టం ఏర్పాటు • భవిష్యత్తు అంతా ఐటిదే: సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్30,ప్రభాతవార్తప్రతినిధి:** అమెరికాలో సిలికాన్ వ్యాలీ ఉంటే అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేయాలన్నది తమ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 2026 జనవరి 1 నాటికి క్వాంటం వ్యాలీ ప్రారంభం అవుతుందని ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో ప్రతీది ఐటీతో ముడిపడి ఉంటుందని తెలిపారు. ఐటీ వృద్ధి చెందితేనే మనం అభివృద్ధి చెందగలమని చెప్పారు. అమరావతి క్వాంటం వ్యాలీ నేషనల్ వర్క్ షాప్‌కు సోమవారం ఉదయం సిఎం చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఐబిఎం, టిసిఎస్, ఎల్ అండ్ టి భాగస్వామ్యంతో అమరావతిలో క్వాంటం వ్యాలీ పార్క్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. క్వాంటం వ్యాలీ జాతీయ సదస్సులో భాగంగా క్వాంటం వ్యాలీ వర్క్ షాప్‌లో స్టార్టప్ కంపెనీల ఎగ్జిబిషన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు.వర్క్ షాప్‌లో ఐబిఎం సంస్థ ప్రదర్శించిన ప్రోటోటైప్ క్వాంటం కంప్యూటర్‌ను ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి సిఎం చంద్రబాబు పరిశీలించారు.ఈ క్వాంటం వ్యాలీ నేషనల్ వర్క్ షాప్‌కు ఐబిఎం ఇండియా ఎండీ సందీప్ పటేల్, ఐబిఎం ఇండియా వైస్ ప్రెసిడెంట్ స్కాట్ క్రౌడర్ టీసీఎస్ ప్రెసిడెంట్ గ్లోబల్ హెడ్ వి.రాజన్న మైక్రోసాఫ్ట్ ఇండియా ఎండీ రాజీవ్ కుమార్, ఏటీ అండ్ టీ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ సిద్ధు, తదితరులు క్వాంటం వ్యాలీ వర్క్ షాప్‌లో పాల్గొన్న భారత్ బయోటెక్ వ్యవస్థాపకురాలు సుచిత్రా కె. ఎల్లా, హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, నేషనల్ క్వాంటం మిషన్ డైరెక్టర్ జె.బి.వి.రెడ్డి, తదితరులు హాజరు క్వాంటం వ్యాలీ వర్క్ షాప్‌లోని వివిధ సెషన్లకు హాజరైన కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ కార్యదర్శి అభయ్ కరాండికర్, కేంద్ర ప్రభుత్వ సైంటిఫిక్ అడ్వైజర్ అజయ్ కుమార్ సూద్, నేషనల్ క్వాంటం మిషన్ డైరెక్టర్ జేబీవీ రెడ్డి నేషనల్ వర్క్ షాప్‌లో భాగంగా వివిధ సాంకేతిక సెషన్లలో పాల్గొన్న రెడ్డి ల్యాబ్స్, అస్ట్రాజెన్కా, అమెజాన్ , హెచ్ సీఎల్, ఎల్ అండ్ టి, ఐఐటి మద్రాస్, తిరుపతి, బ్యాంక్ ఆఫ్ అమెరికా తదితర సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. అమరావతిలో ఏర్పాటుచేసే క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీపై నేషనల్ వర్క్‌షాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు ఇక వర్క్‌షాపు ప్రారంభ సూచకంగా సీఎం చంద్రబాబు జ్యోతి ప్రజ్వలన చేసారు..ఈసందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ నిజానికి క్వాంటమ్ కంప్యూటింగ్‌ను ప్రమోట్ చేయాలనుకున్నాం. దీనిపై ముఖ్యమైన వ్యక్తులను ఆహ్వానించాలనుకున్నాం. ఆ సమయంలోనే భారత ప్రభుత్వం క్వాంటమ్ కంప్యూటింగ్ మిషన్‌ను అనౌన్స్ చేసింది. వెంటనే కామకోటి మా వద్దకు వచ్చి ఈ విషయం చెప్పారు. వెంటనే నేను గవర్నమెంట్ ఆఫ్ ఇండియాను అడిగాం. వారు ఓకే చెప్పారు ఎలా ముందుకు వెళ్లాలని కూడాఅడిగాం. ఈ రంగంలో మరింతమంది ముందుకు రావాలని ఎకో సిస్టంను టీసీఎస్, >>2



సోమవారం జ్యోతి ప్రజ్వలనతో క్వాంటం టెక్నాలజీ వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

# బనకచర్లకు అనుమతి ఇవ్వలేం

## • తిరస్కరించిన కేంద్ర పర్యావరణ కమిటీ • సిడబ్ల్యుసిని సంప్రదించాలని సూచన

**విజయవాడ, జూన్30, ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం- బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ అభ్యంతరాలు తెలిపింది. ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు దీనిపై అనేక అభ్యంతరాలు వచ్చాయని పేర్కొంది. ఒకవేళ అనుమతులు ఇవ్వాలంటే గోదావరి ట్రైబ్యునల్ అవార్డు పరిశీలించాలని సూచించింది. పర్యావరణ అనుమతులకు సిడబ్ల్యూసీని సంప్రదించడం అత్యవసరమని వెల్లడించింది.

బనకచర్ల ప్రాజెక్టును ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టినట్లు ఎపి సర్కార్ ఇచ్చిన నివేదికను నిపుణుల కమిటీ పరిశీలించింది. అయితే 1983లో గోదావరి ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పునకు విరుద్ధంగా ఈప్రాజెక్టు నిర్మిస్తున్నారని అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టులో నీటి నిల్వపై కేంద్రంతో అధ్యయనం, రెండు రాష్ట్రాలకు సంబంధించిన అంశాలకు అన్ని అనుమతులు, పర్యావరణ ప్రభావంపై అంచనా వేసిన తర్వాతే ప్రాజెక్టుకు పూర్తిస్థాయి అనుమతివ్వడానికి సాధ్యమవుతుందని నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. ప్రాజెక్టు ప్రతిపాదకులు కేంద్ర జల సంఘం సహాయంతో వరద నీటిలభ్యతపై సమగ్ర అధ్యయనం చేయాలి., ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పు1980కి విరుద్ధంగా ఉందన్న ఆరోపణలను పరిగణనలోకి తీసుకోవాలి. టిఓఆర్ తయారీకి ముందు రాష్ట్రాల మధ్య జల పంపిణీపై క్లారిటీ కోసం కేంద్ర జల కమిషన్ అనుమతి తీసుకోవాలి. సముద్రంలో కలిసే గోదావరి నది మిగుల జలాలను మళ్లించి.. రాయలసీమ జిల్లాలకు అందించాలని చంద్రబాబు ప్రభుత్వం భావించింది. అందుకోసం బనకచర్ల ప్రాజెక్ట్‌ను నిర్మించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. అయితే ఎపి చేపట్టనున్న ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల తమ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుందంటూ తెలంగాణలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఆ క్రమంలో అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేశాయి. పలువురి అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. అనంతరం ఈ వ్యవహారంపై కేంద్ర జలశక్తితోపాటు పలు శాఖల మంత్రులకు సిఎం రేవంత్ రెడ్డి ఈ సమావేశంలో వివరించినట్లు సమాచారం. ఎపి సిఎం చంద్రబాబునాయుడు పోలవరం- బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణంపై మంచి నమ్మకంతో ఉన్నారు.సముద్రంలోకి వృధా పోయే నీటి సద్వినియోగం చేయడమే ప్రాజెక్ట్ లక్ష్యమని తెలంగాణకు అవగాహన కలిగించాలని సీఎం చంద్రబాబు నిన్న తన మంత్రి వర్గ సహచరులు, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. ఇప్పుడు పర్యావరణ నిపుణుల కమిటీ అభ్యంతరాలపై సీఎం చంద్రబాబు ఎలా స్పందిస్తారో ఎదురు చూడాల్సి ఉంది.

# రాష్ట్ర బిజెపి సారథిగా మాధవ్



## ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు

### ప్రస్తుతం బిజెపి రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా బాధ్యతలు

**విజయవాడ, జూన్30,పభాతవార్తప్రతినిధి:** భారతీయ జనతా పార్టీ ఎపి విభాగం నూతన అధ్యక్షునిగా పోకల వంశీ నాగేంద్ర మాధవ్ మాధవ్ ఖరారయ్యారు,ఆ మేరకు ఆ పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. నామినేషన్ వేసేందుకు బిజెపి రాష్ట్ర కార్యాలయానికి మాధవ్ ఒక్కరే వెళ్లారు. ప్రస్తుతం బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మాధవ్ ఉన్నారు. గతంలో శాసన మండలిలో బిజెపి ఫ్లోర్ లీడర్‌గా మాధవ్ పనిచేశారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటలవరకు నామినేషన్ల స్వీకరణజరిగింది. విజయవాడలోని బిజెపి >>2

# ఆగస్టు 15 నుంచి వాట్సప్‌ద్వారా 100% పౌర సేవలు

# టేకాఫ్ అయిన వెంటనే కుప్పకూలిన విమానం

## ఆరుగురు దుర్మరణం

**ఒహాయో(అమెరికా),జూన్ 30:** అమెరికాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఒహాయో రాష్ట్రంలో ఒక చిన్న విమానం కూలిపోయిన ప్రమాదంలో ప్రయాణిస్తున్న ఆరుగురు వ్యక్తులు మరణించారు. విమానం టేకాఫ్ అయిన కొద్ది నిమిషాలకే ఈ దుర్ఘటన సంభవించింది.ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఎఎ) అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, యంగ్స్‌టౌన్‌వారెన్ ప్రాంతీయ విమానాశ్రయం నుండి ఆదివారం ఉదయం ఆరుగురు ప్రయాణికులతో బయలుదేరిన సెస్నా 441 విమానం గాల్లోకి ఎగిరిన కొద్దిసేపటికే కుప్పకూలింది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. ఈ దుర్ఘటనలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని వెస్టర్న్ రిజర్వ్ పోర్ట్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆంతోనీ ట్రెవెనా ధ్రువీకరించారు. మృతదేహాలను ట్రంబుల్ కౌంటీ కరోనర్ కార్యాలయానికి తరలించినట్లు ఆయన వెల్లడించారు. మృతుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.



సోమవారం క్వాంటమ్ టెక్నాలజీ వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న మంత్రి లోకేష్

# రాష్ట్రంలో క్వాంటం టెక్నాలజీ విప్లవం ప్రారంభమవుతోంది: మంత్రి లోకేష్

**విజయవాడ,జూన్30,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా క్వాంటమ్ టెక్నాలజీ విప్లవం ప్రారంభం అవుతోందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటించారు. క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ అమరావతిని.. టెక్నాలజీ మ్యాప్‌లో చేర్చాలని వ్యాఖ్యానించారు. చంద్రబాబు సాంకేతిక విప్లవంలో రెండో చాప్టర్ క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీ అని లోకేశ్ పేర్కొన్నారు. ఆయన మొదటి చాప్టర్ ఐటీ అన్నప్పుడు తాను ఏడో తరగతి చదువుతున్నట్లు చెప్పారు. దక్షిణాసియా క్వాంటం కేంద్రంగా అమరావతి అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. క్వాంటమ్ వ్యాలీపై విజయవాడలోని నోవాటెల్‌లో ఇవాళ(సోమవారం) వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో నారా లోకేష్ పాల్గొనిమాట్లాడారు. గ్లోబల్ రేస్‌లో చేరడం కాదు.. మనమే దారి చూపాలని మంత్రి నారా లోకేష్ సూచించారు. క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ వల్ల ఎపి బ్రెయిన్ క్యాపిటల్‌గా మారుతోందని ఉద్ఘాటించారు. క్వాంటమ్ సైన్స్‌ను ఇంజనీరింగ్‌లోనూ భాగం చేస్తున్నామని వెల్లడించారు. టెక్నాలజీ పరంగా ఎపి వేగంగా పనిచేస్తోందని చెప్పారు. విజన్ అంటే ఇప్పుడు వెలాసిటీ, ఇన్నోవేషన్ అని అభిప్రాయం వ్యక్తం చేశారు. గ్లోబల్ లీడర్లు, పెట్టుబడిదారులు తమతో కలసి పనిచేయాలని కోరారు. చంద్రబాబు లాంటి నాయకుడు ఎపికి ఉండటం అదృష్టమని ప్రశంసించారు. చంద్రబాబు కేబినెట్‌లో ఐటీ మంత్రిగా ఉండటం తాను అదృష్టంగా భావిస్తున్నానని ఉద్ఘాటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మొదలు పెట్టిన ఐటీ రంగం విస్తృతిని గతంలో చూశామని మంత్రి నారా లోకేష్. పేర్కొన్నారు ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీని ఏర్పాటు చేయడాన్ని.. ప్రత్యక్షంగా చూస్తున్నామని మంత్రి నారా లోకేష్ తెలిపారు. సౌత్ ఏషియా ఫస్ట్ క్వాంటమ్ వ్యాలీ అమరావతిలో ఏర్పాటు అవుతోందని ప్రకటించారు. అత్యాధునిక 156 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను ఐబీఎం ఏర్పాటు చేస్తోందని స్పష్టం చేశారు. లక్షకు పైగా ఐటీ జాబ్స్ క్వాంటమ్ రంగంలో వస్తాయని ఆశిస్తున్నామని అన్నారు. చంద్రబాబు లాంటి విజనరీ లీడర్ పాలనలో ఎపి వేగంగా అభివృద్ధి సాధిస్తోందని తెలిపారు. ఐబీఎం, ఎల్ అండ్ టీ, టిసిఎస్ సహకారంతో అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు అవుతోందని చెప్పుకొచ్చారు.

# కాకినాడ, అన్నవరం మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే

## రూ. 1042 కోట్లతో నిర్మాణం

**రాజంపేట, జూన్ 30 ప్రభాతవార్త:** సముద్ర ప్రాంతానికి, బీచ్‌లకు ప్రసిద్ధి చెందిన కాకినాడ తీర ప్రాంతంలో మరో జాతీయ రహదారికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. భారత మాల పరియోజన ప్రాజెక్టు ఫేజ్ 1 కింద 1042 కోట్ల అంచనా వ్యయంతో జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ టెండర్లు పిలిచింది. వాకలపూడి కాకినాడ లైట్ హౌస్ నుంచి అన్నవరం వరకు 40.621 కిలోమీటర్ల దూరం నాలుగు వరుసల రహదారిని నిర్మించనున్నారు. పిఠాపురం కత్తిపూడి మీదుగా ప్రస్తుతం రహదారి నిర్మాణం ఉంది. కొత్త రహదారి రెండు బీచ్‌లు దాటుకుంటూ ఓ రైల్వే వంతెన కూడా ఈ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మించనున్నారు. జూన్ 27 నుంచి టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఆగస్టు 18న ఈ టెండర్ల బిడ్లు ఓపెన్ చేస్తారు. ఈ సీడ్ యాక్సెస్ రోడ్డు పర్యాటకులకు వరంగా మారనుంది. సముద్రతీర ప్రాంతాన్ని ఆహ్లాదంగా చూస్తూ, బీచ్ అందాలను రోడ్డు పక్కన చూసేలా నిర్మించనున్నారు.

# మరో నాలుగు రోజులు వర్ష సూచన

**విజయవాడ,జూన్30,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి, తెలంగాణ రాష్ట్రాలు సహా దక్షిణ భారత్ అంతటా.. ఓ వారం పాటూ.. ఈదురుగాలులు వీస్తాయని భారత వాతావరణ శాఖ చెప్పింది. గాలుల వేగం గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు ఉంటుందని తెలిపింది. అలాగే జూన్ 30, జులై 1న కోస్తాంధ్ర, యానాంలో వేడి, ఉక్కపోతతో కూడిన వాతావరణం ఉంటుంది అని చెప్పింది. ఇక కేరళలో జులై 3, 4 తేదీల్లో భారీ వర్షాలు కురుస్తాయనీ,కర్ణాటకలో జులై 2నుంచి 5 వరకూ >>2


# తిరుమలేశుని దర్శన సేవలపై అభిప్రాయ సేకరణ

## క్యుఆర్ కోడ్ యాప్ అందుబాటులోకి

## సాంకేతిక నిఘా పెంచిన టిటిడి

### 16 అంశాలపై భక్తుల స్పందనలకు అవకాశం

**తిరుమల,జూన్ 30 ప్రభాతవార్తప్రతినిధి:** వ పరిస్థితులకు అనుగుణంగా హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం సామాన్యభక్తులకు శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతోబాటు వసతి కల్పనలో మరింత మెరుగైన మార్పులు తీసుకు రావడానికి వీలుగా భక్తుల నుండి అభిప్రాయ సేకరణకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం టిటిడి సాంకేతికంగా నిఘా పెట్టింది. తిరుమలలో జరిగే పొరబాట్లు, తప్పులు,వసతి సౌకర్యం ఎలా ఉంది...స్వామివారి దర్శనం బాగా జరిగిందా అనే ప్రశ్నలు శ్రీవారి సేవకులు భక్తులను అడిగి వారినుండి అభిప్రాయం సేకరిస్తున్నారు. ఈ ఫీడ్‌బ్యాక్‌ను టిటిడి ఐటి విభాగానికి చేరవేస్తే ఏదేని తీవ్ర సమస్యలు ఉంటే అక్కడ నుండి టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందుతుంది. క్షేత్రస్థాయిలో ఇఒ,అదనపు ఇఒ చేపట్టాల్సిన మార్పులు, మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కార్యాచరణ అమలుచేస్తారు. కొండకు చేరుకున్న భక్తులు తొలుత వసతి కోసం, ఆ తరువాత స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో నిరీక్షించే సమయంలో ఎదురయ్యే సమస్యలు, సౌలభ్యంగా ఉన్న సేవలు విధానం ప్రశ్నల రూపంలో శ్రీవారిసేవకులకు తెలియజేసే వీలుకలిగింది. లడ్డూప్రసాదాల నాణ్యత,రుచి, తరిగొండవెంగమాంబ అన్నప్రసాదంలో అన్నప్రసాదాలు వడ్డన, ఇంకా మార్పులు తదితర అంశాలపై సూచనలు,సలహాలు తీసుకుంటున్నారు. భక్తులు కూడా నిర్మోహమాటంగా తమ అభిప్రాయాలు వెల్లడించే అవకాశం కలిగింది. ఐవిఆర్ఎస్, వాట్సాప్ (93993 99399), ఈ సర్వే, శ్రీవారిసేవకుల ద్వారా అభిప్రాయ సేకరణ తీసుకోవడమేగాక 16 అంశాలపై భక్తులు తమ అభిప్రాయాలు చెప్పడానికి వీలుగా క్యూఆర్ కోడ్ స్కానింగ్ కోసం ఓ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కోడ్‌యాప్‌ను తిరుమలకొండపై ప్రధాన కూడళ్లలో, వసతికల్పన విచారణ కార్యాలయాల వద్ద ఏర్పాటుచేశారు. భక్తులు ఈవిధానంలో అభిప్రాయాలు, ఫిర్యాదులు, సలహాలుఇస్తే టిటిడి ఉద్యో గులు, అధికారుల్లో బాధ్యతను పెంపొందించే >>2



# నేడు సిఎం తూ.గో పర్యటన

**విజయవాడ,జూన్30,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబు జులై 1న తూర్పు గోదావరి జిల్లాలో పర్యటించనున్నారని ఆ జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. కొవ్వూరు నియోజకవర్గంలోని తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ, ఆ తర్వాత పి4 సభలో పాల్గొంటారని చెప్పారు. ఆదివారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

సిఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్ల విషయంలో జిల్లా అధికారులు పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండాలని సూచించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. లబ్ధిదారుల ఇంటి వద్దనే పింఛను పంపిణీ చేస్తారని, గ్రామ సభలో మార్గదర్శులతో, లబ్ధిదారుల కుటుంబాలతో ముఖాముఖిలో పాల్గొంటారని చెప్పారు.

# సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు

## రహదారుల అభివృద్ధికి సత్వర చర్యలు

### కొత్త ఇఎన్‌సిగా బాధ్యతలు స్వీకరించనున్న వి. రామచంద్ర

**విజయవాడ,జూలై30,ప్రభాతవార్తప్రతినిధి:** గత ఏడాది పాలనలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి అత్యంత ఎక్కువ పేరు తెచ్చిన కీలకమైన అంశాలలో రహదారులు అభివృద్ధి ఒకటని రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.. నేడు విజయవాడలోని ఆర్ అండ్ బి కార్యాలయంలో ఆ శాఖ ఇఎన్‌సి నయిముల్లా, ఆర్‌బీ క్వాలిటీ కంట్రోల్ ఛీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు పదవీ విరమణ ఆత్మీయ అభినందన సభలో మంత్రి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.. ఈ సందర్భంగా నేడు రిటైర్ కాబోతున్న ఇఎన్‌సి నయిముల్లా, సిఇ వెంకటేశ్వరావులను మంత్రి ప్రత్యేకంగా శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి సన్మానించడం జరిగింది. అలాగే ఆర్ అండ్ బి శాఖ నూతన ఇఎన్‌సిగా బాధ్యతలు స్వీకరించనున్న వి. రామచంద్రను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు.. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఎపిఆర్టీసీ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరావు, ఆర్డీసీ ఎండీ ఎల్. శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈసందర్భంగా మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ..తనకు రెండు రోజులపాటు నియోజకవర్గంలో ముఖ్యమైన ప్రభుత్వ కార్యక్రమాలు ఉన్నప్పటికీ, మన ఆర్ అండ్ బి శాఖ కుటుంబ సభ్యులకు సంబంధించి రిటైర్ మెంట్ కార్యక్రమం జరుగుతున్న క్రమంలో ఇక్కడకు రావడం జరిగిందన్నారు.. గత ఏడాది నేను నూతనంగా ఆర్ అండ్ బి శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటికీ.. ఆర్ అండ్ బి శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఇఎన్‌సి నయిముల్లా లతో కలిసి సమన్వయంతో పనిచేస్తూ ఆర్ అండ్ బి శాఖ పురోగతికి పనిచేశామన్నారు..

01-07pg2exHMNWJQE.qxd:01-07pg2exHMNWJQE.qxd 01/01/01 9:27 AM Page 1





క్వాంటం టెక్నాలజీ వర్క్‌షాప్‌కు హాజరైన జాతీయ, అంతర్జాతీయ ఐటి కంపెనీల దిగ్గజాలు

# అమరావతి క్వాంటం వ్యాలీ

>> ఐబీఎం, ఎల్ అండ్ టీ ద్వారా చేయగలిగాం. ఐటీపై ఆలోచన చేస్తే చాలదు... దానిక ఎకోసిస్టం క్రియేట్ చేయాలి.

ఏపీకి ఎన్నో అడ్వాంటేజీలు ఉన్నాయని.. శ్రీహరికోట రాకెట్ లాంచింగ్ ఇక్కడే ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఏరోస్పేస్ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని అన్నారు. ఏపీ గ్రీన్ ఎనర్జీలో చాలా బలంగా ఉందని చెప్పారు. 1989లో కుప్పం నుంచి పోటీచేస్తూ ఒక పబ్లిక్ మీటింగ్‌లో తాను ఎల్రక్టానిక్ ఎక్స్ఛేంజ్ తెస్తానని చెప్పానన్నారు. ఆ విషయంతో తన ప్రత్యర్థులు తప్పుపట్టారని గుర్తుచేశారు. ప్రభుత్వ సర్వీసులు అన్ని ఆగస్టు 15వ తేదీ నాటికి వాట్సాప్ చాట్ బోట్ ద్వారానే నిర్వహిస్తాయని స్పష్టం చేశారు. జనవరి 1వ తేదీ నాటికి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ అమరావతి నుంచి ప్రారంభమవుతుందని ప్రకటించారు. దీనికోసం ఎకో సిస్టంతో పాటు యూజ్ కేసులు కూడా రావాలని సూచించారు. టాప్ ఏఐ యూసేజ్‌లో చైనా, యూఎస్, ఇండియా మాత్రమే ముందు ఉన్నాయని వివరించారు. టీసీఎస్ మనతో ముందునుంచి ట్రావెల్ చేస్తుందని.. ఇప్పుడు డేటాలింక్‌పై పనిచేస్తుందని వెల్లడించారు సీఎం చంద్రబాబు. పిపిపి మోడల్‌లో హైటెక్ సిటీ కట్టాలని ఎల్‌అండ్‌టీని కోరానని, తర్వాత బెంగళూరు, గుర్గామ్‌లోనూ ఐటీ భవనాలు కట్టిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఐటీకి అతిపెద్ద హబ్‌గా భారత్ మారుతుందని ఆనాడే చెప్పానన్న చంద్రబాబు, మ్యాథ్స్‌లో నిపుణులైన యువత మనకు ఉన్నారని తెలిపారు. తర్వాత ఇంజినీరింగ్ కళాశాలలు అనేకం వచ్చేలా చూశామని వెల్లడించారు.

**క్వాంటం టెక్నాలజీలో పెట్టుబడులు, స్టార్టప్‌లకు ఆహ్వానం**

క్వాంటం రంగంలో స్టార్టప్‌లు రావడానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, ఆవిష్కరణకు ఆకాశమే హద్దు అని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. అమరావతి సహా ఐదు ప్రాంతాల్లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను ఏర్పాటుచేస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పరిశ్రమలు, స్టార్టప్‌లకు సూచించారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ "ఈ మూమెంటంలో బహుళజాతి కంపెనీలు భాగస్వాములు కావాలి. ఇప్పుడే పెట్టుబడులతో ముందుకు రావాల్సిన అవసరం ఉంది. భారత్‌లోనే ఉత్పత్తులు తయారు చేసి ఇక్కడి మార్కెట్‌ను వినియోగించుకోవాలి. ఏపీలోనూ వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్‌ప్రెన్యూర్‌ను తయారుచేయాలని లక్ష్యం నిర్దేశించుకున్నాం. పాలనలో పారదర్శకత, వేగం, జవాబుదారీతనం తీసుకురావడానికి ఐటీ ఒక్కటే మార్గమని బలంగా విశ్వసించాను. హైదరాబాద్‌లో హైటెక్ సిటీని నిర్మించడం ద్వారా ఒక బలమైన ఐటీ ఎకో సిస్టమ్‌ను సృష్టించాం. ఫలితంగా ఇప్పుడు సైబరాబాద్ ప్రపంచ ఐటి కేంద్రంగా మారిందని గుర్తు చేశారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర ఆదాయంలో 75 శాతం హైదరాబాద్ నుంచే వస్తోంది. అమరావతి క్వాంటం వ్యాలీ దేశానికి మార్గనిర్దేశనం చేయాలి" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**క్వాంటం టెక్నాలజీ విజన్ లక్ష్యాలను మంత్రి లోకేష్ సాధించాలి**

కార్నెగీ మెలన్ యూనివర్సిటీలో చదువుకున్న నారా లోకేష్ ఐటీ శాఖ మంత్రిగా ఉండటం సంతోషదాయకమని గతంలో ఈ శాఖను గ్రాడ్యుయేషన్ చదువుకున్నవారు నిర్వర్తించారని సిఎం చంద్రబాబు గుర్తు చేశారు. లోకేష్‌కు క్వాంటం వ్యాలీ ద్వారా ఒక విజన్ లక్ష్యాలను సాధించే బాధ్యతను అప్పగించానని ముఖ్యమంత్రి తెలిపారు. తాను నిత్య విద్యార్థినని, భవిష్యత్ టెక్నాలజీని పాలనకు, అభివృద్ధికి ఎలా సమ్మిళితం చేయాలన్నదే తన లక్ష్యమని సిఎం స్పష్టం చేశారు. ఈ లక్ష్యాలను కేంద్ర ప్రభుత్వం సహకారంతో సాధిస్తామని ఆయన అన్నారు. అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటం కంప్యూటర్ ప్రోటోటైప్‌ను ఐబిఎం నేషనల్ వర్క్ షాప్‌లో ప్రదర్శించింది. నేషనల్ వర్క్ షాప్‌లో భాగంగా ఏర్పాటు చేసిన క్వాంటం టెక్నాలజీ స్టార్టప్‌లను మంత్రి లోకేష్‌తో కలిసి సిఎం పరిశీలించారు

**సరైన నాయకుడు దేశాన్ని పరిపాలిస్తున్నారు**

గ్రీన్‌ఎనర్జీ రంగానికి ఆంధ్రప్రదేశ్ అనుకూలమని చంద్రబాబు తెలిపారు. భవిష్యత్ మొత్తం ఎఐ, డీప్‌టెక్నాలజీ రంగాలదే హవా అని, ఏపిలో సేవలన్నీ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే అందిస్తున్నామని వెల్లడించారు. ఆగస్టు నాటికి 100 శాతం సర్వీసులు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే అందిస్తామని స్పష్టం చేశారు. ప్రజలు కార్యాలయాలకు వచ్చే అవసరం లేకుండా సర్వీసులు అందిస్తామన్న చంద్రబాబు, చాట్‌జీపీటీ ద్వారా అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తోందన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ ద్వారా శ్రమ, సమయం తగ్గుతుందని, గతంలో వినియోగదారులుగా ఉండేవాళ్లమని ప్రస్తుతం తయారీదారులుగా మారామన్నారు. సరైన సమయంలో సరైన నాయకుడు దేశాన్ని పరిపాలిస్తున్నారని మోడీని కొనియాడారు. సంపద సృష్టిస్తామని, సృష్టించిన సంపాదనను ప్రజలపై ఖర్చు చేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఆవిష్కరణలకు ఆకాశమే హద్దని అని, అమరావతిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. గతంలో ప్రతి ఇంట్లో ఒక ఐటీ నిపుణుడు ఉండాలనేది తన నినాదమన్న చంద్రబాబు, ప్రస్తుతం ప్రతి ఇంట్లో ఒక ఆవిష్కర్త ఉండాలనేదే తమ లక్ష్యమని చెప్పారు. ఏవైనా అడ్డంకులు ఉంటే తన దృష్టికి తీసుకురండని, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వర్క్‌షాప్‌లో ప్రముఖ ఐటీ, బహుళజాతి సంస్థల ప్రతినిధులు, కేంద్రప్రభుత్వంలోని ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.



హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సమావేశంలో పాల్గొన్న స్పీకర్ ఓంబిర్లా తదితరులు

# రాష్ట్ర బిజెపి సారథిగా మాధవ్

>> రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం అధ్యక్ష ఎన్నిక నిర్వహించనున్నారు. కర్ణాటక ఎంపి మోహన్ ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించనున్నారు. ఇప్పటికే ఈ పదవి కోసం అనేక మంది ఆశావహులు తమ వంతుగా తమకు అధిష్టానంతో ఉన్న పరిచయాలతో ప్రయత్నాలు చేశారు. పార్టీ అధిష్టానం అధ్యక్ష మార్పు చేయకపోతే ప్రస్తుత అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కొనసాగుతారని అంతా అంచనా వేశారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనాచౌదరి, మాజీ సిఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, పూర్వ అధ్యక్షులు సోము వీర్రాజు, విర్త్రీ మాజీ ఉపాధ్యక్షులు విష్ణువర్ధనరెడ్డితోపాటు పలువురి పేర్లు ప్రచారం జరిగాయి. చివరికి పివిఎన్ మాధవ్ పేరును ఖరారు చేస్తూ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. సుదీర్ఘ కాలం నుంచి బిజెపి లోనే ఉంటూ వస్తున్న మాదవ్‌ను ఎంపిక చేయడం ద్వారా పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యం ఇచ్చినట్టు అవుతుందన్నది అధిష్టానం ఆలోచనగా కనిపిస్తోంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నియోజకవర్గాల నుండి శాసన మండలి సభ్యునిగా మాధవ్ పనిచేశారు. 1973 ఆగస్టు 10న జన్మించిన మాధవ్ తల్లిదండ్రులు పివి చలపతిరావు, రాధాచలపతి. గుడిలోవ విజ్ఞాన విహార్, శ్రీ కృష్ణ విద్యా మందిర్, డాక్టర్ వీఎస్ కృష్ణ కాలేజ్‌లలో విద్యాభ్యాసం చేశారు. బీకాం చేస్తూనే కాస్ట్ అకౌంటెంట్ పూర్తి చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తి చేశారు. చిన్న తనంలోనే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో స్వయం సేవక్‌గా చేరారు. ఆర్ఎస్ఎస్ విశాఖ నగర కార్యదర్శిగా, రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడిగా సేవలందించారు. అఖిల భారత విద్యార్థి పరిషత్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. విభిన్న సామాజిక, రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. స్వదేశీ దేశీ జాగరణ్ మంచ్‌లో పూర్తికాలం కార్యకర్తగా చేరి దేశమంతా పర్యటించారు. మాధవ్ తన కుటుంబంలో రెండవ తరం బిజెపి నాయకుడు. ఆయన తండ్రి కుడా సీనియర్ బిజెపి నేత. గతంలో ఆరేళ్లపాటు ఎపి బిజెపి అధ్యక్షుడిగా పనిచేశారు. మాధవ్ బిసి నేత కావడం మరో కారణం. అన్నిటికీ మించి సౌమ్యుడు. రాజకీయ వివాదాలకు దూరంగా ఉంటారు. ఎపిలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ఆ పార్టీలతో కూడా సమన్వయం చాలా అవసరం.

# రేపటి నుంచి ప్రధాని 5 దేశాల పర్యటన

**న్యూఢిల్లీ,జూన్ 30:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. జులై 2వ తేదీ నుంచి ఎనిమిది రోజుల పాటు రెండు ఖండాల్లోని ఐదు దేశాల్లో ఆయన పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాలను సందర్శిస్తారు. బ్రెజిల్‌లో జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనడంతో పాటు, గ్లోబల్ సౌత్‌లోని కీలక దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్ఠం చేసుకోవడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. విదేశాంగ శాఖ ఆర్థిక సంబంధాల కార్యదర్శి దమ్ము రవి వివరాల ప్రకారం, ప్రధాని మోదీ తన పర్యటనను జులై 2న ఆఫ్రికా దేశం ఘనాతో ప్రారంభిస్తారు. జులై 3 వరకు అక్కడే ఉంటారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఒక భారత ప్రధాని ఘనాలో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఘనా అధ్యక్షుడితో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఆర్థికం, ఇంధనం, రక్షణ రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవడంపై చర్చిస్తారు. అనంతరం జులై 3, 4 తేదీల్లో కరేబియన్ దేశమైన ట్రినిడాడ్ అండ్ టొబాగోలో పర్యటిస్తారు. 1999 తర్వాత ఈ దేశంలో భారత ప్రధాని పర్యటించడం కూడా ఇదే ప్రథమం. అక్కడి నుంచి ప్రధాని నేరుగా దక్షిణ అమెరికాలోని అర్జెంటీనాకు వెళ్తారు. జులై 4,5 తేదీల్లో ఆ దేశంలో పర్యటిస్తారు. అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలేతో మోడీ విస్తృతంగా చర్చిస్తారు. రక్షణ, వ్యవసాయం, మైనింగ్, చమురు, గ్యాస్, పునరుత్పాదక ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడులు వంటి కీలక రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే అంశాలపై ఇరువురు నేతలు దృష్టిసారిస్తారు.

ఈపర్యటన ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. అర్జెంటీనా పర్యటన ముగిశాక, ప్రధాని మోదీ జులై 5 నుంచి 8వ తేదీ వరకు బ్రెజిల్‌లో పర్యటిస్తారు. రియో డి జనీరో వేదికగా జరగనున్న 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొంటారు.

ప్రపంచ పాలనా సంస్కరణలు, శాంతి భద్రతలు, కృత్రిమ మేధస్సు వినియోగం, వాతావరణ మార్పులు, ప్రపంచ ఆరోగ్యం, ఆర్థిక అంశాలపై ప్రధాని తన అభిప్రాయాలను పంచుకోనున్నారు. సదస్సు సందర్భంగా పలు దేశాధినేతలతో కూడా ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. చివరగా, జులై 9న నమీబియాకు చేరుకుని ఆ దేశంతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ప్రధాని నమీబియా పార్లమెంటులోకూడా సభ్యుల నుద్దేశించి ప్రసంగిస్తారు.

# చార్జీల మోత

>> కిలోమీటర్ల వరకు రూ.10 పెరగనుండగా.. 2501 కిలోమీటర్ల నుంచి 3వేల కిలోమీటర్ల వరకు రూ.15 చార్జీ పెంచింది. మరో వైపు ఫస్ట్ క్లాస్, స్లీపర్ క్లాసుల్లో కిలో మీటర్‌కు అరపైసా వైపు ఫస్ట్ క్లాస్, స్లీపర్ క్లాస్లో కిలోకు మీటరుకు అరపైసా పెరిగింది. అయితే, స్థానిక, సీజనల్ టికెట్లపై ఎలాంటి ప్రభావం ఉండదని పేర్కొంది. స్థానిక రైళ్లు, ఎంఎస్టీ హోల్డర్ల ప్రయాణికులకు రైల్వే ఉపశమనం కల్పించింది. రైల్వేలు సబర్బన్, సీజన్ టిక్కెట్ల ఛార్జీలను పెంచలేదు. ఎంఎస్టీ, క్యూఎస్టి ప్రయాణికులపై పెరిగిన చార్జీల ప్రభావం ఉండదని పేర్కొంది. ఇదిలా ఉండగా.. రైల్వే పరిధిలోని అన్ని ప్రీమియం రైళ్లలో టికెట్ల ధరలు పెరిగాయి. తేజస్, రాజధాని, శతాబ్ది, దురంతో, వందే భారత్, హమ్సఫర్, అమృత్ భారత్, మహామన, గతిమాన్, అంత్యోదయ, గరీబ్ రథ్, జన శతాబ్ది, యువ ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లలో సాధారణ సర్వీసుల (నాన్‌సబర్బన్), అనుభూతి కోచెస్, ఎసి విస్టాడోమ్ కోచ్‌ల్లో తరగతి వారీగా చార్జీలను సవరించింది. ఈ చార్జీలు జులై ఒకటి నుంచి అమలులోకి రానున్నాయి. అయితే, జూన్ 30వ తేదీ వరకు బుక్ చేసుకున్న టికెట్ల ధరలపై ఎలాంటి ప్రభావం ఉండదని.. ఒకటి తర్వాత ప్రయాణం చేసినా ఎలాంటి అదనపు చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని రైల్వేశాఖ వర్గాలు తెలిపాయి.

# అభిప్రాయ సేకరణ

>> విధంగా మారింది. ఇలా ప్రతిరోజూ తిరుమలకు వచ్చిన భక్తుల ద్వారా అభిప్రాయాలు తీసుకుని ఏ విభాగంలోనైనా లోటుపాట్లు, మార్పులు చేపట్టే విషయంలో చర్యలు తీసుకునే వెసలూబాటు కలిగింది.

**90వేలమందిభక్తుల నుండి అభిప్రాయం:**

కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి దేశం నలుమూలలనుండేగాక విదేశాల నుండి రోజుకు సరాసరి 90వేలమంది వరకు భక్తులు కొండపైకి వస్తున్నారు. సుమారుగా 80వేలమంది వరకు యాత్రికులు ఇష్టదైవాన్ని దర్శించుకుంటున్నారు. వారాంతం శని, ఆదివారాల్లో ఈ రద్దీ మరింతగా పెరిగి 1.20లక్షలమంది వరకు చేరుకుంటున్నారు. అదనంగా మరో పదివేలమంది వరకు భక్తులకు శ్రీవారి దర్శనం చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో సాధారణరోజుల్లోకూడా దేవదేవుని దర్శనానికి 10గంటలు సమయం వేచివుండాల్సిన అవసరం ఉంది. గంటల తరబడి వెలుపల క్యూలైన్లలో వేచివుండటం, వైకుంఠమ్ 1,2క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లలోనూ గంటల తరబడి నిరీక్షణ తప్పడంలేదు. రోజుకు అన్నప్రసాదాలు కూడా లక్షమందికిపైగా భక్తులు స్వీకరిస్తున్నారు. ఇక తిరుమలలో సామాన్యభక్తుల కోసం ఆఫ్‌లైన్‌లోనూ గదులు కేటాయింపు సిఆర్ఓ కార్యాలయం, ఎంబిసి, పద్మావతివిచారణ కార్యాలయం వద్ద పారదర్శకంగానే జరుగుతోంది. ప్రపంచంలోనే పెద్ద ధార్మికసంస్థ టిటిడి ఇప్పుడు భక్తులకు మరింత మెరుగైన సేవలందించేందుకు అభిప్రాయసేకరణ కూడా ఒక కీలకంగా మారింది. ఐవిఆర్ఎస్ ద్వారా భక్తులు తిరుమలలోని అన్నప్రసాదం, కల్యాణకట్ట, వసతికోసం, దర్శనం, లడ్డూకౌంటర్లు, లగేజీకౌంటర్లు, క్యూలైన్ల వద్ద ఉన్న సేవలపై తమ అభిప్రాయాలను, సూచనలు చెప్పే వెసలుబాటు కలిగింది. ప్రస్తుతం శ్రీవారిసేవకుల ద్వారా మాన్యువల్‌గా అభిప్రాయాలు తీసుకుంటున్నారు.

**త్వరలో టిటిడి మొబైల్‌యాప్, బుకింగ్‌పోర్టల్:**

తిరుమల, తిరుపతిలోని వివిధ ప్రాంతాల్లో భక్తులకు అందిస్తున్న సౌకర్యాలపై త్వరలోనే టిటిడి మొబైల్‌యాప్, టిటిడి బుకింగ్ పోర్టల్ నుండి భక్తులు విలువైన సలహాలు ,సూచనలు తీసుకోవడానికి అప్లికేషన్ రూపొందించబడుతున్నది. భక్తుల అభిప్రాయాన్ని గౌరవిస్తూ సేవలను మరింత మెరుగుపరచడంకోసం ఈ సర్వేల ద్వారా వారి ప్రత్యక్ష అనుభవాలను సేకరించడం జరుగుతోంది. ఈ విధానాల ద్వారా భక్తులు తమ అభిప్రాయాలను తెలియజేసి ఆన్‌లైన్ సేవలను మెరుగుపరిచేందుకు తోడ్పాటునివ్వాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.

# దేశవ్యాప్తంగా వచ్చే వారంరోజులపాటు భారీ వర్షాలు

**న్యూఢిల్లీ,జూన్ 30:** దేశవ్యాప్తంగా వచ్చే వారం రోజుల్లోతూర్పు, మధ్యభారత్‌లతోపాటు వాయవ్యభారత్‌లలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. జార్ఖండ్, హిమాలయన్ పరీవాహక ప్రాంతం, పశ్చిమబెంగాల్; సిక్కిమ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘర్‌లలో సోమవారంనుంచి జులై ఆరో తేదీవరకూ ఒకమోస్తరునుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. అలాగే బీహార్, ఒడిశా రాష్ట్రాలకు నాలుగో తేదీవరకూ భారీ వర్షాలు తప్పవని హెచ్చరించింది. విదర్భ ప్రాంతం, పశ్చిమబెంగాల్‌లోని సముద్ర తీరప్రాంతం మొత్తం భారీ వర్షం కురుస్తుందని తేల్చింది. జులై 6వ తేదీవరకూ ఇదేతీరు వర్షాలు కురుస్తాయి. ఇక మధ్యప్రదేశ్ తూర్పుప్రాంతంలోను, ఛత్తీస్‌ఘర్‌లోను నాలుగోతేదీవరకూ భారీ వర్షాలు ఉంటాయి. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్లవేగంతో ఈదురుగాలులతోపాటు తీవ్రస్థాయి మేఘావృతం అయిన రాష్ట్రాలు ఎకునకవగా ఉన్నాయి. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉతనతరప్రదేశ్, పంజాబ్, తూర్పురాజస్థాన్ ప్రాంతాలకు జులై 6వ తేదీవరకూ ఒకమోస్తరునుంచి భారీ అతిభారీ వర్షాలుంటాయని వాతావరణ శాఖ అంచనావేసింది. హర్యానా, ఛండీఘర్‌ప్రాంతాల్లోకూడా అదే తీరులో వర్షాలుంటాయని తెలిపింది. ఇక పశ్చిమరాజస్థాన్‌ప్రాంతంలో కూడా ఒకమోస్తరునుంచి భారీ వర్షాలు జులై ఆరువరకూ కురుస్తాయని వెల్లడించింది. ఉత్తరాఖండ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హర్యానాల్లో 30 నుంచి జులై ఐదోతేదీవరకూ వర్షాలుంటాయి. ఉరుములు మెరుపులతోపాటు దట్టమైన మేఘాలతో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలుంటా యని తేల్చింది. ఇక పశ్చిమభారతావని కొంకణ్, గోవా, మధ్య మహారాష్ట్ర లోని ఘాట్‌ప్రాంతాలు, గుజరాత్‌లలో కూడా వచ్చే వారంరోజులపాటు రుతుపవనాలు అధికంగానే ఉంటాయి. ఈశాన్యప్రాంతంలోకూడా వర్షాలు ఒకమోస్తరునుంచి భారీగా ఉంటాయని ఐఎండి అంచనా. అరుణాచల్‌ప్రదేశ్, అస్సామ్, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్; మిజోరామ్, త్రిపుర, అస్సాం ప్రాంతాల్లో జులై ఆరువరకూ కూడా ఒకమోస్తరునుంచి కుంభవృష్టి వర్షాలుంటాయి. ఇక ఆంధ్రప్రదేశ్ కోస్తాప్రాంతం, తెలంగాణల్లో ఒకమోస్తరుగా వర్షపాతం ఉంటుంది. కేరళ, మాహే ప్రాంతాల్లో జులై నాలుగువరకూ భారీ వర్షాలుంటాయని, అలాగే కర్ణాటక కోస్తా, కర్ణాటక గ్రామీణప్రాంతాల్లో ఐదో తేదీవరకూ వర్షాలుంటాయి. అలాగే గంటకు 50 కిలోమీటర్ల వేగంతో

# నాలుగు రోజులు వర్ష సూచన

>> భారీ వర్షాలు పడతాయని తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం పూర్తి మంగుగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉపగ్రహ అంచనాల ప్రకారం. ఆంధ్రప్రదేశ్‌లో సోమవారం రోజంతా మేఘాలు ఉంటాయి. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్రలో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకూ తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురుస్తూ ఉంటుంది. కొన్ని చోట్ల భారీగా కూడా పడుతుంది. ఉత్తరాంధ్రపై సుడి గాలులు వీస్తున్నాయి. అందువల్ల అక్కడి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రాయలసీమలో ఇవాళ పొడి వాతావరణం ఉంటుంది. ఎపిలో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసాయి.

# బుడమేరు ముంపు నివారణకు ముందు జాగ్రత్త

## రికార్డు స్థాయిలో పనులు పూర్తి: మంత్రి నిమ్మల రామానాయుడు

**సచివాలయం,జూన్ 30,ప్రభాతవార్త :** గత ఏడాది విజయవాడ నగరాన్ని ముంచెత్తిన బుడమేరు వరదకు సంబంధించి బుడమేరు గట్టుకు ఏర్పడ్డ మూడు గండ్లను కలుపుతూ 365మీటర్ల పొడవునా చేపట్టిన సీసీ వాల్ నిర్మాణం పూర్తయినట్లు జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. సోమవారం ఈ పనుల పరిశీలన అనంతరం మంత్రి మాట్లాడారు. సీసీ వాల్ నిర్మాణానికి సంబంధించిన పనులకు ఏప్రిల్ నెలలో ఆర్థిక ఆమోదం లభించగా మే నెలలో టెండర్లు పిలిచి సీజన్ ప్రారంభం కాకుండానే రికార్డు స్థాయిలో పూర్తి చేయగలిగామన్నారు. సీసీ వాల్‌తో పాటు 7కిమీ పొడవున బుడమేరు ఎడమ గట్టు అర మీటర్ ఎత్తు పెంచి నిర్మిస్తూ బలోపేతం చేస్తున్నామని ఆయన చెప్పారు. అదేవిధంగా వెలగలేరు రెగ్యులేటర్‌కి సంబంధించి గత ఏడాది వరద వచ్చినప్పుడు గేట్లు ఓపెన్ కాలేదు. అందుకు కారణం గత ఐదేళ్ళ పాలనలో కనీసం వారు గ్రీజు కూడా పెట్టలేదు. మెయింటెనెన్స్ పనులు చేయలేదు. దీంతో అప్పట్లో స్థానిక రైతుల సహకారం తీసుకొని జేసిబిలు ఉపయోగించి ఆ గేట్లను తెరవడం జరిగింది. ఇప్పుడు వెలగలేరు రెగ్యులేటర్‌కు సంబంధించి మొత్తం 12గేట్లను 1.8కోట్ల రూపాయలు ఖర్చుచేసి కొత్తవి అమర్చినట్లు మంత్రి చెప్పారు. అదేవిధంగా విజయవాడకు సంబంధించి బుడమేరు పాత ఛానల్, ఏనికేపాడు యూటి ప్రస్తుత సామర్థ్యం 4వేల క్యూసెక్కులు ఉంది. దాన్ని 20వేల క్యూసెక్కులకు పెంచుతున్నామన్నారు. దీనితోపాటు, ఎనికేపాడు నుండి కొల్లేరు కు వెళ్ళేటువంటి బుడమేరు డ్రైన్ 57కిమీ పొడవునా మొత్తం డిసిల్టింగ్ చేసుకుంటూ సాఫీగా నీరు ప్రవహించేలా పనులు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. కొల్లేరు కు వచ్చే నీటిని కూడా ఉప్పుటేరు మీదుగా సముద్రంలోనికి వెళ్ళేలా రూ.9కోట్ల నిధులతో టెండర్లు పిలిచి, అక్కడ పూడిక తీత పనులు కూడా చేస్తున్నామన్నారు.

ఆపరేషన్ బుడమేరు శాశ్వత ప్రాతిపదికను పూర్తి చేయడానికి మరో మూడు నాలుగు ఏళ్ళు పట్టవచ్చు, ఆర్థికపరమైన ఆమోదాలు, కేంద్రప్రభుత్వం, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, వీటన్నింటి సహకారంతో, సమన్వయంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు త్వరితగతిన పూర్తి చేయడానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు.

ఆయన సూచన మేరకు అప్పటి వరకు వేచి చూడకుండా నగరానికి భద్రత కోసం తక్షణ ప్రాతిపదికన చేపట్టిన పనులన్నీ పూర్తి చేసినట్లు మంత్రి చెప్పారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అడ్వైజర్ ఎం.వేంకటేశ్వ రరావు, ఈఎన్సీ నరసింహామూర్తి, కృష్ణా డెల్టా సిఇ రాంబాబుతో పాటు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పర్యాటకరంగంలో ప్రైవేటు భాగస్వామ్యం

## 30 హోటళ్లు, రెస్టారెంట్లు, రిసార్ట్‌ల నిర్వహణలో సమూల మార్పులు

### త్వరలో ఆసక్తి వ్యక్తీకరణ ప్రతిపాదనలు ఆహ్వానించనున్న పర్యాటకాభివృద్ధి సంస్థ

**విజయవాడ,జూన్30,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థకు చెందిన హోటళ్ళు, రిసార్టులు, రెస్టారెంట్‌లకు ఒకసారి వెళ్ళిన వారు రెండో సారి మళ్ళీ అటువైపు వెళ్ళట్లేదు. వాటి నిర్వహణ అత్యంత అధ్వాన్నంగా తయారైంది. ఈ పరిస్థితుల్లో మార్పు తెచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. హోటళ్ళు, రిసార్ట్‌లు పర్యాటకులను ఆకర్షించేలా వాటి నిర్వహణలో ప్రైవేటు సంస్థలను భాగస్వాములను చేయనుంది. దాదాపు 30 యూనిట్లలో మెరుగైన వసతులు, చక్కటి ఆతిథ్యం పర్యాటకులకు లభించేలా చూడాలి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు రాష్ట్రపర్యాటకాభివృద్ధి సంస్థ ఆసక్తి వ్యక్తీకరణ ప్రతిపాదనలు ఆహ్వానించనుంది. హోటళ్ళు, రిసార్టుల్లో ఏటా రూ.70 కోట్ల వ్యాపారం జరుగుతున్నట్లు అంచనా. ఇందులో సంస్థకు రూ.7-8 కోట్ల ఆదాయం వస్తోంది. 30 యూనిట్లలో నిర్వహణకు ప్రైవేటుకు అప్పగించడం ద్వారా లీజుల క్రింద ఏటా రూ.12-15 కోట్లు వస్తుందని భావిస్తున్నారు. విశాఖపట్నంలో యాత్రినివాస్, విజయవాడలో బెర్మ్ పార్క్, భవానీద్వీపం, దిండి, శ్రీశైలం ,నెల్లూరు, కర్నూలులో పర్యాటక హోటళ్ళు, రిసార్ట్‌ల నిర్వహణకు అనేక ప్రైవేట్ ఆతిథ్య సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. వీటిలో పనిచేస్తున్న 700 మంది ఉద్యోగులు నైపుణ్యాలు పెంచుకునేలా శిక్షణనిచ్చి ఆ మేరకు ప్రైవేటు సంస్థలు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. విశాఖ మన్యంలోని అరకు, లంబసింగి తదితర ప్రాంతంల్లో పర్యాటకాభివృద్ధి సంస్థ రిసార్ట్‌లను ప్రైవేటుకు లీజుకు ఇవ్వడం 1/70 చట్టం ప్రకారం సాధ్యం కానందున అక్కడ ప్రాజెక్ట్ నేజ్‌మెంట్ కాంట్రాక్ట్ (పీఎంసీ) విధానం అమలు చేసే యోచనలో ఉంది.

# ఒకేఒక్క స్కాన్‌తో 9 రకాల అల్జీమర్స్ వ్యాధులు గుర్తింపు

**వాషింగ్టన్,జూన్ 30:** వైద్య రంగంలో మరో అద్భుతం ఆవిష్కృతమైంది. అల్జీమర్స్ వంటి మతిమరుపు వ్యాధులను (డిమెన్షియా) అత్యంత కచ్చితత్వంతో, వేగంగా గుర్తించేందుకు అమెరికా పరిశోధకులు ఒక కొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్‌ను అభివృద్ధి చేశారు. స్టేట్‌వ్యూయర్ అని పిలిచే ఈ టూల్, కేవలం ఒకే ఒక్క స్కాన్‌తో ఏకంగా తొమ్మిది రకాల డిమెన్షియాలను గుర్తించగలదు. ఇది మెదడు పనితీరును దెబ్బతీసే వ్యాధుల న్యూరోడిజనరేటివ్ నిర్ధారణలో ఒక విప్లవాత్మక ముందడుగుగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. అమెరికాలోని ప్రఖ్యాత మేయో క్లినిక్‌కు చెందిన పరిశోధకులు ఈ ఏఐ టూల్‌ను రూపొందించారు. ఈ టూల్ పనితీరు అమోఘమని, సుమారు 88 శాతం కేసులలో ఏ రకమైన డెమెన్షియానో కచ్చితంగా చెప్పగలిగిందని వారు తెలిపారు. వైద్యులు అనుసరిస్తున్న పద్ధతులతో పోలిస్తే, ఈ టూల్ సహాయంతో మెదడు స్కానింగ్‌లను రెట్టింపు వేగంతో విశ్లేషించవచ్చని, రోగ నిర్ధారణలో కచ్చితత్వం మూడు రెట్లు పెరిగిందని వెల్లడించారు. ఈ పరిశోధన వివరాలను ప్రఖ్యాత న్యూరాలజీ జర్నల్‌లో ప్రచురించారు. సాధారణంగా అందుబాటులో ఉండే ఫ్లోరోడీఆక్సీగ్లూకోజ్ పాజిట్రాన్ ఎమిషన్ టోమోగ్రఫీ స్కాన్‌ను ఈ ఏఐ టూల్ విశ్లేషిస్తుంది. ఈ స్కాన్ ద్వారా మెదడు శక్తి కోసం గ్లూకోజ్‌ను ఎలా వినియోగించుకుంటుందో తెలుసుకోవచ్చు. 'స్టేట్‌వ్యూయర్', రోగి స్కాన్‌ను దాదాపు 3,600కు పైగా ధ్రువీకరించబడిన స్కాన్‌ల డేటాబేస్‌తో పోల్చి చూస్తుంది. ఈ డేటాబేస్‌లో వివిధ రకాల డెమెన్షియా రోగుల స్కాన్‌లతో పాటు, ఆరోగ్యవంతుల స్కాన్‌లు కూడా ఉంటాయి. తద్వారా, ఏ రకమైన డిమెన్షియాకు సంబంధించిన నమూనాలు రోగి మెదడులో ఉన్నాయో ఇది గుర్తిస్తుంది. అల్జీమర్స్ వ్యాధి మెదడులోని జ్ఞాపకశక్తి, సమాచార ప్రాసెసింగ్ ప్రాంతాలపై ప్రభావం చూపుతుంది.

## వారం - వర్జ్యం

తేది : 01-07-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
షష్ఠి ఉ.10.23
పూర్వఫల్గుణి ఉ.8.55
వర్జ్యం సా.4.47-6.32
దు.ఉ.8.16-9.08, 2) రా.11.59-12.51
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. సంతానం నూతన విద్యావకాశాలు పొందుతారు

**వృషభం :** ఉద్యోగాలలో పదోన్నతులు పొందుతారు. కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ధన, వస్తు లాభాలు..

**మిథునం:** ఆకస్మిక ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు. విందు, వినోదాలు, శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**కర్కాటకం:** ఆరోగ్యం, వాహనాల విషయాలలో నిర్లక్ష్యం తగదు. రాజకీయ, పారి శ్రామిక కళారంగాలలోని వారికి కొంత అనుకూలం.

**సింహం :** భాగస్వామ్య వ్యాపారాలలో లాభాలు పొందుతారు. పట్టుదలతో ముందుకుసాగుతారు. వాహనసౌఖ్యం.

**కన్య :** పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. నూతన మిత్రులు పరిచయమై సహాయ సహకారాలు అందిస్తారు

**తుల :** గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. నూతన ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

**వృశ్చికం:** పెట్టుబడులలో తొందరపాటు వద్దు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

**ధనుస్సు:** కీలక నిర్ణయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకొంటారు. ఇంటర్వ్యూలు, పోటీపరీక్షలకు హాజరుతారు.

**మకరం:** గృహనిర్మాణ ఆలోచనలలో తొందరపాటు వద్దు. ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

**కుంభం :** శ్రమ తప్ప ఫలితం అంతగా ఉండదు. కొత్త కార్యక్రమాలు చేపట్టినా ముందుకు సాగవు. స్వల్పధనలాభం.

**మీనం :** షేర్లు, భూముల క్రయ విక్రయాలలో ప్రోత్సాహకరంగా వుంటుంది. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పురావస్తు తవ్వకాల్లో బయటపడిన ప్రాచీన నదీమార్గం

**జైపూర్,జూన్,30:** రాజస్థాన్‌లోని దీగ్‌జిల్లా బహజ్ గ్రామంలో భారత పురావస్తు శాఖ జరిపిన తవ్వకాల్లో సుమారు 4,500 ఏళ్ల నాటి నాగరికతకు సంబంధించిన ఆధారాలు బయటపడ్డాయి. ఈ ఆవిష్కరణలు మహాభారత కాలం, హరప్పామహెంజోదారో తర్వాతి కాలం, మౌర్యుల కాలం, కుషాణుల కాలం, గుప్తుల కాలం సహా 5 విభిన్న చారిత్రక యుగాలకు సంబంధించినవి. ఈ తవ్వకాలు రాజస్థాన్ చరిత్రలో అత్యంత లోతైనవి. ఇవి 23 మీటర్ల లోతు వరకుజరిగాయి. ఈ తవ్వకాల్లో రుగ్వేదంలో ప్రస్తావించిన సరస్వతీ నదికి చెందిన పురాతన నదీ ప్రవాహ మార్గం (పాలియో ఛానల్)ని గుర్తించారు. ఈ నదీ మార్గం మధుర, బ్రజ్ ప్రాంతాలతో సాంస్కృతిక సంబంధాల్ని కలిగి ఉండవచ్చని సైట్ హెడ్ పవన్ సారస్వత్ తెలిపారు. మన దేశంలో గంగ, యమున, సరస్వతి నదులుకలిసే ప్రాంతాన్ని త్రివేణీ సంగమం అంటారు. ఐతే అక్కడ గంగ, యమున నదులు మనకు కనిపిస్తాయి. సరస్వతి అంతర్వాహినిగా ప్రవహిస్తోందని చెబుతారు. ఇలాంటి నది ఏదీ లేదని కొందరు చెబుతుంటారు. తాజా తవ్వకాల అన్వేషణతో సరస్వతీ నదిఉనికిని సైంటిఫిక్‌గా ధృవీకరించడమే కాకుండా, ఈ ప్రాంతంలో తొలి మానవ ఆవా సాల ఉనికినికూడా గుర్తించారు. ఈ తవ్వకాల్లో 800కు పైగా కళాఖండాలు బయటపడ్డాయి, వీటిలో బ్రాహ్మీ లిపి ముద్రలు, రాగి నాణేలు, యజ్ఞ కుండాలు, శివపార్వతి విగ్రహాలు, ఎముకలతో చేసిన సూదులు, దువ్వెనల వంటి పనిముట్లు ఉన్నాయి.

1-7Pg3exHMNWJQBEKPT.qxd:1-7Pg3exHMNWJQBEKPT.qxd 01/01/01 9:25 AM Page 1



# మైనింగ్ కబంధ హస్తాల్లోని భూములను పేదలకు పంచాలి

## పేదలపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తేయాలి, ఏఐకెఎంఎస్ జాతీయ కార్యదర్శి బి.భాస్కర్



**గూడూరు, జూన్ 30, ప్రభాతవార్త:** గూడూరు మైనింగ్ కబంధ హస్తాల్లోని బంజరు మిగులు భూములను పేదలకు పంచాలని డిమాండ్‌తో ఆదివిలాగా వున్న బంజరు భూమిలో దిగి చెట్టు పుట్ట తొలగించుకొని నిరుపేదలు సాగు చేసుకోవాలని దిగితే సంబంధం లేని వెంకట క్రిష్ణ మైనింగ్‌తో పోలీస్ ద్వారా సుమారు 50 మంది దళితులు పైఅక్రమ కేసు బనాయించడం దారుణమని తక్షణమే పేదల పై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని ఏ ఐ కె ఎం ఎస్ జాతీయ కార్యదర్శి బి భాస్కర్ డిమాండ్ చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరు లోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో మైనింగ్ కబంధ హస్తాలలోని మైనింగ్ మిగులు భూములను పేదలకు పంచాలని డిమాండ్‌తో జిల్లా సదస్సుకు ఏ ఐ కె ఎం ఎస్ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు డి పి పోలయ్య అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా బి భాస్కర్ మాట్లాడుతూ కేంద్రం లో మోడీ 3.0 ప్రభుత్వం అధికారం చేపట్టాక బడా కార్పొరేట్ కంపెనీలకు ఆదానీ అంబానీలకు దాసోహం అయిందని విమర్శించారు. నాటికి 70 శాతం మంది ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్ శక్తులకు కట్ట బెట్టడానికిపూనుకుందని ఆరోపించారు. ఈ నూతన వ్యవసాయ విధానం ఆ కోవలోని దేనన్నారు. అఖిలభారత రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి ప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు వందలవేల ఎకరాలు అప్పనంగా కట్టబెడుతున్నాయని ఆరోపించారు. పారిశ్రామిక వాడలు సెజ్‌లు హైవేలు పేరుతో వ్యవసాయ భూములను సముద్ర తీర ప్రాంతాలను కార్పొరేట్లు వరంచేస్తున్నారన్నారని విమర్శించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా ఏ ఐ కె ఎం ఎస్ జిల్లా అధ్యక్షులు డి పి పోలయ్య మాట్లాడుతూ సైదాపురం మండలంలోని ఊటుకూరు గ్రామ సర్వే నంబర్356,359 లో 400 ఎకరాలలో ప్రభుత్వ భూములు ఉన్నా యన్నారు. సర్వే నంబర్ 356లో 215.65 ఎకరాలు మేత పోరంబోకు భూములను ఆగ్రామంలోని భూస్వాములు పెత్తందారులు అక్రమంగా ఆక్రమణ చేసి ఒక్కొక్కరు 5 నుండి 10 ఎకరాలలో వ్యవసాయం చేస్తున్నారన్నారు. భూ స్వాముల ఆక్రమణలోని భూముల పట్ల రెవిన్యూ యంత్రాంగం కళ్ళున్న కబోదిలా వ్యవహరిస్తుం దన్నారు. 359 పై 2లోని 50 ఎకరాల ప్రభుత్వ భూమిని నిరుపేదలు ఆక్రమించుకుని చెట్టు పుట్ట తొలగిస్తే మాత్రం రెవిన్యూ అధికారులు నిద్ర వత్తిడం లేదని ఎద్దేవా చేశారు. మార్చి 29న సైదాపురం పోలీస్ స్టేషన్‌లో 14 మంది పై మరి కొందరి పై అక్రమ కేసులను పెట్టారన్నారు. కొంతమంది మైనింగ్ యాజమాన్యాలతో రెవి న్యూ యంత్రాంగం పోలీసులు కుమ్మక్కై పేదలపై అక్రమ కేసులను పెట్టి భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా పేదలకు ప్రభుత్వ భూముల ను దక్క కుండా కుట్ర చేస్తున్నారన్నారు. పేదలు సాగు చేసుకుంటున్న 50 ఎకరాల భూములకు పట్టాలు కల్పించాలని సైదాపురం మండలం తహశీల్దారు నెల్లూరు ఆర్ డి ఓ జిల్లా కలెక్టర్ కు మొర పెట్టుకున్నా అరణ్య రోదన గా మిగిలిపోయిందన్నారు. అసైన్మెంట్ చట్టం అనేక సవరణలకు గురైందన్నారు. అసైన్మెంట్ చట్టం అమలులో ఉన్నప్పటికి సుమారు 25 లక్షలకు పైగా అసైన్డ్ భూములు అన్యాక్రాంతం అయి నట్లు కోనేరు రంగారావు కమిషన్ తేల్చిం దన్నారు. అన్యాక్రాంతం అయిన అసైన్మెంట్ భూములను లబ్ధిదారులకు దళితులకు పేదలకు ప్రభుత్వం స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. ఎ ఐ ఎఫ్ టియు జాతీయ అధ్యక్షులు ఆర్కెష్ కృష్ణయ్య మాట్లాడుతూ అఖిల భారత రైతు కూలిసంఘం నాయకత్వంలో భూమి కోసం భుక్తి కోసం అనే నినాదంతో మైనింగ్ కబంధ హస్తాలలో ఉన్న భూములను పోరాడి విడిపించి పేదలకు ఆ భూములను పంచేదాకా వెన్ను చూపకుండా పోరాటాలు సాగిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ టియు ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు కె రమేష్, ప్రగతి శీల మహిళా నాయకురాలు బి మమత, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు డి నవ కోటి, కె వెంగల్ రావు, ఏఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి ఎం అంకయ్య పాల్గొన్నారు.

### దుత్తలూరులో దారుణం..

# అత్త,మామలను హత్యచేసిన అల్లుడు

## భార్యపై కూడా దాడి, పోలీసులు విస్తృత గాలింపు

**దుత్తలూరు,( నెల్లూరు) జూన్ 30, ప్రభాతవార్త :** కన్న తల్లి, దండ్రుల్లా చూసుకోవలసిన అల్లుడే మానవమృగంగా మారి స్వయాన పిల్లనిచ్చిన అత్తమామలపై కత్తితో దాడిచేసి హతమార్చిన సంఘటన మండలకేంద్రమైన దుత్తలూరు ఎసి కాలనీలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల మేరకు చలంచర్ల కల్లయ్య (65), జయమ్మ (60) అనే దంపతులు తన కుమార్తె అంకమ్మను అదే కాలనీకి చెందిన ఏలూరి వెంగయ్యకిచ్చి వివాహం చేశారు. వారికి ముగ్గురు సంతానం.అయితే వారు కూలినాలి చేసుకొని జీవనం సాగించేవారు. మద్యానికి బానిసైన వెంగయ్య తొలినుంచి భార్యను వేదింపులకు గురి చేసేవాడని కుటుంబసభ్యులు బంధువులు పలు మార్లు హెచ్చరించినా అతనిలో ఏమాత్రం మార్పు రాలేదు. ఈ తరుణంలో ఆదివారం కాలనీలోని కొంతమందితో కలసి అంకమ్మ సమీప గ్రామంలోని చెరువువద్దకు చేపల వేటకు వెళ్ళింది. తిరిగి ఆమె ఇంటికి రాగ తనను అడగ



హత్యకు గురైన చలంచర్ల కల్లయ్య,జయమ్మ(ఫైల్)

కుండా ఎందుకు చేపలవేటకు వెళ్ళావంటూ అతను వాదనకు దిగాడు.ఈనేపధ్యంలో ఇరువురు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఆవేశానికి గురైన అతను బజారుకు వెళ్ళి మద్యంసేవించి నివాసానికి చేరుకున్నాడు. ఆసమయంలో భార్య ఇంటివద్ద లేక పోవడంతో కోపోద్రికుడై ఇంట్లోవున్న కత్తిని తీసుకొని తన భార్యగూర్చి ఆరా తీస్తు అత్త,మామల ఇంటికి వెళ్ళిందని తెలుసుకొని ఆవేశంతో అక్కడకి వెళ్ళి భార్యపై ఒక్కసారిగా కత్తితో దాడికి పల్పడ్డాడు. ఆసమయంలో అక్కడేవున్న అత్త,మామలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీనంతటికి కారణం మీరేనంటు వారిపైన కూడా విచక్షణారహితంగ దాడికి పాల్పడడంతో ఇరువురు అక్కడికక్కడే మృతిచెందారు. భార్యసైతం తీవ్ర గాయాలతో భయాందోనకు గురై ఆమె అక్కడనుంచి పరుగులు తీసింది.ఆపై అత్త, మామలు మృతిచెందారని నిర్ధారించుకున్న అతను ఎవ్వరికి కనపడకుండా కత్తితో అక్కడ నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఆదిలక్ష్మి సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన అంకమ్మను చికిత్సనిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతదేహాల్ని సైతం వైద్యశాలకు తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండడంతో పాటు నిందితుడికోసం గాలింపు చర్యలు చేపట్టారు. సంఘటన స్థలాన్ని ఉదయగిరి సిఐ వెంకట్రావు పరిశీలించారు.

# ఇ స్టాంపు కుంభకోణంలో కొత్త కోణం

## టిడిపి అధికార ప్రతినిధి మారుతి చౌదరి ఉన్నట్లు ఆరోపణ

**కళ్యాణదుర్గం, జూన్ 30 ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈస్టాంపు కుంభకోణంలో కొత్త కోణం బయటపడినట్లు కళ్యాణదుర్గం డిఎస్పి రవిబాబు చేసిన ప్రకటన సంచలనం సృష్టిస్తోంది. కళ్యాణదుర్గం పట్టణములోని బోయ వీరప్ప అలియాస్ బాబుకు చెందిన మీసేవ కేంద్రంలో పనిచేస్తున్న మోహన్ బాబు అనే వ్యక్తి వద్ద టిడిపి అధికార ప్రతినిధి మారుతి చౌదరి పలుమార్లు ఫోన్లో మాట్లాడినట్లు కళ్యాణదుర్గం డిఎస్పి రవిబాబు మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొనడం గమనార్హం. మీ సేవలో పని చేస్తున్న మోహన్ బాబు వద్ద నుండి 10 ఇస్ స్టాంప్ డాక్యుమెంట్లను మారుతి చౌదరి సేకరించారని అందులో 4 ఈ స్టాంపులు



మారుతి చౌదరి, కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు

ఎస్ఆర్సి ఇన్ఫ్రా డెవలప్మెంట్ కంపెనీకి సంబంధించినవిగా గుర్తించినట్లు డి.ఎస్.పి పేర్కొనడం కళ్యాణదుర్గం ప్రాంతంలోనే కాకుండా కేసులో మరో కోణంలో మలుపు తిరిగినట్లు చర్చలు సాగుతున్నాయి. ఈ స్టాంపుల కొనుగోలుకు సంబంధించి ఎస్ఆర్సి ఇన్ఫ్రా డెవలప్మెంట్ కంపెనీ తగినంత రుసుము చెల్లించి ఈస్టాంపులను సేకరించినట్లుగా గుర్తించినట్లు తెలిపారు. ఏది ఏమైనా మారుతి చౌదరి ప్రమేయంతో ఈ స్టాంపుల కుంభకోణం రాజకీయంగా కొత్త మలుపు తిరిగిందనడంలో ఎలాంటి సందేహం లేదని స్థానిక ప్రజలు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. డి.ఎస్.పి రవిబాబు తమ విచారణలో మోహన్ బాబు వద్ద స్టాంపులు మారుతి చౌదరి స్వీకరించుకున్నట్లు తెలిపారు. వీటిలో నాలుగు స్టాంపులు ఎస్ఆర్సి ఇన్ఫ్రా డెవలప్మెంట్ కంపెనీకి చెందినవిగా ఉన్నట్లు డి.ఎస్.పి పేర్కొనడం గమ్మనార్హం. స్టాంపుల కుంభకోణం ఇంకా ఎన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడక తప్పదు.

# దోస్త్-2025 సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు పెంపు

## 3వ తేదీ వరకు అవకాశం.. కాలేజీల్లో 5 లోపు చేరాలి

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరం లో ప్రవేశాల నిర్వహించిన డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలం గాణ(దోస్త్) సెల్ఫ్ రిపోర్టింగ్ గడువును పొడిగించారు. అలాగే కాలేజీల్లో చేరడానికి సైతం గడువును ఈ నెల 5 వరకు పెంచారు. దోస్త్ ద్వారా ఇప్పటి వరకు మూడు విడతల్లో సీట్లు పొందిన విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడానికి గడువు సోమవారంతో ముగియగా దానిని కాస్త ఈ నెల 3 వరకు పొడిగించారు. సెల్ఫ్ రిపోర్టింగ్ ఇచ్చిన వారు కాలేజీల్లో చేరడానికి నేటి(మంగళవారం) వరకు ఉన్న గడువును కాస్త ఈ నెల 5 వరకు పొడిగిస్తున్నట్టు తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, దోస్త్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు మూడు విడతలుగా డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నిర్వహించిన డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2025 అడ్మిషన్ల ప్రక్రియ నేటితో ముగియనుండగా గడువును పొడిగించారు. మొదటి విడతలో 65వేల మందికి సీట్ల కేటాయింపు చేపట్టగా వారిలో సుమారు 43 వేల మంది కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ ఇచ్చారు. ఇక రెండో విడతలో 43వేల సీట్ల కేటాయింపు చేయగా.. మూడో విడతలో 85,680 మంది విద్యార్థులకు సీట్ల కేటాయింపు చేశారు. సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 30 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని .. నేటి వరకు కాలేజీల్లో చేరాలని ఉత్తర్వులు జారీ చేశారు. దోస్త్ మూడో విడత సీట్ల కేటాయింపును శనివారం విడుదల చేశారు. దోస్త్ మూడో విడత రిజిస్ట్రేషన్‌లో భాగంగా 82,770 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మూడో విడతలో 96,015 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 85,680 మందికి సీట్ల కేటాయింపు చేపట్టారు. తక్కువ ఆప్షన్లు ఇచ్చిన కారణంగా 10,335 మందికి మొదటి విడతలో సీట్ల కేటాయింపు చేయలేదు. మొదటి ప్రాధాన్యత ఇచ్చిన వారిలో 64,181 మందికి.. ద్వితీయ ప్రాధాన్యత ఇచ్చిన వారిలో 21,499 మందికి సీట్ల కేటాయింపు చేసినట్టు బాలకిష్టారెడ్డి తెలిపారు. మూడో విడత సీట్ల కేటాయింపులో కామర్స్ విద్యార్థులు 35,402 మందికి కేటాయించారు. లైఫ్ సైన్సెస్ 16,099 మందికి, ఫిజికల్ సైన్స్‌లో 20,890 మంది ఉన్నారు. మూడో విడతలో సీటు పొందిన వారు రూ. 500 ..రూ. 1000 ఫీజు చెల్లించి ఈ నెల 30 లోగా సీటు రిజర్వు చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు మూడు విడతల్లోనూ సీట్లు పొంది సెల్ఫ్ రిపోర్టింగ్ చేయని వారు ఈ నెల 3లోగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని.. ఈ నెల 5 వరకు కాలేజీల్లో చేరడానికి అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

# కేరళ డిజిపిగా తెలుగు అధికారి రావాడ చంద్రశేఖర్



**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** కేరళ రాష్ట్ర డిజిపిగా తెలుగు అధికారి రావాడ చంద్రశేఖర్ (59) నియమితులయ్యారు. ఆయన నియామ కాన్ని యుపి ఎస్‌సి సోమవారం నాడు ఖరారు చేసింది. సోమవారం నాడే పదవీ విరమణ చేసిన డిజిపి షేక్ దర్వేష్ సాహెబ్ స్థానంలో చంద్ర శేఖర్ రెండు రోజుల్లో బాధ్య తలు చేబట్టనున్నారు. ప్రస్తుతం కేంద్ర ఇంటె లిజెన్స్ బ్యూరో (ఐబి)లో సీని యర్ అధికారిగా వున్న చంద్రశేఖర్ 1991 బ్యాచ్ ఐపిఎస్ అధికారి. ఆయన స్వస్థలం ఎపిలోని పశ్చిమ గోదావరి జిల్లా. డిజిపి ఎంపిక కోసం కేరళ సిఎం పినరయి విజయన్ చంద్రశేఖర్‌సహా ఐదుగురు సీనియర్ అధికా రుల పేర్లను కేంద్రానికి పం పగా అందులో నుంచి చంద్రశేఖర్ సహా ముగ్గురి పేర్లను యుపిఎస్‌సి ఎంపిక చేసింది. ఈ ముగ్గురి నుంచి చంద్రశేఖర్ పేరును డిజిపిగా ఎంపిక చేస్తూ కేరళ సర్కారు సోమవారం అధికారికంగా నిర్ణయించింది.

చంద్రశేఖర్ పదవీ బాధ్యతలు చేబట్టేవరకు శాంతి భద్రతల అదనపు డిజిగా వున్న మరో తెలుగు అధికారి హెచ్. వెంకటేష్ ఇఛార్జి డిజిగా వ్యవహరిస్తారు. వెంకటేష్ స్వస్థలం హైదరాబాద్.



# తీవ్ర ఉత్కంఠ మధ్య వన్ బ్యూటిఫుల్ బిల్లుకు సెనేట్ ఆమోదం

**వాషింగ్టన్, జూన్ 30:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ పాలకవర్గం తీసుకువచ్చిన బిల్లుపై సెనేట్‌లో ఆమోదం పొందింది. పన్ను విరామంతో పాటు, ప్రభుత్వ వ్యయంలో కోతలు అక్రమ వలసదారులను వెనక్కిపంపే కార్యక్రమాలకు నిధులను కేటాయిం చేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రవేశపెట్టిన'వన్ బ్యూటిఫుల్ బిల్'కు భారీ ఉత్కంఠ నడుమ అర్ధరాత్రి సెనేట్ ఆమోదించింది. వాదనల అనంతరం ఉపాధ్యక్షుడు జెడివాన్స్ సమక్షంలో బిలులకు 51-49తేడాతో సెనేట్ ఆమోదం తెలిపింది. ఉత్కంఠ తీవ్రస్థాయిలో ఉండటంతో ఓటింగ్ 3 గంటలపాటు నిలిచిపోయింది. ఇద్దరు రిపబ్లికన్లు బిల్లుకు వ్యతిరేకంగా ఓటువేసారు. బిల్లులోని మెడికల్ ఎయిడ్‌ను, ఆహార కూపన్లను తగ్గించేప్రతిపాదనలు, 3.8 ట్రిలియన్ డాలర్ల పన్ను విరామాన్ని పలువురు రిపబ్లికన్లు వ్యతిరేకించారు. బిల్లుపై ఓటింగ్ సమయంలో ట్రంప్ వర్జీనియాలోని గోల్ఫ్ కోర్స్ గెస్ట్‌హౌస్‌లోనేగడిపారు. బిల్లు వ్యతిరేకించినవారిలో నార్త్ కరోలినా సెనేటర్ థామ్ టిల్లిస్‌కూడా ఉన్నారు. తన రాష్ట్రంలో మెడికల్ ఎయిడ్‌కోతలవల్లనష్టం కలుగుతుందన్నారు. బిల్లును మరోసెనేటర్ కెంటకీకి చెందిన రాండ్‌పాల్ వ్యతిరేకించారు. 940 పేజీల ఈ బ్యూటిఫుల్ బిల్లును ముందురోజు రాత్రే సెనేటర్లకు అందించారు. సెనేట్ ఆమోదం పొందడంతో ఈబిల్లు ప్రతినిథుల సభకు వెళుతుంది. అక్కడ ఆమోదం పొందాకఅధ్యక్షుడు ట్రంప్ వద్దకు చేరుతుంది. ఈ బిల్లును ముందునుంచి వ్యతిరేకిస్తున్న ఎలాన్ మస్క్ మరోసారి తీవ్రంగా విమర్శించారు. తాజా బిల్లు అమెరికాలో లక్షలమంది ఉద్యోగాలను నాశనంచేస్తుందని, దేశానికి తీవ్రనష్టం కలిగిస్తుందన్నారు. పాతపరిశ్రమలకు చేయూతనిచ్చినా కొత్తసంస్థలను దారుణంగా దెబ్బతీస్తుందని, రిపబ్లికన్‌పార్టీకి రాజకీయ ఆత్మహత్య అని మస్క్ తన సోషల్‌మీడియా పోస్టులతో ధ్వజమెత్తారు.

# భారీ వర్షాలకు కుప్పకూలిన భవనం

## హిమాచల్‌ప్రదేశ్‌లో పది జిల్లాలకు వరద హెచ్చరికలు

**సిమ్లా, జూన్ 30:** ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లో గత కొన్ని రోజులుగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఈవర్షాలకు హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాలో ఐదంతస్తుల భవంతి కుప్పకూలిపోయింది. అయితే, భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడుతుండటంతో అందులోని నివాసితులను ముందుగానే ఖాళీ చేయించినట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రాణనష్టం తప్పింది. భవనం పేకమేడలా కుప్పకూలుతున్న దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని 10 జిల్లాలకు భారత వాతా వరణ శాఖ వరద హెచ్చరికలు అంటే రెడ్ అలర్ట్ జారీ చేసింది. బిలాస్‌పూర్, సోలన్, సిమ్లా, సిర్మౌర్, హమీర్‌పూర్, మండి, కాంగ్రా జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించింది. కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. 'కులు, ఉనా, చంబా జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది' అని తెలిపింది.

# ద.మ.రైల్వే జిఎం అరుణ్‌కుమార్‌జైన్‌కు ఘనంగా వీడ్కోలు

**హైదరాబాద్ (తార్నాక), జూన్ 30, ప్రభాతవార్త :** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్‌జైన్ తన పదవీ విరమణ సందర్భంగా మాట్లాడుతూ దక్షిణ మధ్య రైల్వే అనేక గొప్ప విజయాలు సాధించడానికి వీలు కల్పించిన అధికారుల అవిశ్రాంత కృషి, విధి పట్ల అంకిత భావానికి బృందాన్ని ప్రశంసించారు. అరుణ `కుమార్‌జైన్ పదవీ విరమణచేసిన సందర్భంగా ఆయనకు దక్షిణ మధ్య రైల్వే బృందం హృదయపూర్వక వీడ్కోలు పలికింది. దక్షిణ మధ్య రైల్వేలో ఎక్కువ కాలం పనిచేసిన జనరల్ మేనేజర్‌గా ఆయన గుర్తింపు పొందారు. ఆయన చురుకైన నాయ కత్వం, మార్గదర్శక త్వంలో, దక్షిణ మధ్య రైల్వే అపూర్వమైన వృద్ధి సాధించిందిని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం అరుణ్‌కుమార్‌జైన్‌కు సికిందరాబాద్‌లోని రైల్ నిలయంలో జీఎం కార్యాలయ అధికారులు, సిబ్బంది వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించి ఆయనను జ్ఞాపిక, శాలువా, పూల దండలతో సత్కరించారు.

దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగ్రవాల్ దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌జె. వినయన్, ఇతర సీనియర్ అధికారులు తమ అనుభవాన్ని పంచు కున్నారు. అంతకు ముందు తెల్లవారు జామున, దక్షిణ మధ్య రైల్వే రక్షణ దళం (ఆర్.పి.ఎఫ్) హైదరాబాద్ లోని మౌలాలీలోని ఆర్.పి.ఎఫ్ శిక్షణ కేంద్రంలో జనరల్



వీడ్కోలు సందర్భంగా గౌరవ వందనం స్వీకరిస్తున్న అరుణ్‌కుమార్‌జైన్

మేనేజర్ విలువైన మద్దతు, డైనమిక్ నాయకత్వం, మార్గదర్శక త్వానికి గౌరవం మరియు కృతజ్ఞతా చిహ్నంగా ప్రత్యేక ఉత్సవ వీడ్కోలు పరేడ్‌ను నిర్వహించారు. సికిందరాబాద్, హైదరాబాద్ డివిజన్ల ప్రధాన విభాగాధిపతులు, డివిజనల్ రైల్వే మేనేజర్లు, ఇతర సీనియర్ అధికారులు, జోన్ వ్యాప్తంగా ఉన్న ఆర్.పి.ఎఫ్ సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. జనరల్ మేనేజర్ అరోమాసింగ్ ఠాకూర్ మాట్లాడుతూ దార్శనిక నాయకత్వం, కరుణా స్వభావాన్ని, ఆర్.పి.ఎఫ్‌కు అవిశ్రాంత మద్దతును ప్రశంసించారు. తన వీడ్కోలు ప్రసంగంలో అరుణ్‌కుమార్‌జైన్ ప్రయాణీకులను రక్షించడంలో, జాతీయ భద్రతను కాపాడడంలో ఆర్.పి.ఎఫ్ అసాధారణమైన పనితీరుపై ప్రశంసలు వ్యక్తం చేశారు. పోలీసింగ్ విధులతో పాటు, ఆపదలో ఉన్న పిల్లలను రక్షించడంలో ఆర్.పి.ఎఫ్ యొక్క మానవీయ దృక్పథాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. మౌలాలీలోని ఆర్‌పిఎఫ్ శిక్షణా కేంద్రం సైబర్ నేరాల దర్యాప్తు కేంద్రంగా గుర్తింపు పొందడం పట్ల అరుణ్ కుమార్ జైన్ గర్వాన్ని వ్యక్తం చేశారు. గౌరవం, కృతజ్ఞతతో వీడ్కోలు పలికేందుకు సికిందరాబాద్‌లోని రైల్ నిలయంలో అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

# ఐపిఎల్ జరిమానా మీరే కట్టాలి!

## మాజీ ఛైర్మన్ లలిత్‌మోడీకి సుప్రీం ఝలక్



**న్యూఢిల్లీ, జూన్ 30:** ఐపీఎల్ వ్యవస్థాపకుడు, మాజీ ఛైర్మన్ లలిత్ మోదీకి సుప్రీం కోర్టులో భారీ షాక్ తగిలింది. ఫెమా (విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం) నిబంధనల ఉల్లంఘన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తనకు విధించిన జరిమానాను బీసీసీఐ చెల్లించేలా ఆదేశించాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం సోమవారం తోసిపుచ్చింది. దీంతో ఆ జరిమానా భారం లలిత్ మోదీపైనే పడింది. ఐపీఎల్ ఛైర్మన్‌గా ఉన్న సమయంలో ఫెమా నిబంధనలను ఉల్లంఘించారన్న ఆరోపణలపై లలిత్ మోదీకి ఈడీ రూ.10.65 కోట్ల జరిమానా విధించింది. అయితే, ఈ మొత్తాన్ని బీసీసీఐ చెల్లించేలా ఆదేశించాలని కోరుతూ ఆయన గతేడాది డిసెంబర్‌లో మొదట బాంబే హైకోర్టును ఆశ్రయించారు. తాను ఐపీఎల్ పాలకమండలికి ఛైర్మన్‌గా అధికారిక హోదాలో ఉన్నప్పుడు ఈ వ్యవహారం జరిగిందని, బీసీసీఐ నిబంధనల ప్రకారం సంస్థ ప్రతినిధులు ఎదుర్కొనే చట్టపరమైన ఖర్చులను సంస్థే భరించాలని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆయన వాదనలను బాంబే హైకోర్టు అంగీకరించలేదు. పిటిషన్‌లో పసలేదంటూ కొట్టివేయడమే కాకుండా, లలిత్ మోడీకి అదనంగా రూ.లక్ష జరిమానా కూడా విధించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం.. బాంబే హైకోర్టు తీర్పును సమర్థించింది. బీసీసీఐ జరిమానా చెల్లించాలన్న అభ్యర్థనను తిరస్కరించింది. అయితే, చట్ట ప్రకారం ఈ కేసులో తనను తాను రక్షించుకునేందుకు లలిత్ మోదీకి పూర్తి హక్కు ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఐపీఎల్‌కు సారథ్యం వహించిన సమయంలో కోట్ల రూపాయల మేర ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారనే తీవ్ర ఆరోపణలతో లలిత్ మోదీ 2010లో దేశం విడిచి లండన్‌కు పారిపోయారు. అప్పటి నుంచి ఆయన అక్కడే తల దాచుకుంటుండగా, ఆయన్ను భారత్‌కు రప్పించేందుకు అధికారులు ప్రయత్నాలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. తాజా తీర్పుతో ఆయనకు న్యాయపరంగా మరో ఎదురుదెబ్బ తగిలినట్లయింది.

# ఢిల్లీలో ఘనంగా బోనాలు

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** సింహవాహిని మహంకాళి అమ్మవారి ఉత్సవాలు జూన్ 30 నుంచి జూలై 2వ తేదీ వరకు తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఢిల్లీలో ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లోఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయగా. జూలై 1న (మంగళవారం) ఇండియా గేట్ నుంచి తెలంగాణభవన్ వరకు మహంకాళి అమ్మవారి ఊరేగింపు ఉంటుంది. గత పదేళ్ల నుంచి ఢిల్లీలో తెలంగాణ భవన్‌లో సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఢిల్లీలో ఉన్న తెలుగువారంతా పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొనాలని ప్రభుత్వం ఆహ్వానం పలికింది.లాల్ దర్వాజా బోనాలు ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో పలువురు ప్రముఖులు హాజరుకానున్నారని సింహవాహిని శ్రీమహంకాళి దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

# బుద్ధవనం ప్రత్యేక అధికారిగా మల్లేపల్లి లక్ష్మయ్య

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాత వార్త:** నాగార్జునసాగర్ సమీపం లోని బుద్ధవనం ప్రాజెక్టు ప్రత్యేక అధికారిగా ప్రముఖ పాత్రికే యుడు, సామాజికవేత్త మల్లేపల్లి లక్ష్మయ్య నియామకం అయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రభు త్వం జీవో జారీ చేసింది.రెండేళ్ల పాటు ఆయన ఈ బుద్ధవనం ప్రా జెక్టు, తెలంగాణ టూరిజం డెవల ప్‌మెంట్ కార్పొరేషనణ్ స్పెషల్ ఆఫీసర్‌గా కొనసాగనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2016 -24 వరకు బుద్ధవనం ప్రాజెక్ట్ స్పెషల్ ఆఫీసర్‌గా ఆయన ఉన్నా రు. ఈ నేపథ్యం లోనే ఆయనకు ఉన్న అవగా హన ను దృష్టిలో ఉంచుకోని మళ్లీ నియమించినట్లు తెలుస్తోంది.

# మా శాఖకు అదనపు నిధులు మంజూరు చేయండి

## కేంద్రమంత్రి అన్నపూర్ణాదేవికి తెలంగాణ మంత్రి సీతక్క విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవితో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క భేటీ అయ్యారు. మహారాష్ట్ర నుంచి ఢిల్లీకి తిరుగు ప్రయాణమైన కేంద్ర మంత్రి కాసేపు శంషాబాద్ ఉన్న క్రమంలో కేంద్ర మంత్రిని మహిళా సంక్షేమ శాఖ కార్యదర్శి అంతా రామచంద్రన్‌తో కలిసి సీతక్క పలు అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క రాష్ట్రంలో అమలవుతున్న పథకాల వివరాలతో కూడిన వినతిపత్రాన్ని కేంద్ర మంత్రికి అందజేశారు. ఆరోగ్యలక్ష్మీ, పోషణ్ 2.0, సంక్షేమ అంగన్వాడీ వంటి పథకాల ద్వారా తెలంగాణలో మహిళా, శిశు సంక్షేమానికి ప్రభుత్వం అధిక నిధులు వెచ్చిస్తోందని ఆమె తెలిపారు.ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా అంగన్వాడీ ఉద్యోగులకు పదవీ విరమణ ప్రయోజనాలు కల్పిస్తున్న విషయాన్ని కేంద్ర మంత్రికి వివరించారు. అలాగే అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల జీతాల్లో కేంద్ర వాటాను పెంచాలని కోరారు. అంగన్వాడీ టీచర్లకు, హెల్పర్లకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ. 10,950, రూ.6450 చెల్లిస్తుండగా కేంద్రం తన వాటాగా నామమాత్రంగా కేవలం రూ.1,350 నుంచి 2,700 మాత్రమే చెల్లిస్తుందని, ఈ మొత్తాన్ని పెంచాల్సిన అవసరాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీంతోపాటు రాష్ట్రంలో 11 వేలకుపైగా అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, వాటికి సొంత భవనాల నిర్మాణానికి కేంద్ర నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య లక్ష్మీపథకం ద్వారా గర్భిణీలకు, బాలింతలకు ప్రతిరోజు 200 మిల్లీ లీటర్ల విజయ మిల్క్‌ను అందిస్తున్నామని, త్వరలో చిన్నారులకు సైతం ఈ పథకాన్ని వర్తింప చేసే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, కేంద్ర ప్రభుత్వం తన వంతు సహకారం అందించాలని మంత్రి సీతక్క కోరారు.మంత్రి సీతక్క వినతులను కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవి సానుకూలంగా స్పందించారు.తెలంగాణ రాష్ట్రం చేపడుతున్న పథకాలు అభినందనీయం అని ప్రశంసిం చారు. దేశవ్యాప్తంగా ఉన్న రాష్ట్రాల మహిళా శిశు సంక్షేమ మంత్రులు, అధికారులతో కలిసి తెలంగాణలో జాతీయ సదస్సు నిర్వహించి ఇక్కడి బెస్ట్ ప్రాక్టీస్‌ను ఇతర రాష్ట్రాలకు పరిచయం చేస్తామని తెలిపారు.కేంద్ర ప్రభుత్వంతో చర్చించి అధిక నిధుల మంజూరు పై నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు.

వార్త


జీవితంలో సంతృప్తిపడడం నేర్చుకున్న వ్యక్తి ఎప్పుడూ ఆనందంగానే ఉంటాడు.

-జార్జ్ ఇలియట్

# తొక్కిసలాటలు తప్పవా?

తొక్కిసలాటల దుస్సంఘటనల పరంపరలో మరో ఉదంతం చేరింది. ఈసారి పూరీ జగన్నాథస్వామి ఆలయం ఆ వరుసలోకి వచ్చింది. జగన్నాథ రథయాత్రలో తొక్కిసలాట జరిగి ముగ్గురు భక్తులు మరణించగా 50 మందికిపైగా భక్తులు గాయపడ్డారు. ఇలాంటివి ప్రభుత్వ అసమర్థత, దేవాలయ యాజమాన్య నిర్లక్ష్యం వలన చోటు చేసుకున్నాయని భావించడం సహజం. విశేషమేమిటంటే అంత పెద్ద రథయాత్రలోనూ ప్రాణనష్టం అదీ లేకుంటే బాగుండేది. జగన్నాథ రథచక్రాలొస్తున్నానగానే జగన్నాథుడు మనల్ని రక్షించేందుకు వస్తున్నాడు భక్తులంతా కదలిరండని ఓ అర్థం స్ఫురిస్తే అంతటి భక్తజన సందోహంతో జగన్నాథ రథ చక్రాలు వడివడిగా లాగబడ్తున్నాయి. కనుక జాగ్రత్తగా ఉండండని హెచ్చరికగా కూడా భావించవచ్చు. ఈ రెండూ నిజమే. ఎందుకంటే పూరీ జగన్నాథ స్వామి రథానికి 16 చక్రాలుంటాయి. తాళధ్వజానికి 14 చక్రాలు, సుభద్ర రథానికి 12చక్రాలుంటాయి. ఆ రథయాత్రలో భక్త శిఖామణులు ఆధ్యాత్మిక తన్మయత్వంతో ఏ చక్రం కింద పడతారోనని అన్ని జాగ్రత్తలు తీసుకుంటారు. అయినా జనం ఊహించనంత మంది వచ్చినప్పుడువారిని నియంత్రించడం సాధ్యం కానప్పుడు ఇలాంటి దుర్ఘటనలే చూడాల్సి వస్తుంది. తొక్కిసలాట దుర్ఘటనలు పునరావృతం కాకూడదని ఎప్పటికప్పుడు తగుజాగ్రత్తలు తీసుకుంటున్నా మళ్లీ మళ్లీ జరగడం యాదృచ్ఛికమే అయినా వాంఛనీయం కాదు. భద్రతా నిర్లక్ష్యం క్షమించరానిదని ముఖ్యమంత్రి మాంఝి బాధ్యులపై కఠినచర్యలు తీసుకునేందుకు ఉపక్రమించారు. తొక్కిసలాట దురదృష్టకరమని పూరీ రాజు గజపతి మహారాజ దివ్యసింగ్ దేవ్ విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి సందర్భాలలో ముందుజాగ్రత్త చర్యగా అంబులెన్స్‌లు కూడా అందుబాటులో ఉంచకపోవడంతో ప్రణాళికలో లోపమని భక్తులు ఆందోళన చెందుతున్నారు. తొక్కిసలాట జరిగినా జరుగకపోయినా జాగ్రత్తలు తీసుకోవడం కూడా ప్రణాళికలో భాగమే. అలాంటి సంప్రదాయ జాగ్రత్తలు పాటించడంలో ప్రభుత్వం వైఫల్యమైంది. సమయానికి రథాలకు బయలుదేరకపోవడం వల్లనే భక్తుల సంఖ్య బాగా పెరిగిపోయి ఈ ప్రమాదానికి కారణమయ్యిందని విపక్షాలు, కొందరు భక్తులు కూడా దేవాలయ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. ఇదంతా భయంకర గందరగోళంగా మారిందని, దీనికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బిజెపి అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ విమర్శించారు. ఏమైతేనేం గుండిచా ఆలయానికి నిర్ణీత సమయానికే రథాలు చేరుకున్నాయని బిజెపి సరిపెట్టుకుంటోంది. ఎవరెలా విశ్లేషించినా, సమయాసమయ నిర్ణయంలోనూ, రథయాత్రలో సమయాలు పాటించడంలోనూ ఎక్కడో అంతుపట్టని మానవ నిర్ణయలోపం జరిగిందని అనుమానం రాకమానదు. ఇవన్నీ ఇలా ఉండగా రథయాత్ర నిర్వహణలో తప్పిదాలు గతంలోనూ జరిగాయని ప్రభుత్వ పెద్దలు సర్దిచెబుతున్నారు. 1977 నుంచి రథాలు ఏటా రెండో రోజునగుడించా ఆలయానికి చేరుకుంటాని ఒడిశా న్యాయ శాఖ మంత్రి పృధ్వీరాజ్ హరిచందన్ వివరిస్తున్నారు. సరైన ముహూర్తసమయానికి బయలుదేరి ఎలాంటి తొక్కిసలాటలు జరుగకుండా భక్తజన సందోహంతో గుడించా ఆలయానికి ఎప్పుడు చేరినా దాని ఉత్సవం విజయవంతంగా జరిగిందనే చెప్పుకోవాలి. అంతే తప్పగందరగోళం మధ్య భక్తులలో అలజడి ఏర్పడి సమయానికి గుడించా ఆలయానికి చేరడం అందులోనూ తొక్కిసలాటల జరిగి ముగ్గురు మృతి, వందమందికిపైగా క్షతగాత్రులు అయ్యారనగానే 'ఎక్కడో తేడా జరిగిందన్న విషయం' తేటతెల్లమే. 1993లో గురుగళ జ్ఞాపకాయణ (నాగార్జున పూజ) సందర్భంలో ఆరుగురు, 2006 నవంబరు 4న శ్రీవారి మంగళహారతి సమయంలో జగమోహన్‌లో తూటపై తొక్కిసలాట జరిగి ముగ్గురు మరణించారు. 2008 జులై 4,5 తేదీలలో రథయాత్ర తొక్కిసలాటలో ఆరుగురు, 2008 సెప్టెంబరు 30న దేవాలయం వద్ద జరిగిన తొక్కిసలాటలో నలుగురు, 2010 జులై 19 రథయాత్ర తొక్కిసలాటలో బలభద్ర రథం పక్కన భక్తులు ఎక్కువగా పోగవడం వల్ల జరిగిన రద్దీలో ఇద్దరు ప్రాణం కోల్పోయారు. 2015లోనూ రథయాత్ర తొక్కిసలాటలో ఇద్దరు, 2023లో నవంబరు 10న గుడిలో ఏడడుగుల ద్వారం సప్తాహచ వద్ద రద్దీతో 30 మంది క్షతగాత్రులయ్యారు. తాజాగా రథయాత్రలో రద్దీని నియంత్రించలేక జరిగిన వైఫల్యంతో సరైన ప్రణాళిక లేకపోవడమేనని చెప్పుకోవాలి. ప్రమాదాలు జరగడమూ మామూలే, కష్టనష్టాలూ మామూలే అయినా గుణపాఠాలు నేర్వకపోవడమూ అతి సాధారణంగా మారినపరిస్థితిని హర్షించలేము. ఆదివారం తెల్లవారుఝామున 4.20 గంటలకు తొక్కిసలాట జరిగింది. దేవతామూర్తులను ప్రత్యక్షంగా చూడాలని రథాల దర్శనానికి వేచి ఉన్నభక్తులు రథాలపై సేవాయత్‌లు 'పహుదా' తెర తొలగించిన వెంటనే ఒక్కసారిగా భక్తులు ముందుకు కదలడంతో తోపులాట మొదలైంది. ఆ రోజు సాయంత్రం జరిగే పొహండి వేడుకకోసం తెచ్చినచారమాలల (కలప)తో ఉన్నలారీలు అడ్డుగా ఉండటంతో తోపులాట ఎక్కువైంది. దాంతో నియంత్రణ చాలా కష్టమైంది. అక్కడ కలప లారీలు ఉండకపోతే ఎట్లుండేదో? ఇలాంటి సమయాల్లో భక్తుల మార్గానికి మధ్యలో కలప లారీలను ఉంచకుండా చూస్తే ఇంత తొక్కిసలాట తప్పేదని జరిగే పరిస్థితి ఉండేదికాదు. ఏమయితే ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాంఝి జగన్నాథ భక్తులను క్షమాపణలు కోరి విషాదాంతానికి ముగింపు పలికారు.

మంచి కార్యం తలపెట్టిన వాడికి దృఢచిత్తము, సింహబలము వాటంతట అవే సమకూరుతాయి.



థామస్ ఫుల్లర్

అధికారంలో ఉన్న వారికి చదవడానికి తీరిక ఉండదు. అయితే చదవడానికి తీరిక లేనివారు అధికారానికి అనర్హులు.



ఆస్కార్‌వైల్డ్

# ప్రజావాక్కు



## పునరావృతం కాకుండా చూడాలి

కోల్కతాలోని ప్రముఖ లాకళాశాలలో ఓ విద్యార్థినిపై జరిగిన అత్యంత పాశవికమైన అత్యాచార ఘటన సమాజంలోనిసురక్షితతపై తీవ్రమైనప్రశ్నలు రేపుతోంది. న్యాయాన్ని అధ్యయనం చేసే స్థలంలోనే ఇలా ఘోరమైన నేరం చోటుచేసుకోవడం భారత దేశం మొత్తం తలవంచుకునే విషాదకరమైన పరిణామం. ఇదికేవలం ఒకవ్యక్తిపై జరిగిన నేరం మాత్రమేకాదు, ఇది మనవిద్యాసంస్థల విశ్వాసంపై జరిగినదాడి. ఈఘటనపై పూర్తిగా స్వతంత్రంగా, వేగంగా విచారణ జరగాలి. నిందితులకు న్యాయపరంగా అత్యంత కఠినమైన శిక్షలు విధించాలి. విచారణపై న్యాయస్థానం లేదా మహిళా కమిషన్ పర్యవేక్షణ ఉండాలి. ఇలాంటి ఘటనల పునరావృతం నిరోధించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ముసుగుంటేగా తొలగించేందుకు?

గాంధీనెహ్రూ కుటుంబ పైశాచికత్వానికి ప్రతీక రాహుల్ గాంధీ ఈ ప్రకటన. భారత రాజ్యాంగ పరిషత్ ఆమోదించిన రాజ్యాంగాన్ని అమలుచేయాలని అడగడం మను ధర్మాన్ని అమలు చేయమని అడగడమా? అంటే, మను ధర్మం అంటే ఏంటో తెలియని ఈ ఉన్మాది ఆ పేరుతో హిందూదేశంలో హిందువుల్నివిభజించి బలహీనపరచాలనే ఆలోచనతోనే రాజ్యాంగానికి సంబంధం లేని మను వాదంఅనేపదాన్ని వాడాడేమో. ఇప్పటికే 42 వ రాజ్యాంగ సవరణ ద్వారా 1976 లో రాజ్యాంగంలో చేర్చి నిర్వచించిన లౌకికవాదానికి పూర్తి భిన్నంగా హిందూధర్మాన్ని మాత్రమే ద్వేషిస్తూ, కొన్ని మతస్తుల కొమ్ముకాస్తున్న పరిస్థితుల్లో లౌకికవాదాన్ని, రాజ్యాంగపీఠికలో బలవంతంగా చేర్చిన లౌకికసామ్యవాద పదాలని తొలగించాలనడం సహేతుకం, సమర్ధనీయం.

- వీరుభొట్ల పేరయ్య శాస్త్రి, విజయవాడ

## పసుపు బోర్డు అభివృద్ధికి కంకణం

తెలంగాణకు పసుపుబోర్డ్ రావడం గొప్పవిషయం దానిని అందరూ ఆహ్వానించవలసిందే. దానితోపాటు కనీస మద్దతుధర 15వేలవరకు ఉంటే రైతులకు లాభసాటిగా ఉండగలదు. అలాగే పసుపురీసెర్చ్ సెంటర్‌పట్టుకొని వస్తే నిజామాబాదుకుతిరుగుండదు అభివృద్ధికికంకణం కట్టుకోవాలి.

- భారత అవినాష్, జనగామ

## సెన్సార్‌బోర్డు చర్య తీసుకోవాలి

సినిమాలు సంఘంలో ఎంత అత్యంత ప్రభావం చూపుతాయో మనకు తెలుసు. ఎందరో స్టూడెంట్స్, కుర్రాళ్ళు తమ హీరో వేష భాషలను విపరీతంగా అనుకరిస్తారు. అటువంటి చిత్రాలు తీసే డైరెక్టర్లు గాని, ప్రొడ్యూసర్స్‌గాని ఒళ్ళు, కళ్ళు, బుర్ర దగ్గర పెట్టుకుని తియ్యాలి. డబ్బులు మావే కదా అని ఎదో కులాన్ని, పనులను, వృత్తులను వెటకారం చేస్తూ, అసహ్యంగా చూపిస్తూ తీసి దాన్ని మళ్లీ సమర్థించుకునేందుకు ఏవో కాకమ్మ కారణాలు చెబితే సరిపోదు. ఇది ఇప్పుడేకాదు పేరున్న డైరెక్టర్లు ప్రొడ్యూసర్లకి కూడా చాలా కాలంనుంచి వస్తున్న పెద్ద జబ్బు. దీనికి వాళ్ల దరిద్రపుగొట్టు జవాబు ఏమిటంటే ' సినిమాను సినిమాగా చూడాలి'. అని. దీనిని సెన్సార్‌బోర్డు వారే మార్చాలి. కచ్చితమైన రూల్స్ ఉండి అమలు పరిచే వారిని వెయ్యాలి.

-గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

## కాంగ్రెస్ ప్రజా సంక్షేమం అడుగులు

గత పదేండ్ల పాలన గురించి మళ్లీ ఇప్పుడు గుర్తు చేయాల్సిన అవసరం లేదు. ఇనుప కంచెలతో లోపలికి పోవడానికే వీలులేని అధికార దర్పాన్ని బిఆర్ఎస్ ప్రదర్శించింది. ప్రజాయుద్ధనౌక గద్దర్‌ను కనీసంగా ఆ ప్రదేశంలోకి రాకుండా నో ఎంట్రీ బోర్డు పెట్టేశారు. గంటల తరబడి ఆయన అక్కడ వెయిట్ చేసినా పట్టించుకోలేదు. ఆగోడలను హస్తంపార్టీ సర్కారు బద్దలుగొట్టింది. ఏ స్థలమైతే సామాన్యులకు ప్రవేశం లేకుండా నిషేధింపబడిందో అదేచోట (ప్రజాభవన్)లో సామాన్యుల గోడు వినడానికి ప్రతీ మంగళవారం, శుక్రవారం ప్రజావాణి అనే ప్రోగ్రామ్ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా ప్రజాసంక్షేమం కోసం బలమైన అడుగులు వేస్తోంది.

- మద్దుల ప్రశాంత్, హైదరాబాద్

## లింగ సమానత్వం ఆందోళనకరం

వరల్డ్ ఎకనామిక్ ఫోరం విడుదల చేసిన గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్ట్ 2025 దేశంలో లింగసమానత్వాన్ని వేలెత్తి చూపుతోంది. ప్రపంచంలో లింగ సమానత్వంలో మొత్తం 148 దేశాల్లో మన దేశం 131 స్థానంలో నిలిచింది. భారత్ కంటే పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, భూటాన్ నేపాల్, శ్రీలంక ముందున్నాయి. లింగ సమానత్వంలో ఐస్‌ల్యాండ్ అగ్రస్థానంలో ఉంది. భారత్ మహిళల విద్యలో పురోగతి సాధించడం, జనన సమ యంలో లింగ నిష్పత్తి కూడా మెరుగుపడటం ఈ రిపోర్టులో సానుకూల అంశాలు. పార్లమెంటులోమహిళలసంఖ్య13.8శాతానికి తగ్గింది.

-చల్లా చంద్రశేఖర్ రెడ్డి, కలువాయి, నెల్లూరు

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పాక్, చైనాతో వ్యవహరించడం ఎలా?

**శ్రీలంక, నేపాల్ దేశాలను కూడా ఆర్థిక సహాయం పేరుతో భారత్‌కు వ్యతిరేకంగాచైనా రంగంలోకి దింపాలని చూస్తున్నది కానీ, ఆ రెండు దేశాలు ప్రస్తుతానికి పూర్తిగా పాకిస్థాన్, చైనాల వైపు మొగ్గటం లేదు. ఏదిఏమైనా భారత్ నిరంతరం ఈ దేశాలతో అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారత్ టెర్రరిజంను అణచి వేసేందుకు దక్షిణ ఆసియా దేశాల సహాయ సహకారాలను అభ్యర్థిస్తున్నది. అలాంటి నేపథ్యంలో చైనా, పాకిస్థాన్‌ల చర్యలు అడ్డుకట్టలుగా మారొచ్చు. భారతదేశం వెనక్కి తగ్గకుండా ఆదేశాలతో సత్సంబంధాలు కొనసాగించకతప్పదు. భారత్ బలాన్ని తప్పుగా అంచనా వేసి ఏ దేశం పాకిస్థాన్‌కూ, చైనాకూ తోడ్పడి టెర్రరిజం లాంటి సమస్యలు సృష్టిస్తే తగు రీతిలో భారత్ ఆపరేషన్ సిందూర్‌లా తిరుగులేని జవాబు ఖాయం. ఆర్థిక, మిలటరీ రాజకీయ సమస్యలు ఎదుర్కోకతప్పదు అని ఆదేశాలకు సంకేతాలు అందుతే అటువైపు మొగ్గుచూపకపోవచ్చు.**



రావులపాటి సీతారాంరావు

భారత్, పాకిస్థాన్‌తో సంఘర్షణలో కానీ, రాజ్యాంగేతర టెర్రరిజంతో పోరాటం అప్పుడుకానీ పక్కలో బెల్లంలా చైనా వ్యవహరిస్తూనే ఉంది. 1962 యుద్ధం తర్వాత చైనా పాకిస్థాన్‌ను నిజమైన మిత్రుడిగా మల్చుకుంది. చైనా అవసరాల కోసం పాకిస్థాన్ నమ్మకమైన స్నేహితుడిగా, భారత్ మీద ఉన్న ద్వేషం వల్ల అనాదిగా వస్తున్న శత్రుభావాల వల్ల సిద్ధంగా ఉండటం జగమెరిగిన సత్యమే. దీనివల్ల పాకిస్థాన్‌కు ఆర్థికంగా చైనా చేయూత, ఆయుధ సామాగ్రి అందచేత సత్వరంగా ఏర్పడిన లాభాలు! ఆపరేషన్ సిందూర్ తర్వాత ఎవరు నమ్మటానికి సిద్ధంగా ఉన్నా లేకపోయినా, పాక్ మరింత బలహీనపడింది. ఆ మాత్రం భారత్‌తో నిలవగలిగిందంటే చైనా అరమరికలు లేని ఆయుధ సహాయంతో పాటు అమెరికా అందించిన మాటసాయం వల్లనే. ప్రస్తుత యుద్ధ వాతావరణంలో పశ్చిమాసియా దేశాలు దినమొక గండంగా కాలం గడుపుతున్నాయి. గతకాలంలో యుద్ధంవస్తే మిత్ర దేశాలు, శత్రుదేశాలూ ఉండేవి. ఈ ఆధునిక సాంకేతిక యుగంలో శాశ్వతంగా ఎవర్నీ మిత్రులుగా ఉంచుకోవాల్సిన అవసరం కానీ, శత్రువులుగా దూరంగా పెట్టటం కానీ అవసరం లేదని, ఇప్పటి రాజకీయ నిపుణులూ, అధినేతలూ కొత్త యుద్ధశాస్త్రాలు చెలామణిలోకి తెచ్చారు. రష్యా, అమెరికాతో స్నేహం నటిస్తూనే ఉక్రెయిన్ ఖనిజ సంపదను దోచుకోటానికి, కాసేపు యుద్ధ విరమణ, మరికాసేపు యుద్ధంలో విజృంభణ పాటిస్తూ ఉక్రెయిన్ లాంటి చిన్నదేశాలను చికాకులపాలు చేస్తున్నది. అమెరికాను నమ్మటం కష్టమైనా, ఇష్టంలేని నమ్మకాన్ని ఉక్రెయిన్ స్వీయరక్షణ కోసం ప్రదర్శించక తప్పటం లేదు. ఖనిజసంపద తాకట్టుపెట్టయినా, ఖరీదైన శాంతిని కొనటానికి సిద్ధంగానే ఉండక తప్పటం లేదు. కొన్ని కొత్త ఎలయన్సులు తెరమీదికి వస్తున్నాయి. చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లు చైనాలోని కుమ్మింగ్‌లో కలిసాయి. చైనా, పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్‌లు కూడా అటు తర్వాత కొద్ది కాలానికే (మే నెలలో) చైనా, పాకిస్థాన్ కారిడార్‌ను పొడిగించే పేరుతో సహకారం మరింతగా పెంపొందించుకోవటానికి కలవటం భారత్ దేశమే కాదు పశ్చిమాసియా దేశాలు కూడా గమనించి ఉండవచ్చు. ఇండియాతో యుద్ధం తర్వాత పాకిస్థాన్ నిర్వీర్య పరిస్థితితోపాటు, అఫ్ఘానిస్థాన్ భారత్‌కు దగ్గరవుతుందేమోనన్న దుగ్ధతో చైనా ఈ సమావేశాలను ఏర్పాటు చేసిందన్న విషయం అందరికీ తెలిసిందే!

చైనాకు రెండు ఆలోచనలు నిరంతరం వెంటాడుతూనే ఉంటాయి. ఒకటి పాకిస్థాన్ బలహీనపడకూడదు. పాకిస్థాన్ మీద ప్రేమవల్లో స్నేహభావంతోనో కానేకాదు. చైనా, తన దౌత్యావసరంలో ఒక భాగంగా ఇండియాను బలపడనివ్వకూడదు. అందుకే పాకిస్థాన్‌ను బలంగా ఉంచాల్సిన అగత్యం తనకు ఉందని చైనా నమ్మిన ఆలోచన. రెండవది జనాభా విషయంలో మొదటిస్థానానికి ఎగబాకింది. చైనాకు తెలుసు మానవ వనరులు దేశానికి ముఖ్యమని. భారత్ ఏ విషయంలోనూ తనను అధిగమించటం చైనాకు ఇష్టం ఉండదు. అమెరికా, రష్యాలు క్రమంగా బలహీనపడుతున్నాయి. చైనా, భారత్‌లు బలాన్ని పుంజుకుంటున్నాయి. ఇప్పటివరకూ చైనా అన్ని విషయాల్లో ఒక్క జనాభా విషయం



లో తప్ప భారత్‌కు ముందుగానే ఉంది. పాకిస్థాన్ ఈ రోజున పూర్తిగా చైనా మీదనే ఆధారపడి ఉంది. దాదాపు 80 శాతం పాకిస్థాన్ ఆయుధాలు చైనా నుంచి వచ్చినవే. 2024 చివరి వరకూ దాదాపు 29 బిలియన్ డాలర్ల అప్పు చైనా ఇచ్చిందే. అంతేకాదు యునైటెడ్ నేషన్స్ సెక్యూరిటీ కౌన్సిల్‌లో కానీ, ఇతర అంతర్జాతీయ వేదికలపైనా పాకిస్థాన్‌ను ఉగ్రవాదం విషయంలో నిర్మొహమాటంగా సమర్థించేది చైనాయే! భారత్‌కు అఫ్ఘానిస్థాన్ దగ్గర కానివ్వకూడదని, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లను తన ప్రక్కన ఉంచుకొని భారత్‌ను అంతర్జాతీయ ప్రముఖస్థానానికి రానివ్వకుండా సరిహద్దు సమస్యలతోనో, ఉగ్రవాదల చర్యలతోనో ఎంగేజ్ చేయటమే చైనా లక్ష్యంగా కనపడుతున్నది. ఇతర అగ్రదేశాలు కూడా భారత్ ఎదుగుదలను సహించలేని పరిస్థితికి వచ్చాయి. ఇరాన్, ఇరాక్, టర్కీ లాంటి ఇస్లామ్ దేశాలు ఇజ్రాయిల్‌తో సతమతమవుతున్నాయి. రష్యా ఒకప్పుడు, సిద్ధాంతాలు ఏవైనప్పటికిని, పశ్చిమాసియా దేశాల విషయంలో స్పష్టమైన అవగాహనతో సానుకూల దృక్పథంలో వ్యవహరించేది. యూనియన్ ఆఫ్ సోవియట్ సోషలిస్ట్ రిపబ్లిక్ విచ్ఛిన్నమైన తర్వాత రష్యన్ ఫెడరేషన్‌గా బలహీ నపడి పూర్వవైభవాన్ని కోల్పోయింది. రష్యాగా ప్రస్తుతం ఒక దేశంగా వెలిసింది. అమెరికాను కానీ, మరే ఇతర పెద్ద దేశాన్ని కానీ ఆర్థికంగా మిలటరీపరంగా సమాన స్థాయి హోదా ప్రదర్శించే అవకాశం కోల్పోవటంతో నిర్మాణాత్మకంగా, నిర్ణయపరంగా బలహీనపడింది. అందుచేత చైనా, పహెల్గాం ఘటనలో భారతదేశాన్నే తప్పుపట్టింది. భారత్‌కు గట్టి సపోర్ట్ సెక్యూరిటీ కౌన్సిల్ కానీ, మరే ఇతర అంతర్జాతీయ వేదికల్లో కానీ లభించటం దుర్లభంగా మారింది. బాలెన్స్ ఆఫ్ పవర్ ఒకవిధంగా ఊగిసలాడుతున్నది. భారత్ ఈ రెండు దశాబ్దాల నుంచి అనేకరంగాల్లో స్వయం కృషితో అభివృద్ధి సాధించటంతో ఎవరి సహరం లేకుండానే సంకట పరిస్థితులను విజయవంతంగా ఎదుర్కోగల్గుతున్నది. భారత దేశం బలంగా ఈమధ్య పోరాటాలు చేసి బలమైన దేశంగా నిరూపించుకోవటం పాకిస్థాన్‌కూ, చైనాకు మింగుపడటం లేదు. పాకిస్థాన్ వెనుక ఉండి చేయించిన ఉగ్రవాదచర్యలు, యురిలో (2016) పూల్వామాలో (2019) పహెల్గాం ఘటన తర్వాత ఆపరేషన్ సిందూర్‌తోసహా భారతదేశం సమర్థవంతంగా తిప్పికొట్టిన తీరు చైనానే ఇరుకులో పడేసింది. పాకిస్థాన్ ప్రతిసారీ కాశ్మీర్ సమస్యను లేవనెత్తటం ఆపుచేయడానికి కాశ్మీర్ కాదు సమస్య (పి.ఒకె)పాకిస్థాన్ ఆక్యుపైడ్ కాశ్మీరు సమస్య! దానిని మేము పరిష్కరించుకోవాల్సిన తప్పని పరిస్థితులు ఉన్నాయి. అంతేకాక ఇండస్ వాటర్ ట్రీటీని కూడా ఉగ్రవాద చర్యల వల్ల సస్పెండ్ చేస్తున్నాం అని చెప్పటంతో పాకిస్థాన్ నిర్వీర్యమైపోయింది. అమెరికాను బతిమిలాడుకోవటంతో పాకిస్థాన్ వైపు మొగ్గినట్లు ఒక ప్రకటన ట్రంప్ ఇచ్చాడు కానీ ఎంతవరకు ట్రంప్ ఒకే మాట మీద స్థిరంగా ఉండగలడో ఎవరూ చెప్పలేని పరిస్థితి. అందుకే చైనా రంగంలోకి దిగి ఏదోవిధంగా బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్‌లు పాకిస్థాన్‌ను బలపరచడానికి చైనా ఈ దేశాలతో సమావేశాలు ఏర్పాటు చేసింది. శ్రీలంక, నేపాల్ దేశాలను కూడా ఆర్థిక సహాయం పేరుతో భారత్‌కు వ్యతిరేకంగాచైనా రంగంలోకి దింపాలని చూస్తున్నది కానీ, ఆ రెండు దేశాలు ప్రస్తుతానికి పూర్తిగా పాకిస్థాన్, చైనాలవైపు మొగ్గటం లేదు. ఏదిఏమైనా భారత్ నిరంతరం ఈ దేశాలతో అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారత్ టెర్రరిజంను అణచి వేసేందుకు దక్షిణ ఆసియా దేశాల సహాయ సహకారాలను అభ్యర్థిస్తున్నది. అలాంటి నేపథ్యంలో చైనా, పాకిస్థాన్‌ల చర్యలు అడ్డుకట్టలుగా మారొచ్చు. భారతదేశం వెనక్కి తగ్గకుండా ఆదేశాలతో సత్సంబంధాలు కొనసాగించకతప్పదు. భారత్ బలాన్ని తప్పుగా అంచనా వేసి ఏ దేశం పాకిస్థాన్‌కూ, చైనాకూ తోడ్పడి టెర్రరిజం లాంటి సమస్యలు సృష్టిస్తే తగు రీతిలో భారత్ ఆపరేషన్ సిందూర్‌లా తిరుగులేని జవాబు ఖాయం. ఆర్థిక, మిలటరీ రాజకీయ సమస్యలు ఎదుర్కోకతప్పదు అని ఆదేశాలకు సంకేతాలు అందుతే అటువైపు మొగ్గుచూపకపోవచ్చు. •

# రైతు సౌభాగ్యమే దేశాభివృద్ధికి మూలం

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రతి సంవత్సరం జూలై 1న నిర్వహించే ప్రపంచ వ్యవసాయ దినోత్సవం, మానవ జాతి జీవనాధారమైన వ్యవసాయ రంగ ప్రాముఖ్యతను గుర్తుచేసే సందర్భం. ఈ రోజు అన్నదాతల కృషిని గౌరవించడం, వ్యవసాయ రంగానికి అంకితభావంతో పని చేసే ప్రతి ఒక్కరికి అభినందన తెలిపే ఉదాత్త సందేశాన్ని ప్రసారం చేస్తుంది. ఇది కేవలం ఒక దినోత్సవం మాత్రమే కాదు భవిష్యత్తు ఆహారభద్రతకు, పర్యావరణ పరిరక్షణకు, గ్రామీణాభివృద్ధికి, సమాజ సమతుల్యతకు మూలమైన వ్యవసాయాన్ని మనస్ఫూర్తిగా ఆలోచించే రోజు. వ్యవసాయం కేవలం పంటలు పండించడం అనే అర్థానికి మాత్రమే పరిమితమయ్యే రంగం కాదు. ఇది ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక, కోట్లాది మందికి ఉపాధిమార్గం, సమాజ సంస్కృతికి ప్రాణనాడి, పర్యావరణ సమతుల్యతకు నిర్ధారక శక్తి. గ్రామీణ జీవితానికి పునాది వేసే వ్యవసాయం మన సంస్కృతి, ఆచారాలతో సైతం జతపడి ఉంది. పండుగలు, పంటల కట్టుబాట్లు, వర్షాకాలపు వేడుకలు అన్నీవ్యవసాయ దశల ఆధారంగా రూపుదిద్దుకున్నవే. వ్యవసాయ రంగం ప్రపంచ జనాభాలోదాదాపు 26శాతం మంది ఉద్యోగ అవకాశాలపై ప్రభావం చూపుతోంది. ప్రపంచ వ్యాప్తంగా రెండు బిలియన్ మందికి పైగా ప్రజలు నేరుగా వ్యవసాయ సంబంధిత రంగాల్లో పనిచేస్తున్నారు. భారతదేశంలోనే సుమారు 54 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. 2023-24 గణాంకాల ప్రకారంభారత దేశంలో వ్యవసాయ రంగం జాతీయ స్థూల ఉత్పత్తిలో సుమారు 18.3 శాతం వాటా కలిగిఉంది. ఈరంగంద్వారా ముడిసరుకులు, ఆహారం, జాతికి జీవనాధారం లభించడమే కాకుండా, పలు పరిశ్రమలకు మౌలిక మద్దతు లభిస్తోంది. ఉదాహరణకు, పత్తి, చెరకు, నూనె గింజలు, ధాన్యాలు వంటి పంటల ద్వారా వస్త్ర, చక్కెర, నూనె పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్నాయి. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో వాతావరణ మార్పులు కీలకంగా ఉన్నాయి. అంతర్జాతీయ స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పంటల దిగుబడిపై దుష్ప్రభావం పడుతోంది. ఐపీసీసీ నివేదికల ప్రకారం 2050 నాటికి వర్షాధారిత సాగు ప్రాంతాలలో 10-25 శాతం దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. భారత దేశంలో తూర్పు రాష్ట్రాల నుంచి పశ్చిమ ప్రాంతాల దాకా వాతావరణ అస్థిరతలు రైతులకు నష్టాలను కలిగిస్తున్నాయి. నీటి కొరత, భూసార హీనత, వ్యవసాయ రుణ భారం, మార్కెటింగ్ లో అసమతుల్యత, మధ్యవర్తుల వలయంలో రైతు ఆదాయం తగ్గిపోవడం వంటి అంశాలు రైతుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. ఇంకా, భారత దేశంలో రైతు ఆదాయం నామమాత్రంగా పెరుగుతోంది. 2017 నుండి 2023 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా రైతుల సగటు నెలవారీ ఆదాయం రూ. 8,000-10,000 మధ్యగానే ఉందని ఎన్ఎస్ఎస్ఓ నివేదికలు సూచిస్తున్నాయి. ఈ ఆదాయంతో కుటుంబ ఖర్చులు, విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు మిళితం చేస్తే వ్యవసాయాన్ని కొనసాగించటం చాలా కష్టమైనదిగా మారింది. ఫలితంగా యువత వ్యవసాయాన్ని వదిలి ఇతర రంగాల్లో ఉద్యోగాల కోసం వలస బాట పడుతున్నారు. ప్రపంచ జనాభా వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, భవిష్యత్తు ఆహార అవసరాలను తీర్చాలంటే వ్యవసాయ రంగం సామర్థ్యాన్ని గణనీయంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. వ్యవసాయ రంగానికి ఆధునికతను చేర్చడం అత్యవసరమవుతోంది. స్మార్ట్ ఫార్మింగ్, డ్రోన్ సాంకేతికత, భూసార పరీక్షా పద్ధతులు, మైక్రో ఇరిగేషన్ పద్ధతులు, డిజిటల్ మార్కెట్ ప్లాట్‌ఫామ్‌లు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (నీశిప్పీ) వంటి ఆధునిక విధానాల ద్వారా వ్యవసాయాన్ని సమర్థవంతంగా తీర్చిదిద్దవచ్చు. •

# భాషా పరిశోధకులకు కల్పతరువు ఆచార్య దొణప్ప



డాక్టర్ టి. గౌరీ శంకర్

ఈ లోకం ఒక వ్యక్తిని నూరేళ్ల దాకా గుర్తుపెట్టుకొని ఆ వ్యక్తికి వందేళ్ల పండుగ చేస్తోంది అంటే? ఆ వ్యక్తి ఈ సమాజానికి ఎంతో విలువైనది ఏదైనా అందించి ఉండాలి. అది ఏ రంగమైనా కావచ్చు. ఆ వ్యక్తి ఎవరైనా కావచ్చు. ఆ రకంగా సాహిత్య రంగానికి సంబంధించి అపూర్వసాహిత్యాన్ని సృష్టించిన వారైనా అనితర సాధ్యమైన పరిశోధనా కృషిని సలిపిన వారైనా తన తరువాతి తరానికి విజ్ఞాన భాండాగారాన్ని అందించిన వారైనా, విలువలతో కూడిన విద్యానిధిని పంచిన వారైనా అటువంటి వారికి శతజయంతి మూర్తుల పేరిట ఉత్సవాలు నిర్వహించి, వారి సేవలు స్మరించుకొని వారి నుంచి స్ఫూర్తిని పొందడం ఆనవాయితీ. ఆ సంప్రదాయ పరంపరలో భాగంగా ఈయేడాది కొందరు తెలుగు కవి పండితుల శతజయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా 2025 జులై ఒకటవ తేదీ నుంచి 2026 జులై ఒకటో తేదీ వరకు దివంగత ఆచార్య తూమాటి దొణప్ప శతజయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా వారి గురించి కొన్ని విశేషాలు. పండిత పరిశోధకులు, విమర్శ కాగ్రేసరులు, భాషాశాస్త్ర నిపుణులైన ఆచార్య తూమాటి దొణప్ప 1926 జులై ఒకటవ తేదీన జన్మించినట్లు వారి పాఠశాల రికార్డులలో నమోదై ఉంది. కానీ 1926 కార్తీక మాసంలో పౌర్ణమినాడు పుట్టారని అంటారు. అనంతపురం జిల్లా, ఉరవకొండ మండలం, రాకట్ల గ్రామంలో పుట్టిన వీరి తల్లిదండ్రులు కీ.శే. తిమ్మక్క, కీ.శే. సంజీవప్ప. వీరి అసలు పేరు దొణ తిమ్మారాయ చౌదరి. అది క్రమేణ దొణప్పగా స్థిరపడింది. ఇంటిపేరు 'తూమాటి' జతపడి తూమాటి దొణప్పగా తెలుగు సాహితీ విద్యారంగాలలో లబ్ధప్రతిష్టులయ్యారు. పన్నెండేళ్ల వరకు వీరి చదువు సంప్రదాయ రీతిలో కొనసాగింది. ఆ తర్వాత 1948లో అనంతపురంలో ఇంటర్మీడియేట్ చదివారు. 1949-53లలో ఆంధ్రవిశ్వవిద్యాలయంలో బిఎ (ఆనర్స్) చేశారు. అదే విశ్వవిద్యాలయంలో 1954లో ఎం.ఎ(తెలుగు) పూర్తిచేసి అదే ఏడు పూణేలోని దక్కన్ కాలేజీలో భాషాశాస్త్రంలో శిక్షణ పొందారు. 1965లో 'వైకృత పద స్వరూప నిరూపణం' అనే అంశంపై ఆచార్య గంటి జోగి సోమయాజులు పర్యవేక్షణలో పరిశోధన చేసి ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్‌డి, డాక్టరేట్ పట్టా పొందారు. ఈ పరిశోధనకు విశ్వవిద్యాలయం ఉత్తమ పరిశోధన అవార్డును ప్రకటించింది. 1982లో వీరు రచించిన 'తెలుగు హరికథా సర్వస్వం' గ్రంథానికి ఆంధ్రవిశ్వవిద్యాలయం డి.లిట్ ప్రదానంచేసింది. విద్యార్థి దశ నుంచే వీరు చదువులన్నింటిలో ఉత్తమ శ్రేణిలో నిలిచారు. 1958లో ఆంధ్రవిశ్వవిద్యాలయంలోని తెలుగు శాఖలో లెక్చరర్‌గా వీరి ఉద్యోగ జీవితం ప్రారంభమైంది. అక్కడ తెలుగు శాఖ చేపట్టిన తెలుగు వ్యుత్పత్తి కోశ నిర్మాణంలో ఒకపుష్కర కాలం క్రియాశీలంగా పనిచేశారు. 1970 లో నాగార్జున విశ్వవిద్యాలయం స్థాపించిన తొలి రోజులలో అక్కడికి వెళ్లి తెలుగుశాఖాధిపతిగా, రిజిస్ట్రార్‌గా, ప్రిన్సిపాల్‌గా వివిధ హోదాలలో సేవలందించి, ఆ శాఖను పటిష్టం చేశారు. పాతికేళ్లకుపైగా బోధన రంగంలో పనిచేసి ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. ప్రొఫెసర్ స్థాయిలో పరిశోధక విద్యార్థులకు పర్యవేక్షకునిగా వ్యవహరించారు. వీరి పర్యవేక్షకత్వంలో 20 మంది



ఆచార్య తూమాటి దొణప్ప శతజయంతి

ఎంఫిల్, 40 మంది పిహెచ్‌డి పట్టాలు పొందారు. ఆచార్య తూమాటి దొణప్ప విద్యార్థి దశ నుంచే రచనలు చేయడం ప్రారంభించారు. తొలి రోజులలో ఆశువుగా కవిత్వం చెప్పేవారు. అలవోకగా పద్యాలు అల్లేవారు. ఇది గమనించిన కొందరు ఆయనను అవధానాలు చేయమని కూడా ప్రోత్సహించారు. ఎనిమిదవ తరగతి చదివేటప్పుడు చిత్రగుప్తఅనే పేరుతో ఒక కథ రాశారు. ఆ తరువాత వర్ణాంతర వివాహం ఇతివృత్తంగా 'చంద్రుడు కలువ' కథ, 'ఆదర్శశిఖరాలు' అనే ఏకాంకిక, 'అన్వేషణ' అనే గేయం దేశచరిత్రకు పేరడ్‌గా, హాస్టల్ చరిత్ర, మొదలైన రచనలు చేశారు. వీటితో పాటు అనంతర కాలంలో అనేక సృజనాత్మక, పరిశోధనాత్మక, విమర్శనాత్మక రచనలు ఎన్నో చేశారు. ఇవి ఆనాటి 'వినోదిని' 'రూపవాణి' 'ఆనందవాణి' 'ఢంకా', 'సూర్యప్రభ' వంటి పలు పత్రికలలో అచ్చయ్యాయి. ఆనాటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమివారి 'వృత్తి పదకోశాల' నిర్మాణంలోమొదటిదైన 'వ్యవసాయవృత్తి పదకోశం'లో ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తికి సహాయకునిగా పనిచేశారు. ఆ తరువాత 'మత్స్యపరిశ్రమ' నౌకా నిర్మాణానికి సంబంధించిన వృత్తిపదకోశాలకు సంపాదకునిగా పనిచేశారు. సాహితీవేత్తగా, పండిత పరిశోధకునిగా, భాషాశాస్త్ర నిపుణునిగా వీరికి అత్యంత కీర్తిప్రతిష్టలు తెచ్చిపెట్టిన గ్రంథాలు. 'ఆంధ్ర సంస్థానములు సాహిత్య పోషణము' 'భాషాచారిత్రక వ్యాసావళి 'తెలుగులో కొత్త వెలుగులు'జానపద కళాసంపద, తెలుగు హరికథా సర్వస్వం, 'వైకృత పద స్వరూపనిరూపణము, (పిహెచ్‌డి, సిద్ధాంత గ్రంథం)ఆకాశ భారతి, బాలల శబ్ద రత్నాకరం (నిఘంటువు) వీరికి సంప్రదాయ వ్యాకరణాల మీద, ఆధునిక భాషాశాస్త్రం మీద ప్రత్యే కాభిమానం. ఇటు శిష్ట సాహిత్యం, జానపద వాఙ్మయంపై కూడా మంచి పట్టుఉంది. ఒకప్పుడు ఆయన రాయలసీమ జానపదగేయాలను స్వయంగా పాడి అలరింపచేసేవారట. ఆనాటి ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి ద్వారా దొణప్ప మూడుసార్లు అవార్డు అందుకొన్నారు. 1965-66లో 'ఆంధ్ర సంస్థానములు సాహిత్య పోషణము' 1975-76లో తెలుగులోహరికథా సర్వస్వం, 1978లో జానపద కళాసంపద, గ్రంథాలకుగాను వీరికి ఈ అవార్డులు లభించాయి. 1980లో ఆనాటి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ద్వారా ఉత్తమ ఉపాధ్యాయ' అవార్డును కూడా అందుకొన్నారు. 1985లో ఆనాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతనంగా స్థాపించిన తెలుగువిజ్ఞాన పీఠానికి వీరిని ప్రత్యేకాధికారిగా నియమించింది. అదే సంవత్సరం అంటే 1985సెప్టెంబర్‌లో ప్రభుత్వం తెలుగు విజ్ఞాన పీఠాన్ని చట్టబద్ధంగా తెలుగు విశ్వవిద్యాలయంగా మార్చింది. తెలుగు విజ్ఞాన పీఠానికి ప్రత్యేకాధికారిగా కొనసాగుతున్న ఆచార్య తూమాటి దొణప్పనే ప్రభుత్వం తెలుగువిశ్వ విద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా నియమించింది. దాంతో వీరు 1986 జనవరి 8వ తేదీనుంచి మూడేళ్లపాటు 1989 జూన్ 20వ తేదీవరకు తెలుగువిశ్వవిద్యాలయ మొదటి వైస్ ఛాన్సలర్‌గా కొనసాగారు. అపూర్వమైన, అపారమైన సాహిత్యకృషి సలిపిన వీరు1996 సెప్టెంబరు 6వ తేదీన కన్నుమూశారు. భౌతికంగా దూరమైనా, వారందించిన జ్ఞాన కోశంలోని ప్రతి అక్షరంలో చిరంజీవిగా నిలిచి ఉన్నారు. పది కాలాలు నిలిచే ప్రామాణికమైన గ్రంథరచన చేయాలంటే సర్వతోముఖమైన పాండిత్యం కావాలి. నవనవోన్మేషమైన ప్రతిభ కావాలి. పరిశోధనలో పాటవమూ, సత్యాన్వేషణలో తత్పరతా పరిశ్రమలో ఉత్సాహమూ, నిజాయితీతో కూడిన అవగాహనా, ప్రగతిదృక్పథమూ, పక్షపాతం లేని తీర్పుకావాలి. ఇదిగో ఇన్నీ మూర్తీభవించిన ఆచార్యులు డాక్టర్ దొణప్పగారు అంటూ ప్రముఖ కవిపండితుడు పురిపండా అప్పలస్వామి కితాబునిచ్చారు. •

# లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ దేవాదాయశాఖ అధికారి

**కొల్లూరు,జూన్ 30 (ప్రభాతవార్త) :** లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు సోమవారం పట్టుబడ్డ కొల్లూరు దేవాదాయ శాఖ అధికారి ఎన్.శ్రీనివాసరావు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారి మహేంద్ర మత్తే మీడియాతో మాట్లాడుతూ కొల్లూరు సెంటర్లో శివాలయం



దేవస్థానం క్రింద సుమారు 25షాపులు ఉన్నాయి. ఈ షాపులు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి రెన్యూవల్ చేస్తూ ఉంటారు. ఈ సంవత్సరం 22వ షాపును సంబంధించిన వ్యక్తి వంకాయల లక్ష్మణ నారాయణ చనిపోవడం జరిగింది. ఈషాప్ ని తన కుమారుడైన వంకాయల సాయి తన పేరా బదిలీ చేయమని ఈఓను అడగడం జరిగింది. ఈ సందర్భంగా ఈఓనీ పేరు మార్చాలంటే లక్ష రూపాయలు ఇవ్వమని డిమాండ్ చేశారు. లక్ష ఇవ్వలేను రూ.70వేలు ఇస్తానని ఇద్దరి మధ్య ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా వంకాయల వెంకటసాయి ఎండోమెంట్ అధికారికి రూ.60వేలు ఇచ్చారు. మిగిలిన 10వేలు ఇవ్వమని డిమాండ్ చేస్తుండగా వెంకట సాయి అవినీతి నిరోధక శాఖకి ఫోన్ చేయడం జరిగింది. వారు సోమవారం గుంటూరు నుంచి వచ్చి మిగిలిన రూ.10వేలు ఇస్తుండగా ఎండోమెంట్ అధికారి ఎన్.శ్రీనివాసరావుని ఏసీబీ అధికారి మహేంద్ర మత్తే వారి బృందం రెడ్ హ్యాండెగా పట్టుకోవడం జరిగింది. ఇదే కాక 25షాపుల వ్యాపారస్తులని మీకు రెన్యూవల్ చేయాలంటే ప్రతి మూడు సంవత్సరాలకి నూరు శాతం పెంచుతానని బెదిరించడంతో షాపు యజమానులు మేమంతా కట్టేమని తగ్గించమని అడగగా ఒక్కొక్క షాపుకి రూ.15వేలు ఇస్తే 30శాతం తగ్గిస్తానని షాపు యజమానులను బెదిరించడం జరిగింది. వీళ్ళందరూ కలిసి ఏసీబీకి ఫోన్ చేసి చెప్పడం జరిగిందని, షాపులు వారిచ్చిన సమాచారం మేరకు ఏసీబీ అధికారి మహేంద్ర మత్తె వారి బృందం వచ్చి డబ్బులు తీసుకుంటున్న శ్రీనివాసరావుని రెడ్ హ్యాండ్ గా పట్టుకోవడం జరిగిందని ఏసీబీ అధికారి విలేఖర్లకు చెప్పడం జరిగింది.

# శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు : ఎస్పీ సతీష్‌కుమార్

**గుంటూరు తూర్పు, జూన్ 30 (ప్రభాతవార్త) :** జిల్లాలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, నిరసనలు, బంద్‌లు నిర్వహించాలనుకునే వారు తప్పని సరిగా పోలీస్ వారి నుంచి ముందస్తు అనుమతి కోరాలని సోమవారం ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించినా తప్పని సరిగా పోలీస్ అధికారుల వద్ద పర్మిషన్ తీసుకోవాలన్నారు. లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సభలు, సమావేశాలు నిర్వహించాలనుకునే వారు పూర్తి వివరాలను, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్ పోలీసు వారికి అందించాల న్నారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రముఖుల వివరాలు, వారు వచ్చే మార్గం, వారి వెంట వచ్చే వాహనాలు, కార్యక్రమానికి హాజరయ్యే ప్రజల సంఖ్య, వారికి ఏవైనా భోజన సదుపాయాలు ఏర్పాటు చేస్తే వారి వివరాలను తెలపాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో 30పోలీస్ యాక్ట్ ఎల్లప్పుడూ అమలులో ఉంటుందన్నారు. నిర్వహించే కార్యక్రమం శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఉంటే ఏ సమయంలోనైనా కార్యక్రమాన్ని చట్టపరంగా రద్దు పరిచే అధికారం పోలీస్ వారికి ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు దృష్టిలో పెట్టుకుని పోలీస్ వారికి సహకరించాలని కోరారు.

# జాతీయ స్థాయి బాడ్మింటన్ పోటీల్లో రుచేంద్రకు సిల్వర్ మెడల్



**మంగళగిరి, జూన్ 30,ప్రభాతవార్త :** ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి చెందిన అంతర్జాతీయ బాడ్మింటన్ క్రీడాకారుడు రుచేంద్ర తిరుపతి జవీసం హైదరాబాద్ లో జరిగిన జాతీయ బాడ్మింటన్ పోటీల్లో సిల్వర్ మెడల్ ను కైవసం చేసుకున్నాడు. తెలంగాణా బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు సికింద్రాబాద్ స్పోర్ట్స్ కాంప్లెక్సులో యోనెక్స్ సన్ రైజ్ వారి 11వ జాతీయ స్థాయి సీనియర్స్ బాడ్మింటన్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ నుంచి హాజరైన రుచేంద్ర తిరుపతి మెన్స్ సింగిల్స్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్, వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ ఆరోరాలు రుచేంద్రకు. అభినందనలు తెలిపారు. బాడ్మింటన్ క్రీడలో అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన రుచేంద్ర ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో జరిగిన బాడ్మింటన్ పోటీల్లో గోల్డు, సిల్వర్ మెడల్స్ సొంతం చేసుకున్నాడు.

# అమరావతి వార్త



# అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరిస్తే ఎలా..?

**-అనధికారిక కట్టడాలను వెంటనే తొలగించండి...**
**-పారిశుద్ధ్య సమస్యపైనే ప్రధాన చర్చ**
**-త్వరలో అన్ని సమస్యల పరిష్కారం...**
**నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర**

**గుంటూరు తూర్పు, జూన్ 30 (ప్రభాతవార్త) :** నగరంలోని ప్రధానంగా సమస్యలైన పారిశుద్ధ్యం, అక్రమ కట్టడాలు, అక్రమలే అవుట్లు వంటి ప్రధాన సమస్యలపై ప్రజా ప్రతినిధులు అధికార ప్రతిపక్ష కార్పొరేటర్లు గళం విప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశం దద్దరిల్లింది. నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షతన కమిషనర్ నేతృత్వంలో కార్పొరేటర్ సభ్యులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, కో ఆప్షన్ సభ్యులు, అధికార యంత్రాంగంతో సోమవారం ఉదయం 10.45గంటలకు కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. ఈ సమావేశంలో ప్రతిపక్షమైన వైఎస్ఆర్సీపీ కార్పొరేటర్లు, ఇటు అధికారపక్ష కూటమి ప్రభుత్వ కార్పొరేటర్లు అధికారుల పనితీరు, వారు చెప్పే కౌన్సిల్లో సమాధానాలను విసిగి వేశారని ప్రశ్నల వర్షం కురిపించారు. స్థానిక ఎమ్మెల్యేలు ప్రజల సమస్యలపై గళం విప్పారు. శాశ్వత పరిష్కార దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. నగరంలో ప్రధానంగా ప్రజలు ఎదుర్కొంటున్న పారిశుద్ధ్య సమస్యపైనే వాడివేడిగా చర్చ జరిగింది. అధికారులు చెప్పే సమాధానాలకు క్షేత్రస్థాయిలో వార్డులలో ఉన్న పరిస్థితికి పొంతన లేకుండా పోయిందని అన్ని తప్పుడు సమాధానాలతో కౌన్సిల్‌ని తప్పుదారి పట్టిస్తున్నారని ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కౌన్సిల్ సమావేశంలో ఇచ్చిన సమాధానాలే తిరిగి మళ్ళీ సమాధానాలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ కట్టడాలను తక్షణమే తొలగించి కార్పొరేషన్ ఆదాయానికి గండికి పడకుండా చూడాలని సూచించారు. అదే విధంగా అక్రమ లే అవుట్లను యధేచ్ఛగా కొనసాగిస్తున్నారని పలు సమావేశాల్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని సభ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నిటిని పరిగణలోకి తీసుకుని నగర మేయర్ రవీంద్ర తక్షణమే సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ద్వారా అధికారులకు సూచించారు. ఒక టైం బాండ్ పెట్టుకొని స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. నిరంతర సమస్యగా ఉన్న పారిశుద్ధ్య ప్రతిచోట లోపం ఉంటుందని, దాన్ని మెరుగులు చేపట్టేందుకు ఇప్పటికే అనేక ప్రణాళిక కార్యక్రమం చేపట్టడం జరిగిందని, ఇక నుంచి కూడా నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజా ప్రతినిధులు అధికార యంత్రాంగం ప్రత్యేక టీములుగా ఏర్పాటు చేసి పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బందితో సమస్యలను పరిష్కరించే విధంగా ముందుకు వెళ్ళేందుకు సిద్ధంగా ఉన్నామని కమిషనర్ పులి శ్రీనివాసులు వెల్లడించారు. అందుకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, అవసరాన్ని బట్టి కొంత సిబ్బందిని దినసరి వేతనం చెల్లించేలా నియమించుకోవడం చేస్తామని మేయర్ ద్వారా కమిషనర్ సమాధానం తెలిపారు. వీటితో పాటు అక్రమ కట్టడాల నిర్మూలనకు ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్లు కౌన్సిల్ సభలో వెల్లడించారు. అనధికార లేఔట్‌పై పూర్తి ఆధారాలతో తక్షణమే చర్యలు తీసుకోవడం జరుగుతుందని మేయర్ సూచించారు. కమర్షియల్ వ్యాపార సముదాయాల నుంచి అక్రమంగా అనధికారకం ఏళ్ళ తరబడి డబ్బులు వసూలు చేస్తున్నారని వారు ఏజెన్సీల టెండర్లు రద్దు చేసినా ఆ ఏజెన్సీలో ఇంకా తిరుగుతున్నాయని కార్పొరేటర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకుని వచ్చారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు మేయర్ సూచించారు. నగరంలో రోడ్ల విస్తరణ త్వరితగతిన చేపట్టాలని, అలానే ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి



సాధించాలని సభ్యులు కౌన్సిల్‌లో చర్చించారు. ఏది ఏమైనా తమకున్న సమయం తక్కువ కాలం కాబట్టి ఈ కూటమి ప్రభుత్వంలో ప్రజలకు ఎంత వరకు మంచి ఏయాలో అందుకు పార్టీలకతీతంగా అభివృద్ధి చేసేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పొంతన లేని సమాధానాలు చెప్పకుండా సమగ్ర సమాచారంతో ఒక టైం బాండు ఫిక్స్ చేసుకొని సమస్య పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మేయర్ సూచించారు. కార్పొరేటర్లు అడిగిన 36 ప్రశ్నల చర్చలు పూర్తయ్యాక కార్పొరేషన్ ప్రియాంబుల్స్, టేబుల్, అజెండా అంశాలను పాస్ చేస్తూ కౌన్సిల్ తీర్మానం చేసింది.

**అధికారులు పని చేయకపోతే ఎలా :-** గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని అభివృద్ధి పనులు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని వీటిపై ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పనిచేయకపోతే ఎలా ఉంటూ ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు లక్షల మొక్కలు నాటుతామని చెప్పారు. బాగానే ఉంది, ఇప్పటికీ 10వేల మొక్కలు తెచ్చామన్నారు.350మొక్కలు నాటామని చెబుతున్నారు. అసలు మొక్కలు ఎక్కడ నాటారు, అనేక మొక్కలు పాడైపోతున్నాయని కౌన్సిల్‌లో ప్రశ్నించారు. మొక్కలు నాటి సంరక్షించేందుకు ట్రీ గార్డ్స్ కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. నగరంలో అసలు బ్యూటిఫికేషన్ లేదని, మంగళగిరి, తాడేపల్లి, సత్తెనపల్లి ప్రాంతాలలో పచ్చదనంతో ఎలా ఉన్నాయో ఒకసారి చూడండి అంటూ ప్రశ్నించారు. ఒక ప్రణాళిక పద్ధతిలో నగరాభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు.

**అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలకు సమాధానం చెప్పుకోలేక పోతున్నాం : ఎమ్మెల్యే గల్లా మాధవి**



ప్రతి కౌన్సిల్ సమావేశంలో తాను అడిగిన ప్రశ్నలు, కార్పొరేటర్ల ప్రశ్నలకు చెప్పిన సమాధానమే తిరిగి తిరిగి చెబితే ఎలా అంటూ గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు తమను ప్రశ్నిస్తే సమాధానం చెప్పుకోలేని పరిస్థితిలో అధికారులు మమ్మును తయారు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయాల్లో పనితీరు అధ్వానంగా ఉందని సమాధానం చెప్పే వారే కరువయ్యారన్నారు. ప్రధాన రహదారులపై అడ్డుగా ఉన్న ఎల్ఈడి డిస్ప్లే బోర్డులు, హోర్డింగులు తొలగించమని గతంలో చెప్పినా అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. అధికారులు ఎన్ని యాడ్ ఏజెన్సీలకు అనుమతులు ఇచ్చారు. అని అనధికారికంగా ఎన్ని ఉన్నాయి, పూర్తి సమాచారం ఇవ్వాలని కోరారు. ఖాళీ స్థలాల వల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆ యజమానులకు నోటీసులు ఇచ్చి అపరాధ రుసుము వసూలు చేయాలన్నారు. స్థల యజమానులు స్పందించని పక్షంలో కార్పొరేషన్ స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని చూపించారు. నా నియోజకవర్గంలో సగం పనులు చేసి పత్తా లేకుండా వెళ్ళారని అటువంటి వాడిని ఎందుకు ఉపేక్షిస్తున్నారని అధికారులను ప్రశ్నించారు.

**కార్పొరేషన్ ఆదాయాన్ని గండి కొట్టే వాళ్ళను ఉపేక్షించవద్దు : ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం**

ప్రభుత్వాలు మారుతూ ఉంటాయి...సిస్టం ఎప్పటికీ మారదని ప్రజా ప్రతినిధుల సిఫార్సు మేరకు కార్పొరేషన్‌కి వచ్చే ఆదాయానికి మనమే గండి కొడుతున్నామని వైసీపీ ఎమ్మెల్సీ చంద్రిరి ఏసురత్నం అన్నారు. ప్రతి సమావేశాల్లో చర్యలు తీసుకోమని ప్రజా ప్రతినిధులు చెబుతారని, ఆ తర్వాత చర్యలు తీసుకునేటప్పుడు ఏదో ఒక ప్రతినిధి సిఫార్సు చేయటం సర్వసాధారణం అయిందన్నారు. ఒక సిస్టం ప్రకారం ఏ రాజకీయ నాయకుడు అక్రమాలు చేసే వాళ్ళకు వత్తాసు పడకుండా ఉంటే తప్పకుండా సమస్య పరిష్కారం అవుతుందని సూచించారు. కాంట్రాక్టర్లు పనిచేయకపోతే చర్యలు తీసుకోవాలని, అక్రమ కట్టడాలు తొలగించాలని, అనధికార లే ఔట్లను తొలగించి కార్పొరేషన్ ఆదాయ మార్గంగా చూసుకోవాలని సలహా ఇచ్చారు. దీనిపై విజిలెన్స్ ఎంక్వయిరీ చేయమని గతంలో మేయర్, కమీషనర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. దీనిపై స్పందించిన మేయర్ విజిలెన్స్ ఎంక్వయిరీ కోరుతూ కమీషనర్ ఇచ్చిన లేఖను సభలో చూపించారు. ఈ కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కో ఆప్షన్ సభ్యులు, కార్పొరేషన్ అన్ని విభాగాధిపతులు తదితరులు ఉన్నారు.

# బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మంత్రులు పార్ధసారథి,గొట్టిపాటి

**బాపట్ల,జూన్30,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం మానవత్వంతో పాలన సాగిస్తోందని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్ధసారథి అన్నారు.బ్లాక్ బర్లీ పొగాకు రైతుల కొరకు బాపట్ల జిల్లాలో మూడు కొనుగోలు కేంద్రాలను మంత్రి పార్ధసారథి,రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కలిసి రిబ్బన్ కత్తిరించి సోమవారం ప్రారంభించారు. జె పంగులూరు మండలం జె.పంగులూరు గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఒక కేంద్రం ప్రారంభించగా, ఇంకొల్లు మండలం ఇంకొల్లు మార్కెట్ యార్డులో మరొక



కేంద్రం ఏర్పాటు చేశారు.పర్చూరు మండలం వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములో ఒక కొనుగోలు కేంద్రాన్ని మంత్రి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు.పొగాకు కనుగోలు కేంద్రాల్లో ప్రారంభమైన వేలాన్ని పరిశీలించారు.అనంతరం రైతులతో ముఖాముఖిగా మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బ్లాక్ బర్లీ పొగాకు చివరి ఆకు వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రైతులంతా ధైర్యంగా ఉండాలని మంత్రులు వారికి భరోసా కల్పించారు.ఈ సందర్భంగా మంత్రి పార్ధసారధి మాట్లాడుతూ రైతులకు ఏ సమస్య వచ్చినా నేనున్నానంటూ వారి పక్షాన నిలిచి, సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తుందన్నారు. రాష్ట్రం అభివృద్ధి పట్టాలు ఎక్కించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. బ్లాక్ బర్లీ పొగాకు పండించాలని రైతులపై ఒత్తిడి చేసిన కంపెనీలు పంట చేతికి రాగానే చేతులెత్తేశారన్నారు. ఇబ్బందుల్లో ఉన్న రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. పొగాకు సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి ప్రభుత్వమే కొనుగోలు చేసేలా జిల్లాలోని ప్రజా ప్రతినిధులు కృషి చేశారన్నారు. రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా పొగాకు పంటను కొనుగోలు చేస్తుందన్నారు.రైతులకు అనుకూలమైన వాతావరణంలో పాలన సాగిస్తుందని వివరించారు.రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రైతుల ఇబ్బందులను తొలగించడానికే బ్లాక్ బర్లీ పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. మార్టూరు, కొరిశపాడు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి విన్నవించగానే ఆమోదం తెలిపారన్నారు. పొగాకు కొనుగోలు చేయడానికి రూ.270కోట్లను ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. రైతుల నుంచి ప్రతి ఆకును ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. బ్లాక్ బర్లీ పొగాకును మూడు గ్రేడ్ లుగా విభజించి, ఏగ్రేడ్ రకం పొగాకు క్వింటాకు రూ.12,000ధర నిర్ణయించిందన్నారు. బిగ్రేడ్ రకం పొగాకు రూ.9,000లు, సిగ్రేడ్ రకం క్వింటా పొగాకు రూ.6,000లు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రతిరోజు ఒక కొనుగోలు కేంద్రంలో 20 మంది రైతులు నుంచి బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు చేయడానికి సన్నాహాలు చేసిందన్నారు.జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయంతోనే పొగాకు రైతులు సమస్యల నుంచి గట్టెక్కుతున్నారన్నారు. పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలన్నారు. కంపెనీల మాటలు విని రైతులు మోసపోవద్దన్నారు. గతేడాది బ్లాక్ బర్లీ పొగాకు మంచి ధర రాగానే నిరుద్యోగుల సైతం విస్తారంగా 65 వేల ఎకరాల్లో పంటలుసాగు చేశారన్నారు. అనుమతి కంటే అత్యధికంగా పంటల సాగు చేయడం, అంతర్జాతీయ మార్కెట్ లో ధరలు తగ్గడంతోనే సమస్య వచ్చిందన్నారు. రైతుల సమస్యకు పరిష్కారం చూపుతూ రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా కొనుగోలు ప్రారంభించిందన్నారు. బాపట్ల జిల్లా 12 మండలాల్లో పంటల సాగు చేయగా వాటిని కొనుగోలు చేయడానికి 18 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. చిట్టచివరి రైతు నుంచి పొగాకు కొనుగోలు చేస్తామన్నారు. ఇప్పుడు వరకు 342 మంది రైతుల నుంచి రూ.మూడు కోట్ల విలువైన 342 టన్నులు బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు చేసినట్లు వివరించారు. వెంటనే రైతుల బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అవుతాయన్నారు.పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ రైతుల పక్షాన బాధ్యతతో ప్రభుత్వం వ్యవహరిస్తుందని, ప్రభుత్వమే పొగాకు కొనుగోలు చేయడం సాహసోపేతమైన నిర్ణయం అన్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించి, కొనుగోలుకు రంగ ప్రవేశం చేసిందన్నారు. 48 గంటల్లోనే రైతుల ఖాతాలలోకి డబ్బులు వేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. విదేశీ మారక ద్రవ్యం అత్యధికంగా కల్పించిన బ్లాక్ బర్లీ పొగాకు రైతులు ఇప్పుడు కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నారన్నారు.ఈ పంటపై ప్రభుత్వం నియంత్రణ లేకపోవడంతోనే సమస్య ఏర్పడిందన్నారు. పారదర్శకంగా పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. 20 శాతానికి మించి తేమ ఉండరాదన్నారు. ప్రతిరోజు 3000 క్వింటాళ్ల పొగాకు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రైతుల నుంచి పూర్తిగా పొగాకు కొనుగోలు ముగిసే వరకు కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాయని, రైతులెవరు ఆందోళన చెందనవసరం లేదన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్, బాపట్ల, చీరాల ఆర్డీవోలు పి గ్లోరియా, చంద్రశేఖర్, మార్క్ ఫెడ్ ఏడి కరుణశ్రీ, మార్కెటింగ్ శాఖ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో స్విమ్మింగ్‌పూల్ నిర్వహించాలి : కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ క్రైం,జూన్ 30,ప్రభాతవార్త:** జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలు జరుగుతున్నవపటికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో స్విమ్మింగ్‌పూల్ నిర్వహించాలని,సిమ్మింగ్ పూల్‌లో వచ్చే ప్రతి ఒక్కరికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఆయన తన పర్యటనలో భాగంగా గాంధీనగర్,స్విమ్మింగ్‌పూల్,ధర్నాచౌక్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్విమ్మింగ్‌పూల్ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను పాటించాలన్నారు. షవర్,జిమ్, మరుగుదొడ్ల నిర్వహణ ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలని, ఏమైనా మరమ్మత్తులు ఉంటే వెంటనే స్పందించి సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.స్విమ్మింగ్‌పూల్ ఆవరణలో



ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు మొక్కలను పెంచాలన్నారు. పోటీలు జరుగుతున్న సమయంలో ప్రేక్షకులు వీక్షించేందుకు గ్యాలరీలను అభివృద్ధి చేయాలన్నారు. ధర్నా చౌక్‌లో ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని, నిరంతరం అధికారులు పర్యవేక్షిస్తూ ఎంటువంటి మరమ మ్మత్తులు ఉన్నా వెంటనే చేయాలని అధికారులను ఆదేశించారు. మిషన్ ద్వారా జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రధాన రహదారులలో మెషిన్లు తరచుగా పారిశుద్ధ్య నిర్వహణ జరిపించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి,చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్‌రత్నకుమార్,ఇంఛార్జి చీఫ్ మెడికల్,హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణనాయక్, పర్యవేక్షణ ఇంజనీర్లు పి.సత్యన్నారాయణ,పి. సత్యకుమారి,ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసిడి) పి.వెంకటనారాయణ,డియఫ్ఓ మాల్యాద్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


# సమస్యలకు చట్ట పరిధిలో తగిన పరిష్కారం : ఎస్పీ సతీష్‌కుమార్

**గుంటూరు తూర్పు, జూన్ 30 (ప్రభాతవార్త) :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజా ఫిర్యాదులు పరిష్కారాల వ్యవస్థ కార్యక్రమం సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన బాధితుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలకు చట్ట పరిధిలో తగిన పరిష్కారం చూపిస్తామని భరోసా ఇచ్చారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ఫిర్యాదుల పట్ల దృష్టి సారించి ఫిర్యాదులకు చట్ట పరిధిలో తగిన న్యాయం అందించాలని పోలీస్ అధికారులకు ఎస్పీ ఆదేశించారు. జిల్లా నుండి విచ్చేసిన ప్రజలతో ఎస్పీ మరియు ఇతర పోలీసు అధికారులు ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలపై అక్కడిక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ జి.వి.రమణమూర్తి, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ శ్రీనివాసరెడ్డి, సిసిఎస్ శివాజీ, ట్రాఫిక్ డిఎస్పీ రమేష్, పిజిఆర్ఎస్ సీఐ బిలాలుద్దీన్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మునిసిపల్ అధికారుల తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే మాధవి

**గుంటూరు క్రైమ్,జూన్ 30,ప్రభాతవార్త :** గుంటూరు మున్సిపల్ అధికారుల తీరుపై ఎమ్మెల్యే గళ్ళా మాధవి సోమవారం జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో మండిపడ్డారు.అధికారులు తాము అడిగిన ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాలకు తాను సంతృప్తి చెందడం లేదని,ప్రతి ప్రశ్నకు సమాధానం కూడా దాటవేత ధోరణి



సరికాదన్నారు.గతంలో తాను హోర్డింగ్,ఎల్ఈడి డిస్ప్లేల ఏర్పాటు విషయంతో తాను అడిగిన ప్రశ్నకు సంబంధం లేకుండా సమాధానం ఇస్తున్నారని,నగరంలో యాడ్ ఎజెన్సీలు కోట్లాది రూపాయలు కార్పొరేషన్‌కు చెల్లించాలని అధికారులే చెబుతున్నారు.అసలు వారు కార్పొరేషన్ సూచించిన ప్రమాణాలు పాటిస్తున్నారా? లేదా? అనేది అధికారులు పరిశీలించాలి. అదేవిధంగా ఖాళీ స్థలాల విషయంలో అనేక సార్తు కార్పొరేషన్, కమీషనర్ దృష్టికి తాను తీసుకొచ్చినా అధికారుల చర్యలు శూన్యమన్నారు.గతంలో తాను శానిటరీ డ్రైవ్ నిర్వహించినప్పుడు మేయర్,కమిషనర్,పర్యటించినప్పుడు ఖాళీ స్థలాలు చిట్టడవులను తలపించాయని,కమిషనర్ ఆ సమయంలో వెంటనే బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులనూ ఆదేశించినా కూడా సిబ్బంది పట్టించుకోలేదని,దీని వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు .నల్లచెరువు,సాయి ఆదిత్య స్కూల్ ప్రాంతాలతో పాటు పలు చోట్ల రహదారుల పనులు అర్ధాంతరంగా నిలిచిపోడం వలన ప్రజలు ఆ దారిలో నడవలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే పనులు పూర్తయ్యేలాగా చూడాలని ఎమ్మెల్యే మాధవి కోరారు.నగరంలో పారిశుద్యం పడకేసిందని ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతూ రోగాల పాలవుతున్నా నగర పాలక సిబ్బంది నిర్లక్ష్యం వీడడం లేదని,ప్రధాన రహదారుల్లో వీధి దీపాలు కూడా లేవని,శివారు ప్రాంతాల్లో ప్రజలు సూరా స్తమయం తర్వాత బయటకొచ్చే పరిస్థితి లేదని,పలు చోట్ల అంధకారం నెలకొనడంతో ద్విచక్ర వాహనదారులతోపాటు పాదాచారులు ప్రమాదాలకు గురవుతున్నారని కాబట్టి వేంటనే వీధి దీపాల ఏర్పాటుకు అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

# నాడు ఐటి, నేడు క్వాంటమ్,ఏఐ,ముఖ్యమంత్రి ప్రతి ఆలోచన రాష్ట్ర ప్రగతికోసమే : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట,జూన్30,ప్రభాతవార్త: పెట్టుబడులు, పరిశ్రమల ఆకర్షణతో రాష్ట్ర యువతకు బంగారు భవిష్యత్‌ను అందించి, రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అగ్రస్దానంలో నిలపాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటి శాఖా మంత్రి నారా లోకేష్ పనిచేస్తున్నారని మాజీమంత్రి, స్దానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. రాష్ట్ర యువత సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవడంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలన్నదే చంద్రబాబు ఆకాంక్ష అని, ఆ దిశగా యువత తమనుతాము మెరికల్లా తీర్చిదిద్దుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. పట్టణంలోని మోడరన్ డిగ్రి కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం యువతను ఉద్దేశించి మాట్లాడుతూ క్వాంటమ్ కేంద్రంగా అమరావతిని తీర్చి దిద్దాలన్న సదాశయం దిశగా ముఖ్యమంత్రి అడుగులు వేస్తున్నారని, గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఐటి రంగాన్ని అభివృద్ధి చేయడంలో చంద్రబాబు కీలకపాత్ర పోషించిన విషయం నేటి యువత గ్రహించాలని ప్రత్తిపాటి సూచించారు. అమరావతిని క్వాంటమ్, ఏఐ రంగాలకు హబ్‌గా మార్చాలన్న ముఖ్యమంత్రి ప్రణాళికలన్నీ రాష్ట్ర ప్రగతిలో బాగమేనని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. టిసిఎస్, ఐబియం, ఎల్అండ్‌టి సహకారంతో అమరావతిలో అతిపెద్ద క్వాంటమ్ వ్యాలీని సృష్టిస్తున్నారని, దానివల్ల భవిష్యత్‌లో ఎపి యువత క్వాంటమ్ కంప్యూటరింగ్‌లో ప్రపంచానికే మార్గదర్శిగా నిలుస్తుందని ప్రత్తిపాటి తెలిపారు. గ్రామీణ



ప్రాంతాలనుంచి వచ్చే యువత కమ్యూనికేషన్ స్కిల్స్, ఆంగ్లభాషపై పట్టుసాధించాలని ప్రత్తిపాటి సూచించారు. తెలుగువారికి కష్టపడే తత్వం ఎక్కువని, దానికి తోడు నలుగురిలో రాణించాలంటే మంచి స్కిల్స్ తప్పనిసరి అని ప్రత్తిపాటి చెప్పారు. భవిష్యత్‌లో ప్రతిది ఐటితో ముడిపడిఉన్నదని, ఆ రంగంలో రాణించాలన్నా, విదేశాల్లో స్దిరపడాలన్నా ప్రతి ఒక్కరూ చదువుతోపాటు అదనపు అర్హతలు సాధించాలని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. జాబ్‌మేళాలు నిర్వహించే కంపెనీలు కూడా ప్రతిభ గతవారికి అవసరమైన ఆదనపు నైపుణ్యం అందించి, ఉద్యోగశిక్షణలో రాటుతేలేలా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోడరన్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ చేబ్రోలు మహేష్, టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, జవ్వాజి మదన్‌మోహన్, పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, బేరింగ్ మౌలాలి, పార్టీ నాయకులు పాల్గొన్నారు

## పిజిఆర్ఎస్ లో ఫిర్యాదు చేసిన ప్రతి అర్జీదారుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**బాపట్ల,జూన్30,ప్రభాతవార్త:** పిజిఆర్ఎస్ లో ఫిర్యాదు చేసిన ప్రతి అర్జీదారుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా రెవిన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్ అధికారులకు తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని పి. జి. ఆర్. ఎస్. హాలులో డిఆర్ఓ అధ్యక్షతన



నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి.జి.ఆర్.ఎస్. పోర్టల్ లో పెండింగ్ లో ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. పోర్టల్ లో 50 అర్జీలను ఇంత వరకు సంబందిత అధికారులు చూసియుండలేదని ఆయన అసహనం వ్యక్తపరిచారు. సంబందిత శాఖాధికారులకు నోటీసులు జారీచేయాలన్నారు.పరిష్కరించిన అర్జీల పై సమగ్రంగా ఆడిటింగ్ చేయాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు లిఖితపూర్వకంగా అధికారులకు వినతిపత్రాలను అందించారు.అర్జీదారులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ అభ్యర్థించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే పరిష్కరిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి హామీ ఇచ్చారు. గడువులోగా అర్జీలు పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. పెండింగ్ లో లేకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. పరిష్కరించిన తదుపరి వారికిచ్చే ధ్రువీకరణ పత్రం తెలుగులోనే ఉండాలన్నారు.అర్జీలకు సక్రమంగా సమాధానం ఇవ్వడం లేదని ఆయన చెప్పారు. పీజీఆర్ఎస్ అర్జీలపై నిర్లిప్తంగా ఉండరాదన్నారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన పలు సూచనలు చేశారు.ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంతో పనిచేయాలన్నారు.ఐదు సంవత్సరాల వయసు నిండిన ప్రతి పిల్లవాడిని పాఠశాలలో చేర్చేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర గౌడ్ అధికారులకు తెలిపారు. అంగన్వాడి కేంద్రాలలో పిల్లల వివరాల మేరకు జిల్లాలో 3వేల 3వందల 71 మంది ఐదు సంవత్సరాల వయసు నిండిన పిల్లలు ఉన్నారని, వారికి సంబంధించి వారి తల్లిదండ్రుల పేర్లను ఫోన్ నెంబర్లను సేకరించినట్లు ఆయన తెలియజేశారు. జిల్లాలో ఐసిడిఎస్, ఎస్సీ, ఎస్టీ, బిసి,రెవెన్యూ డివిజన్ అధికారులు, ఎంపీడీవోలు మరియు తహసిల్దార్లు సమన్వయంతో పని చేస్తూ ఈ పిల్లలందరినీ పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకుగాను, వారి తల్లిదండ్రులతో ప్రభుత్వ పాఠశాలలో ఉన్న మౌలిక వసతుల గురించి, ప్రభుత్వం అందించే పథకాల గురించి వారికి అవగాహన కల్పించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. అధికారులు 3371 మంది ఐదు సంవత్సరాల వయసు దాటిన పిల్లలు ఏ పాఠశాలలో చేరారో సంబంధిత వివరాలను నమోదు చేయాలన్నారు. ప్రతి ఒక్క పిల్లవాడు పాఠశాలకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.ఆర్టిజిఎస్ లో భాగంగా జిల్లాలోని ప్రతి శాఖలో జరిగే కార్యకలాపాలను వెబ్సైట్లో నమోదు చేయాలని ఆయన అధికారులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఎ. పి.డి. శ్రీనివాసరావు రావు, సర్వ శిక్షఅభియాన్ అధికారి నాగిరెడ్డి,జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

## దాతల ఆశయాలను నిలబెట్టాలన్నదే గ్రామస్థుల ఆశయం

**యడ్లపాడు, జూన్ 30, ప్రభాతవార్త :** అన్ని రంగాలలో మంచి అవగాహనతో ముందుండే గ్రామం యడ్లపాడు అని, అటువంటి గ్రామంలో దీనావస్థకు చేరిన పాఠశాలను నాడు గ్రామస్థులు సమిష్టిగా తమ సహాయ సహకారాలతో దాతృత్వం చాటి ఏర్పాటుచేసిన దేవాలయం లాంటి పాఠశాల అన్యాక్రాంతంగాని, అసాంఘీక కార్యకలాపాలకు గాని నిలయంగా మారితే



దాతల అశయాలు నీరుగార్చి నట్టేనని, కాబట్టి అటువంటి వాటికి దూరంగా ఉంచి పూర్వీకుల అశయాలను నిలబెట్టాలన్నదే నేటి తరం గట్టిపట్టుదలతో ఉందని గ్రామస్థుడు నూతలపాటి కాళిదాసు పేర్కొన్నారు. యడ్లపాడు గ్రామంలో 1952లో పాఠశాల లేకపోవటంతో గ్రామస్థులు అందరూ కలసి కట్టుగా తమకు తోచిన విధంగా గదుల నిర్మాణం, వరండాల నిర్మాణం చేయటం జరిగిందని, అయితే దాని నిర్వహణ చేయటం ఇబ్బంది కరంగా ఉంటుందని అప్పుడే గ్రామస్థులు పాఠశాల నిర్వహణ బాధ్యతను గుంటూరుకు చెందిన ఏఈఎల్‌సీ వారి సహకారం తీసుకోవటం జరిగింది. అప్పటి నుండి పాఠశాలను నిర్వహించుతూ వస్తున్నారు వారు. అయితే వారు మాత్రం నిర్వహణ బాధ్యతే తీసుకున్నారేగాని పాఠశాల బాగోగులు చూడకపోవటం వల్ల దాతలు ఇచ్చిన అటస్థలం, గదుల పై శ్లాబు చిల్లులు పడటంతో మరలా గ్రామస్థులు జోక్యం చేసుకొని దాతలను సంప్రదించి వీటి నిర్మాణానికి సుమారు 40లక్షల వరకు ఖర్చు చేసిన ఏర్పాటు చేశారు. అయితే కాలక్రమేణా పాఠశాలలో ఉపాధ్యాయుల నియామకం లేకపోవటం విద్యార్థులకు సరిఅయన బోధన లేకపోవటం వల్ల విద్యార్థుల సంఖ్య పూర్తిగా పడిపోయింది. నేడు పాఠశాలలో ఒక్క విద్యార్థికూడా లేకపోవటం జరిగింది. నాడు గ్రామస్థులకు మాట ఇచ్చారు ఏఈఎల్‌సి వారు విద్యార్థులు లేకపోతే పాఠశాల నిర్వహణ బాధ్యత మరలా మీకే ఇస్తామని, దానికి కట్టుబడి ఉండాలని, అంతేకాకుండా దీనిని అన్యాక్రాంతం కాకుండా, అసాంఘీక శక్తుల చేతులలోకి పోకుండా ఉండాలని, దానికి కావల్సిన పూర్వవైభవం తీసుకు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని, కావున ఏఈఎల్‌సీ ప్రతినిధులు ముందుకు వచ్చి త్వరిత గతిన సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలో ఇద్దరు కార్యాలయ సిబ్బంది, నలుగురు ఉపాధ్యాయులు ఏఇడేడ్ వారు మాత్రం మే ఉన్నారు. అయితే విద్యార్థులు అసలు లేకపోవటంతో మరి వీరి పరిస్థితి ఏమిటని వారు అంతర్మదనం పడుతున్నారు. వీరికి ఎక్కడైనా పని బదలాయింపు జరిపితే బాగుంటుందని వారు అనుకుంటున్నారు. కార్యక్రమంలో ముత్తవరపు రామరావు, పోపూరి వెంకటరత్తయ్య, చల్లా యఘ్నేశ్వరరెడ్డి, పి సునీల్ రామస్వామిరెడ్డి, చాగంటి చెంచారెడ్డి, నంబూరి శివరామకృష్ణ, జరుగుల అంజేశ్వరరావు, పోపూరి రాఘవయ్య, దాతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రజల ఆంక్షాల నుంచి అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు

**గుంటూరు క్రైమ్,జూన్ 30,ప్రభాతవార్త :** రాష్ట్ర ఖజానా దివాళా తీసివున్న పరిస్థితుల్లో అధికారం చేపట్టిన చంద్రబాబు తన అనుభవం, ప్రతిష్ట,కఠోర కష్టంతో తొలి ఏడాదిలోనే 700లకు పైగా అభివృద్ధి,సంక్షేమ పథకాలు అమలు చేశారని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. సోమవారం అర్బన్ టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లా డుతూ ప్రజల ఆంక్షల నుంచి



అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. తొలి ఏడాదిలోనే మా మ్యానిఫెస్టో లో ఇచ్చిన హామీల్లో 70శాతం అమలుచేసి చూపించా మన్నారు.మా కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని,చెడుగా చూపించ డమే పనిగా వైసీపీ పెట్టుకుందని మండిపడ్డారు. మేము అమలు చేస్తున్న పథకాలు,కార్యక్రమాలపై ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజలు మిమ్మల్ని నమ్మే పరిస్థితుల్లో లేరని ఎద్దేవ చేశారు.ఎన్డీఏ పథకాలతో పేద ప్రజలు జీవితాలు మారుతున్నాయని గ్రహించి వాటిపై దుష్ప్రచారం చేయడమే అజెండాగా వైసీపీ పనిచేస్తుందన్నారు. గంజాయి,బెట్టింగ్,రౌడీషీటర్లకు అండ కాస్తూ రాజకీయ ముసుగులో నేరాలను ప్రేరేపిస్తుందన్నారు.అధికారం చేపట్టిన 100రోజుల్లోనే పెన్షన్ పై మాట మార్చడం,పోలవరం రివర్స్ టెండ రింగ్, పరిశ్రమలను తరిమేయడం, అమరావతిని నిలిపి వేయడం,విద్యుత్ ఒప్పందాలు రద్దు,అన్న క్యాంటిన్లు మూసివేత,ప్రజావేదిక కూల్చివేత వంటి కుట్రపూరిత నిర్ణయాలతో ఏపి భవిష్యత్ ను ప్రశ్నార్థకం చేశావు.ఉచిత ఇసుకను దూరం చేసి భవన నిర్మాణ కార్మికులను రోడ్డున పడేశారన్నా రు.ఇలా 100రోజుల్లోనే అభివృద్ధి అనే మాట పక్కనబెట్టి కక్ష్యా రాజకీయాలను నడిపించింది నువ్వు కదా జగన్‌రెడ్డి అని ప్రశ్నించారు.ప్రతి రంగంలో విధ్వంసం చేసి,ఆంధ్రప్రదేశ్ ను తిరోగమనంలోకి నెట్టావు. పాలన అనేది ప్రజల సంక్షేమం,అభివృద్ధి కోసం ఉండాలి కానీ విద్వంసం,ప్రతీకారానికి మారు పేరుగా జగన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయాడన్నారు.

## రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులను అన్ని విధాల ఆదుకోవాలి

### నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్



**మంగళగిరి, జూన్ 30, ప్రభాతవార్త:** రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన రైతులను అన్ని విధా ఆదుకోవాలని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ భూములు ఇచ్చిన రైతులకు ప్లాట్లు తోపాటు వసతులు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి పేరును పార్లమెంటులో చర్చించి గెజిట్ నోటిఫికేషన్ ప్రకటించి రాష్ట్రపతి చేత ఆమోదించేయాలని జలీల్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. 2027లో జెమిలీ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సుమాలోచన చేస్తుందన్నారు. ఇదే సమయంలో కూటమి ప్రభుత్వం అమరావతి రాజధాని నిర్మాణానికి కావలసిన నిధులను కేంద్ర ప్రభుత్వం నుండి రాబట్టి వేగంగా అభివృద్ధి చేయాలని జలీల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్య వైద్యం పై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జలీల్ విజ్ఞప్తి చేశారు.

## పాఠశాల విద్యార్థులకు నూతన బస్సు సర్వీసు ఏర్పాటు

**యడ్లపాడు, జూన్ 30, ప్రభాతవార్త :** మండల పరిధిలోని లింగారావుపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపం గ్రామం ఉప్పరపాలెం నుండి సుమారు 80మంది విద్యార్థుల జేరటంతో వారికి ప్రయాణ ఇబ్బందులను గుర్తించిన గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయులు సమిష్టిగా చిలకలూరిపేట అర్‌టీసీని సంప్రదించి విద్యార్థులకు నిత్యం వారిని తీసుకు రావటం మరలా వారి గమ్యస్థానం చేర్చటం వంటివి చేయాలని కోరటంతో వారి స్పందించి



వెంటనే నూతన సర్వీసును ఏర్పాటుచేయటం జరిగింది. సోమవారం లింగారావుపాలెం గ్రామం నుండి నూతన బస్సు సర్వీసును గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్‌టీసి అధికారులకు అభినందనలు తెలియజేసారు.

## ఉద్యోగులకు సన్మానం

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూన్30, ప్రభాతవార్త:** విశ్వవిద్యాలయంలో ఆయా విభాగాల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేస్తున్న నలుగురు ఉద్యోగులను సోమవారం తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం సన్మానించారు. సీనియర్ అసిస్టెంట్‌లు సి.హెచ్.కొండయ్య, ఎన్.కోటేశ్వరరావు, అటెండర్ ఎ.కోటేశ్వరరావు, స్వీపర్ టి.సూరిబాబులు సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. వారిని సన్మానించేందుకు



వికాస కార్యవర్గం ప్రత్యేక కార్యక్రమంను చేపట్టింది. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సేవలను అధికారులు, సహచర ఉద్యోగులు కొనియాడారు. వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఇ శివప్రసాదరావు, ఏసిఇ వెంకటేశ్వర్లు, నోడల్ ఆఫీసర్ రెడ్డి ప్రకాశరావు, వికాస అధ్యక్షుడు ఎన్.ప్రసాద్, ఉపాధ్యక్షుడు డి.విజయ్ ప్రకాష్, కార్యదర్శి జె.శ్రీనివాసరావు, కోశాధికారి కె.యేషయ్య, కార్యవర్గ సభ్యులు పి.నాగరాజు, శ్రీను, ఆనంద్, పూర్వ వికాస కార్యదర్శి కావూరి శ్రీనివాసరావు, మేకా ప్రకాష్, వై.రాధాకృష్ణ, బషీర్, కనకరాజు, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు..

## పొగాకు వాడకం,దుష్పరిణామాలపై వ్యాసరచన పోటీలు

**రెంటచింతల, జూన్ 30 ప్రభాతవార్త:** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పరంపరలో భాగంగా పొగాకు, నికోటిన్ ఉత్పత్తుల తయారీ



పరిశ్రమలు గురించి, వాటి వాడకం.. దుష్పరిణామాలపై అవగాహన కగిలించే అంశంపై రెంటచింతల పీహెచ్‌సీ పరిధిలోని పాలువాయి జడ్పీ హైస్కూల్, రెంటచింతల సెయింట్ జోసెఫ్స్ హైస్కూల్, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ బహుమతిని వైద్యాధికారి నర్రా కృష్ణారెడ్డి, ద్వితీయ, తృతీయ బహుమతులను ఎంపీడీఓ సరోజినీదేవి, వైద్యాధికారి ప్రదీప్‌కుమార్‌రెడ్డి అంజేయడంతోపాటు సర్టిఫికెట్లు బహూకరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ పొగాకు వాడే అలవాటును ప్రారంభించవద్దని విద్యార్థులకు సూచించారు. సమాజానికి గరిష్ట న ష్టం కలిగించే ఉత్పత్తి పొగాకు అని పేర్కొన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ విద్యార్థి పొగాకుకు దూరంగా ఉండి క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. వైద్యాధికారి ప్రదీప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తి కంపెనీలు యువతను ఆకర్షించేందుకు చేస్తున్న మార్కెటింగ్ వ్యూహాలకు లోనుకాకుండా పొగాకు రహిత ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కత్తి రవి, దుర్గాప్రసాద్‌లతో పాటు రాంబాబు, కిరణ్, మంగయ్య తదితర పాఠశాలల ఉపాధ్యాయ బృందం పాల్గొంది.

## రహదారి పునరుద్ధరణ చర్యలు,పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించండి

**యడ్లపాడు, జూన్ 30, ప్రభాతవార్త :** మండల పరిధిలోని బోయపాలెం గ్రామంలో తీవ్రమైన పారిశుద్ధ్య, అరోగ్య సమస్యలుపై విచారణ మరియు రహదారి పునరుద్ధరణ కొరకు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ విజయశ్రీకి వినతి పత్రం అందజేసినట్లు గ్రామ జనసేన గ్రామ పార్టీ అధ్యక్షుడు ఈగలపాటి గోపి తెలిపారు. ఈ సందర్భంగా వారు వివరిస్తూ వంకాయలపాడు గ్రామ పంచాయితీ పరిధిలోని బోయపాలెం గ్రామానికి చెందిన ప్రజలు ఇటీవల గ్రామంలో తీవ్రమైన పారిశుద్ధ్య మరియు అరోగ్య సమస్యలు నెలకొన్నాయి. గ్రామ సమీపంలో ఉన్న సుప్రియ, వసుంధర, విశ్వతేజ, రంగనాయక స్పిన్నింగ్ మిల్లులవల్ల అధిక వాయు కాలుష్యం, శబ్దకాలుష్యం మరియు నీటి కాలుష్యం ఏర్పడుతున్నాయని, వీటి నుండి వెలుబడుతున్న రసాయనాలు వల్ల నీటి కాలుష్యం ఏర్పడుతుందని, సైడ్ డ్రైన్‌ల నిర్వహణలోపం వల్ల దోమల వ్యాప్తి అధికంగా ఉంటుందని, సమీపంలో ఉన్న సక్కు మిల్లు వ్యర్థాలు నేరుగా చెరువులో కలుస్తున్నాయని, మిల్లుల సమీపంలో ఉన్న డొంకకు గోడలు కట్టడం వల్ల రహదారి పూర్తిగా మూసివేయబడిందని, రాకపోకలకు అంతరాయం కలుగుతుందని, కావున అడ్డగోడలను తొలగించి రహదారి పునరుద్ధరణ చర్యలు తీసుకోవాలని కోరటమైందన్నారు.

## జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి మృతి

**యడ్లపాడు, జూన్ 30, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామ సమీపంలోని నూతన బైపాస్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసు కుంది. సంఘటనకు సంబంధించి ఎస్సై టి శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం బైపాస్ ప్రాంతములో వ్యక్తి మృతి చెందిన వార్త హైవే పెట్రోల్ వారి ద్వారా సమాచారం అందటంతో సంఘటన ప్రాంతాన్ని పరిశీలించామని, అయితే మాసిన బట్టలు, సరిఅయిన, అహారం, నీరు లేక పోవటంతో మృతి చెంది ఉంటాడని, ఈ ప్రాంతములోనే యాచక



వృత్తి నిర్వహించుతూ ఉంటాడని తెల్సిందని తెలిపారు. ఇతనికి సుమారు 50సంవత్సరాల మధ్య వయస్సులో ఉంటాడని, ఈ ప్రాంతములోనే సంచరించుతూ ఉంటాడని తెల్సిందన్నారు. మృతి పై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించుతున్నామని, పంచనామ నిర్వహించి చిలకలూరిపేట మున్సిపాలిటీకి దహన సంస్కరణ నిమిత్తం అప్పగించటం జరిగిందన్నారు.

## గంజాయి కేసులో నిందితుడు అరెస్టు

**చిలకలూరిపేట,జూన్30,ప్రభాతవార్త:** గంజాయి కేసులో మూడవ నిందితుడిగా ఉన్న కారసాని శివప్రసాద్‌రెడ్డి అలియాస్ ప్రసాదరెడ్డిని చిలకలూరిపేట రూరల్ సిఐ బి సుబ్బనాయుడు సోమవారం అరెస్ట్ చేశారు. మండలంలోని బొప్పూడి జంక్షన్ వద్ద పక్కా సమాచారంతో నిఘా వేసిన రూరల్ పోలీసులు బెంగుళూరు నుంచి వస్తున్న శివప్రసాద్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు.



ప్రసాద్‌రెడ్డి గుంటూరు పట్టణంలోని కొరిటెపాడు, రెడ్లబజారు ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. అదుపులోకి తీసుకున్న అనంతరం రూరల్ సిఐ సుబ్బనాయుడు అతనిని పూర్తిస్థాయిలో విచారించారు. అనంతరం శివప్రసాద్ రెడ్డిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు. ఈ సందర్భంగా సిఐ బి సుబ్బనాయుడు మాట్లాడుతూ ఈ కేసు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని విలేకరులకు వివరించారు.

## విజ్ఞతతో వేస్తారనే రాజ్యాంగం మనకు ఓటు హక్కు కల్పించింది : తహశీల్దార్

**చిలకలూరిపేట,జూన్30,ప్రభాతవార్త:** విజ్ఞతతో వేస్తారనే రాజ్యాంగం మనకు ఓటు హక్కు కల్పించిందని, భారతదేశం సుసంపన్నం కావాలంటే డబ్బులు తీసుకోకుండా ప్రజలు ఓట్లు వేయాలని చిలకలూరిపేట తహసిల్దార్ మహ్మద్ హుస్సేన్ విద్యార్థులకు పిలుపునిచ్చారు.




పట్టణంలోని మోడరన్ డిగ్రి కళాశాలలో సోమవారం జరిగిన నా ఓటు-నాహక్కు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఓటు హక్కు సరిగా వినియోగించుకోని పొరుగుదేశాల దుస్థితి గురించి వివరించారు. ఉద్యోగ అవకాశాలు రావాలంటే డబ్బులు తీసుకోకుండా ఓటు వేయాలని, అప్పుడు గెలిచిన ప్రతినిధులు కూడా నిస్వార్ధంగా అభివృద్ధికి పాటుపడే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి నవతరం పార్టీ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు అమ్మడం వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీనపడు తుందని అన్నారు. ఓటు అమ్మితే నిజమైన ప్రజాప్రతినిధులు ఎన్నిక అవ్వకుండా డబ్బులు ఖర్చుచేసేవారు గెలుస్తారని, అవినీతి పెరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో మోడరన్ విద్యాసంస్థల చైర్మన్ చేబ్రోలు మహేష్, కె బ్రహ్మయ్య, కె వెంకటేశ్వరరావు, సిహెచ్ శ్రీరాములు, గోవిందు విష్ణు, షేక్ షమ్మీ, విద్యార్ధిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## భవిత స్కూల్ ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఐఈ కోఆర్డినేటర్ ఏం జోష్నా

**కర్లపాలెం,జూన్30,ప్రభాతవార్త:** కర్లపాలెం మండలంలో ఇందిరానగర్ లో గల భవిత స్కూల్ ని ఐఈ కోఆర్డినేటర్ ఏం జోష్నా, మండల విద్యాశాఖ అధికారి 2 విజయశ్రీ ఆకస్మిక తనిఖీ చేయడం జరిగింది. రికార్డులను తనిఖీ చేశారు. ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల ప్రతిభను పరిశీలించారు వారికి బోధించే విధానాన్ని వారిలో వచ్చిన మార్పులను వారు భవిత సెంటర్ కి వచ్చినప్పుడు ఎలా ఉన్నారు? ఇప్పుడు ఎలా



ఉన్నారు మొత్తం అడిగి తెలుసుకున్నారు దీనిలో ఐఇఆర్పి లు అయినా నరాల శెట్టి లక్ష్మీ సన్న ప్రసన్న, చెన్ను బోయిన చందన, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ మరియు భవాని, ప్రసాద్ పాల్గొన్నారు

## రైతు సంఘాల ఆందోళను జయప్రదం చేయండి

**పెదనందిపాడు జూన్ 30 (ప్రభాతవార్త):** పెదనందిపాడు, కాకుమాను మండలాలలో వెంటనే పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు కోరారు. మంగళవారం ఉదయం 10 గంటలకు పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టి, అనంతరం పెదనందిపాడు తహసిల్దార్



కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు నల్లమోతు రాజేంద్ర, పసుపులేటి శేషగిరిరావు తో కలిసి సోమవారం పలు గ్రామాలలో రైతులతో సమావేశాలు నిర్వహించారు. మండలంలోని పాలపర్రు, రాజుపాలెం, పరిటాల వారి పాలెం, అన్నారం, నాగులపాడు, కాకుమాను మండలంలో ని గార్లపాడు, పెద్దివారిపాలెం, కాకుమాను, కొమ్మూరు గ్రామాల్లో పొగాకు రైతులను కలిసి మంగళవారం పెదనందిపాడు లో చేపట్టే నిరసన కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## ఒయాసిస్ ఆధ్వర్యంలో ఉచిత ఎనిమియా, న్యూట్రిషియన్ వైద్యశిబిరం

**చిలకలూరిపేట,జూన్30,ప్రభాతవార్త:** ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని కెజె ఆసుపత్రి ఆవరణలో సోమవారం ఉచిత ఎనిమియా, న్యూట్రిషియన్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో షుమారు 100 మందికి రక్త పరీక్షలు



నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఒయాసిస్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ మాట్లాడుతూ రక్తహీనత (ఎనీమియా) వలన కలుగు లక్షణాలు, నష్టాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆహారం గురించి వివరించారు. జంక్ ఫుడ్ వలన కలిగే నష్టాలగురించి కూడా ఆమె శిబిరంలో పాల్గొన్న వారికి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఒయాసిస్ డైరక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

## గాయకుడు కొండల స్వామికి ఘన సన్మానం

**కర్లపాలెం,జూన్30,ప్రభాతవార్త:** కర్లపాలెం మండలంలోని యాజలి గ్రామంలో యాజలి రైతుల



ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ లో రఘుకుల తిలక పాట పాడిన కొండల స్వామిని డైరెక్టర్ ఇకుర్తి లక్ష్మీ నరసింహ రాజేశ్వరి దంపతులు మెమొంటోను అందజేసి దుస్సాలతో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఏ ఆటోలో ఎనోస్మెంట్ చూసిన ఆయన గొంతు వినపడుతుందని అదేవిధంగా ఆయన పాడిన పాట రఘుకుల తిలక ఎంతో అభిమానుల హృదయాలలో నిలిచిపోయిందన్నారు. కొండల స్వామిని సన్మానించడం పూర్వజన్మ సుకృతం అన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ లెమక్, యూరియా ముఠా వర్కర్స్ యూనియన్ కర్లపాలెం ప్రెసిడెంట్ సింహాద్రి శివయ్య, కాటూరి నాగరాజు , రోశయ్య, కాటూరి బాలకృష్ణ, సోములు సింహాద్రి ఎంకన్న, శివయ్య, వెంకటపతి రాజు, భాస్కర్ రాజు, శ్రీనివాసరావు, మల్లారెడ్డి, తిరుపతిరావు రాజేష్ పాల్గొన్నారు..

## చిలకలూరిపేట రోటరిక్లబ్ గత సంవత్సరంలో చేసిన ఉత్తమ సేవలకు 15 అవార్డులు

**చిలకలూరిపేట,జూన్30,ప్రభాతవార్త:** చిలకలూరిపేట రోటరిక్లబ్ 2024-25 సంవత్సరంలో చిలకలూరిపేట ప్రాంతంలో చేసిన పలు సామాజిక




కార్యక్రమాలను గుర్తించిన రోటరి 3150 జిల్లా గవర్నర్ పలు విభాగాలలో చిలకలూరిపేట రోటరిక్లబ్‌కు హైదరాబాద్‌లో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో 15 అవార్డులను ప్రకటించారు. ఈ అవార్డులను చిలకలూరిపేట రోటరిక్లబ్ కార్యదర్శి ఉప్పుటూరి ప్రసాద్, క్లబ్ డైరక్టర్లు అందుకున్నారు. ముఖ్యంగా క్లబ్ ఆధ్వర్యంలో రోటరి కమ్యూనిటీ హాల్‌లో సంవత్సరకాలంగా పేదలకు ఉచిత వైద్య శిబిరం ద్వారా సేవలు అందించడంతో పాటు ఉచితంగా మందుల పంపిణీ, స్వచ్ఛమైె త్రాగునీరు పంపిణీలకు ప్రత్యేక గుర్తింపు లభించింది. అదేవిధంగా ఉచితంగా తోపుడుబండ్లు పంపిణీ, పేద విద్యార్థినిలకు సైకిళ్లు పంపిణీ, పేద మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ, వికలాంగులకు వీల్‌చైర్లు అందించినందుకు రోటరి గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. రోటరిక్లబ్‌కు వ్యక్తిగత హోదాలో సేవలు అందించినందుకు గాను ముత్తినేని వెంకటేశ్వర్లు, డాక్టర్ కందిమళ్ల సాంబశివరావుకు ప్రత్యేక అవార్డులు దక్కాయి. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట రోటరిక్లబ్ డైరక్టర్లు పిడిజి అన్నె రత్నప్రభాకర్, గల్లా సాంబశివరావు, ముత్తినేని వెంకటేశ్వర్లు, చిలుకూరి శ్రీనివాసరావులు పాల్గొని అవార్డులు అందుకున్నారు. క్లబ్ గత సంవత్సరం ఈ అవార్డులు అందుకోవడం పట్ల అధ్యక్షుడు ఆళ్ల వేమనరెడ్డి, కార్యదర్శి ఉప్పుటూరి ప్రసాద్‌లకు క్లబ్ సభ్యులు అభినందించారు.

## కర్లపాలెం నూతన తహశీల్దార్‌గా షాకీర్ పాషా

**కర్లపాలెం,జూన్30,ప్రభాతవార్త:** కర్లపాలెం తహసీల్దార్ గా షాకీర్ పాషా సోమవారం సాయంత్రము బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పనిచేస్తున్న తహసిల్దార్ సుందరమ్మ పదవి విరమణ చేయగా నిజాంపట్నం నుంచి బదిలీపై షాకీర్ భాష కర్లపాలెం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ పరంగా ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరినారు. ఈ సందర్భంగా పలువురి నాయకులు నూతన తహసీల్దార్ కి శుభాకాంక్షలు తెలియజేశారు.



## ఉర్సా క్లస్టర్ చీఫ్ రెవెన్యూ ఆఫీసర్‌గా ఎరిక్ వార్నర్

**విజయవాడ, జూన్ 24, ప్రభాతవార్త :** భారతదేశంలో మొదటి ఏఐ మౌలిక సదుపాయాల ప్లాట్‌ఫాం డెవలపర్ ఉర్సాక్లస్టర్స్ తమ తదుపరి వృద్ధికోసం ప్రసిద్ధి చెందిన సాంకేతిక నాయకుల నియమకాలను వెల్లడించినట్లు సంస్థ ప్రతినిథులు తెలిపారు. చీఫ్ రెవెన్యూ ఆఫీసర్‌గా ఎరిక్ వార్నర్ ను నియమించామని ఆయన హైపర్‌స్కిల్ క్లౌడ్ ప్రొవైడర్లు, ఏఐ ఫస్ట్ ఎంటర్‌ప్రైజెస్‌లతో కంపెనీ వాణిజ్య భాగస్వామ్యాలకు నాయకత్వం వహిస్తారన్నారు.

## విజయవాడలో మిచెలిన్‌టైర్లు అండ్ సర్వీసెస్ ప్రారంభం

**విజయవాడ, జూన్ 24, ప్రభాతవార్త :** ప్రపంచవ్యాప్తంగా పేరొందిన టైర్‌టెక్నాలజీ దిగ్గజం మిచెలిన్ విజయవాడలో సంఘ్వీ కార్ షాప్సీతో భాగస్వామ్యంతో మొదటి మిచెలిన్ టైర్స్ అండ్ సర్వీసెస్ స్టోర్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా మిచెలిన్ ఇండియా నేషనల్ సేల్స్ మేనేజర్ ప్రశాంత్ శర్మ, ఎండి శంతను పాండే, సంఘ్వీకార్ షాప్సే బృందం మాట్లాడుతూ అత్యాధునిక మౌలిక సదుపాయాలు, డయాగ్నస్టిక్‌టూల్స్‌తో ఖచ్చితమైన టైర్ అమరిక, రోడ్‌ఫోర్స్ వీల్ బ్యాలెన్సింగ్, ఆధునిక అలైన్డ్ సిస్టంలతో సమగ్ర శ్రేణి సేవలందించడానికి ఏపిలోని కీలక వాణిజ్యహబ్ విజయవాడలో ఈ షోరూం ప్రారంభించామన్నారు. విజయవాడ, కొచ్చి, బెంగుళూరుల్లో 15కు పైగా టచ్‌పాయింట్లున్నాయన్నారు.

## శాంసంగ్ గెలాక్సీ ఫోల్డబుల్స్ బుకింగ్స్ ప్రారంభం

**విజయవాడ, జూన్ 24, ప్రభాతవార్త :** భావితరపు ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్లను ముందస్తుగా రిజర్వ్ చేసుకోడానికి టోకెన్ బుకింగ్స్ ప్రారంభించినట్లు సామ్‌సంగ్ ప్రతినిథులు తెలిపారు. కొత్తఏఐ శక్తితో అద్భుతమైన హార్ట్‌వేర్ మద్దతుతో రూపొందించిన ఈ ఫోన్లను జూలై 9 న న్యూయార్క్‌లో విడుదల చేస్తామన్నారు.

## వృద్ధాప్యంలో జనరల్ హెల్త్ చెక్‌ఆప్‌లు అవసరం

**గుంటూరు కల్చరల్,జూన్ 30,ప్రభాతవార్త :** వృద్ధాప్యం వచ్చిన తర్వాత శారీరకంగా,మానసికంగా వివిధ మార్పులు కలుగుతాయని,ప్రతి మార్పుకి దిగులు,ఆందోళన చెందకుండా డాక్టర్ల సలహాతో రెగ్యులర్ హెల్త్ చెకఆప్ లు చేయించుకుంటూ అప్రమత్తంగా ఉండాలని అవగాహన సంస్థలో జరిగిన ఆరోగ్యసభలో సీనియర్ జనరల్ ఫిజిషియన్ డాక్టర్ రావెళ్ళ శ్రీగీత అన్నారు.సంస్థ కార్యాలయంలో జరిగిన ఆరోగ్యసభకు సంస్థ సీనియర్ సభ్యులు కె.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు.డాక్టర్ శ్రీగీత తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ 60నుంచి 70దాటిన వాళ్ళల్లో దగ్గు,నడుంనొప్పి,కాళ్ళ నొప్పులు ఎక్కువసార్లు మూత్ర విసర్జన,అలసట సాధారణ లక్షణాలని అందుకు హెల్త్ చెక్‌ఆప్‌లు అవసరమన్నారు.వృద్ధాప్యంలో వ్యాయమం పరమ ఔషధమన్నారు.నడక,సైక్లింగ్,యోగా,గార్డెనింగ్ తదితరాలు వీలుని బట్టి చేయాలన్నారు.సభకు హాజరైన వారు అడిగిన సందేహాలను డాక్టర్ శ్రీగీత నివృత్తి చేశారు.అనంతరం సంస్థ సభ్యులు డాక్టర్ శ్రీగీతను ఘనంగా సత్కరించారు.సభలో డాక్టర్ రవీంద్రకుమార్,డాక్టర్ ఆర్.రామచంద్రరావు,ఎ.వి.రామారావు తదితరులు ప్రసంగించారు.సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి సభను సమన్వయం చేశారు.

## పండరీపురం రోటరిక్లబ్ ఉత్తమ సేవలకు 18 అవార్డులను అందుకున్న క్లబ్ అధ్యక్షులు వారణాసి శరత్, డైరెక్టర్లు

**చిలకలూరిపేట, జూన్30,(ప్రభాతవార్త):** పండరీపురం రోటరిక్లబ్ 2024-25 సంవత్సరంలో పేద ప్రజలకు, అనాథలకు, విద్యార్థులకు, మహిళలకు, వికలాంగులకు అందించిన ఉత్తమ సేవలకుగాను 18 అవార్డులు లభించాయి. ఈ అవార్డులను మెడికల్ క్యాంపులు, రాజాపేటనందు పేద విద్యార్థులకు పాఠశాలలో ఆర్వోప్లాంట్, నిరుపేద మహిళలకు కుట్టుమిషన్లు, చిరువ్యాపారులకు తోపుడుబండ్లు, విద్యార్థినిలకు సైకిళ్లు అందించినందుకు ప్రత్యేకంగా గవర్నర్ అభినందించి అవార్డులు



హైదరాబాద్లో జరిగిన అవార్డుల ఉత్సవంలో రోటరి గవర్నర్ చేతుల మీదుగా క్లబ్ అధ్యక్షుడు వారణాసి శరత్, డైరక్టర్లు అందుకున్నారు. ఉత్తమ సేవలకుగాను రెండు గోల్డ్మెడల్స్, మూడు సిల్వర్ మెడల్స్, మంచి ప్రాజెక్ట్లు నిర్వహించినందుకు గాను మూడు స్పెషల్ అవార్డ్స్, పలు కార్యక్ర మాలు చేసినందుకు 10 ప్రోత్సాహక అవార్డులను గవర్నర్ చేతులమీదుగా అందుకున్నారు. రోటరి ఆదేశించిన అన్ని కార్యక్రమాలతో పాటు మెగా అందచేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్నుంచి వ్యక్తిగతంగా సేవలు అందించినందుకు క్లబ్ డైరక్టర్లు లంకా రఘురామిరెడ్డి, కొల్లా సింగారావు, సంకటి దినేష్ రెడ్డిలకు ప్రత్యేక అవార్డులు లభించాయి. ఈ కార్యక్రమంలో క్లబ్ డైరక్టర్లు అలంగార్ మోహన్, కొల్లా సింగారావు, లంకా రఘురామిరెడ్డి, తులసీ వసంతరావు,పోలిశెట్టి రాఘవయ్య, కొల్లా శ్రీనివాసరావు, పాల్గొని అవార్డులు అందుకున్నారు.

## పదవి విరమణ పొందిన పారిశుద్ధ్య కార్మికులను సత్కరించిన మునిసిపల్ కమిషనర్ శ్రీహరిబాబు

**చిలకలూరిపేట, జూన్30,ప్రభాతవార్త:** పురపాలకసంఘం పరిధిలోని 1వ డివిజన్లో పారిశుద్య కార్మికులుగా పనిచేస్తూ సోమవారం పదవీ విరమణ చేసిన ఎ నరసమ్మ, ఎ వరలక్ష్మీలను మున్సిపల్ కమీషనర్ పి శ్రీహరిబాబు, పారిశుద్య అధికారి రమణరావులు సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కమీషనర్ పదవీ విరమణ



చేసిన వారిద్దరికి పిఎఫ్ చెక్కులను అందచేశారు. ఈ కార్యక్రమంలో రెండవ డివిజన్ పారిశుద్య అధికారి సునీత, పారిశుద్య మేస్త్రీలు, కార్యదర్శులు, సిబ్బంది, ఏఐటియుసి, సిపిఐ నాయకులు తాళ్లూరి బాబూరావు, చెరుకుపల్లి నిర్మల, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

## రోటరి 2025-26 సంవత్సర అసిస్టెంట్ గవర్నర్గా పోలిశెట్టి రాఘవయ్య నియామకం

**చిలకలూరిపేటటౌన్,జూన్30,ప్రభాతవార్త:** రోటరి3150 జిల్లా అసిస్టెంట్ గవర్నర్గా పండరీపురం రోటరిక్లబ్ మాజీ అధ్యక్షుడు అయిన పోలిశెట్టి రాఘవయ్యను రోటరి3150 జిల్లా డాక్టర్ ఎస్వి రాంప్రసాద్ నియమించారు. హైదరాబాద్లో జరిగిన కార్యక్రమంలో రాఘవయ్యకు ఈ నియామకపత్రాన్ని గవర్నర్ అందచేశారు. రోటరి 2025-26 ప్రారంభం జులై 1వ తేదినుంచి, ముగింపు 2026 జూన్ 30వ తేదివరకు రాఘవయ్య ఈ పదవిలో సంవత్సరం పాటు కొనసాగుతారు. రాఘవయ్య చిలకలూరిపేట రోటరిక్లబ్, బాపట్ల రోటరిక్లబ్, పండరీపురం రోటరిక్లబ్, పెదనందిపాడు రోటరిక్లబ్,



నరసరావుపేట రోటరిక్లబ్లకు అసిస్టెంట్ గవర్నర్గా సేవలు అందించనున్నారు. రాఘవయ్య ఈ పదవిలో నియమితులైనందుకు క్లబ్ డైరక్టర్లు వారణాసి శరత్కుమార్, కొల్లా సింగారావు, కెఎస్ఆర్ఎపి రాజు, అలంగార్ మోహన్, బోనం వెంకటేశ్వరరావు, లంకా రఘురామిరెడ్డి, లంకా ఆదినారాయణ రెడ్డి, క్లబ్ సభ్యులు అభినందనలు తెలియచేశారు.

## నాదెండ్ల మండల విస్తరాణాధికారి యం నిర్మల లక్ష్మీకుమారి పదవీ విరమణ

**నాదెండ్ల,జూన్30,ప్రభాతవార్త:** మండలంలో విస్తరాణిధికారిగా పనిచేస్తున్న మాదిరాజు నిర్మల లక్ష్మీకుమారి డిప్యూటి యంపిడిఒ హోదాలో సోమవారం పదవీ విరమణ చేశారు. 1989 జులై 1వతేది విడిఒ గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన నిర్మల లక్ష్మీకుమారి అనేక హోదాల లో పనిచేశారు. ఉద్యోగ నిర్వహణలో ఆమె ఏనాడు రాజీపడలేదు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పనిచేయడం, పనిచేయించుకోవడం మాత్రమే



అమెకు తెలుసు. పైకి సాధారణ వ్యక్తిలా కనిపించే లక్ష్మీకుమారి విధినిర్వహణలో మాత్రం అలుపెరగని కృషిచేసింది. ఉద్యోగాన్ని బాధ్యతగా భావిస్తుంది. అవినీతి ఆరోపణలు ఈమెకు దూరంగా ఉంటాయి. అందరికి కలుపుకుపోయే మనస్తత్వం కలిగిన నిర్మల లక్ష్మీకుమారి 2016 కృష్ణ పుష్కరాలలో ఉత్తమ సేవాపత్రం అందుకున్నారు. అదేవిధంగా 2024లో పల్నాడు జిల్లా ఉత్తమ విస్తరాణాధికారిగా అవార్డు పొందారు. సోమవారం పదవీ విరమణ చేసిన లక్ష్మీకుమారికి మండలంలో పనిచేస్తున్న అధికారులు సిబ్బంది వీడ్కోలు పలికారు.

## తండ్రిని హత్యచేసిన కేసులో నిందితుడు అరెస్టు

**చిలకలూరిపేట, జూన్30, ప్రభాతవార్త:** మండలం లోని మురికిపూడి గ్రామానికి చెందిన చెంబేటి శ్రీనివాసరావును అతని కుమారుడు చెంబేటి రామకృష్ణ మే నెల 7వ తేదిన మురికిపూడి గ్రామంలో చెక్కతో కాళ్లపై



విచక్షణా రహితంగా కొట్టగా అతను మరణించాడు. దీనికి సంబందించిన వివరాలను రూరల్ సిఐ బి సుబ్బనాయుడు సోమవారం విలేకరులకు తెలిపారు. మురికిపూడి గ్రామానికి చెందిన చెంబేటి శ్రీనివాసరావుకు రామకృష్ణ, శివ,అఖిల్ అను ముగ్గురు కొడుకులు ఉన్నారు. చెంబేటి శ్రీనివాసరావు తెలంగాణా రాష్ట్రంలోని సిద్దిపేటలో బేల్దారి పనులు చేసుకుంటూ అక్కడే నివాసం ఉంటున్నాడు. నాలుగు నెలలకు ఒకసారి మురికిపూడి గ్రామం వచ్చి కుటుంబసభ్యులను చూసుకొని వెళు తుంటాడు. అతనికి మద్యం తాగే అలవాటు ఉంది. అంతేకాకుండా సొరియాసిస్ వ్యాధిలో అనారోగ్యంతో బాదపడుతూ ఉన్నాడు. తన పెద్దకొడుకైన రామకృష్ణకు రెండు సంవత్సరాల క్రితం వివాహం కాగా వారికి పాప పుట్టింది. రామకృష్ణ అత్తగారి ఊరైన రెడ్డిపాలెంలో ఉన్న తన కూతురుని చూడటానికి రమ్మనమని మురికిపూడి గ్రామం వచ్చిన తన తండ్రి శ్రీనివాసరావును కోరాడు. దానికి అతను రానని చెప్పడంతో మద్యం మత్తులో ఉన్న తన తండ్రిని విచక్షణా రహితంగా చెక్కబద్దతో కాళ్లపై రామకృష్ణ కొట్టాడు. ఆ సమయంలో రామకృష్ణ తల్లి లక్ష్మీ, అక్క సుబ్బాయమ్మ, తమ్ముడు వీరాంజనేయులు అడ్డుతగిలి కొట్టవద్దని కోరినా వారిని నెట్టివేసి తిరిగి తండ్రి కాళ్లపై కొట్టడంతో శ్రీనివాసరావు మృతిచెందాడు. దీనిపై వారు రూరల్ పోలీస్స్టేషన్లో అప్పుడు పిర్యాదు చేశారు. ఈ కేసులో ముద్దాయి అయిన రామకృష్ణను సోమవారం మురికిపూడి గ్రామ సెంటర్లో రూరల్ సిఐ బి సుబ్బనాయుడు తన సిబ్బందితో కలసి అరెస్ట్చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్కు అదేశించారు.

## తాడేపల్లిలో సిపిఐ మహాసభ

**తాడేపల్లి,జూన్ 30,ప్రభాతవార్త :** స్థానిక సిపిఐ కార్యాలయంలో సెంట్రల్ శాఖ మహాసభ జరిగింది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పదునైన పోరాటాలు చేయాలని సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కాశయ్య పిలుపునిచ్చారు. రైల్వేగేట్ వద్ద అండర్పాస్,బకింగ్ హామ్ కెనాల్ వద్ద నూతన బ్రిడ్జి నిర్మాణం,రైల్వే స్థలాలు,కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు ఇళ్ళ పట్టాలు వంటి డిమాండ్లను ఈ సందర్భంగా ప్రస్తావించారు.



## దేశవ్యాప్తంగా కొత్త ఇంటర్సిటి ఎలక్ట్రిక్ బస్సు సేవలు పెంచిన న్యూగో

**విజయవాడ, జూన్ 24, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా ఇంటర్సిటి ఎలక్ట్రిక్ మార్గాలను విస్తరించడం ద్వారా ముఖ్యమైన మైలురాయి అధిగమించామని న్యూగో, గ్రీన్సెల్ మొబిలిటి ఎండి, ఛీఫ్ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దేవేంద్ర చావ్లా తెలిపారు. తద్వారా సమయపాలన, సురక్షితమైన ప్రయాణాన్ని సున్నా ఉద్గారం లతో పచ్చదనంతో కూడిన ప్రయాణాన్ని అందిస్తామన్నారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలకు ఫ్యాన్లు అందజేత

**మాచర్ల, జూన్ 30 ప్రభాతవార్త:** మాచర్ల రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మాచర్ల మండల పరిధిలోని 7వ మైలు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు సుమారు రూ.20 వేల విలువచేసే 10 ఫ్యాన్లను సోమవారం అందజేశారు. రోటరీ అధ్యక్షురాలు



కొండవీటి కృష్ణకుమారి, సెక్రటరీ నిమ్మగడ్డ సురేఖ, ట్రెజరర్ అన్నపురెడ్డి లక్ష్మి ఆధ్వర్యంలో రోటరీక్లబ్ సభ్యులు, లవ్ అండ్ లాఫ్ సాటిలైట్ క్లబ్ వారి సహకారంతో ప్రిన్సిపల్ దుర్గాభవానికి ఫ్యాన్లు అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ గవర్నర్ కొండవీటి రామకోటయ్య మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకంలోని జ్ఞానంతోపాటు, స్వతంత్ర ఆలోచనలతో అధ్యయనం చేస్తూ, ఉన్నతమైన విద్యాభ్యాసాన్ని పొందాలన్నారు. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో రోటరీక్లబ్ చేసిన సేవలను ప్రిన్సిపల్ దుర్గాభవాని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనరు పఠాన్ నాగూర్వలి, జేవీకేఎస్ ప్రసాద్, కూరపాటి శ్రీనివాసరాజు, తుమ్మల సత్యప్రసాద్, ఆలేటి కోటేశ్వరరావు, నిమ్మగడ్డ రమేష్, రవికుమార్, క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యారంగాన్ని అభివృద్ధిబాటలో నడిపిస్తున్న ఘనత లోకేష్దే : యాగంటి


**మాచర్ల, జూన్ 30 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణంలోని నెహ్రూనగర్ ఎలిమెంటరీ స్కూల్ హెచ్ఎం గాదె కిరీటిరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాచర్ల మార్కెట్యార్డు మాజీ ఛైర్మన్, టీడీపీ నాయకులు యాగంటి



మల్లికార్జునరావు పాల్గొని ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న స్కూల్బ్యాగులను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా యాగంటి మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న నారా లోకేష్ వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన విద్యారంగాన్ని అభివృద్ధి బాట పట్టిస్తూ స్కూల్స్, కాలేజీలకు మౌలిక వసతులు కల్పించి విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాలలు ఓపెనింగ్ రోజే పాఠ్యపుస్తకాలు, బ్యాగులు అందించిన ఘనత లోకేష్కే దక్కుతుందన్నారు. విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యం. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమంది చదువుకోవాలన్నది ప్రభుత్వ లక్ష్యం అన్నారు. తల్లికి వందనం పథకం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే అమలు చేసి సూపర్ సిక్స్లో ప్రధానమైన హామీ తల్లికి వందనం ద్వారా 8,745 కోట్ల రూపాయలు తల్లుల ఖాతాల్లో జమచేశారన్నారు. విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా సన్నబియ్యంతో రుచికరమైన భోజనం అందిస్తున్న ఘనత దేశం మొత్తం మీద ఒక్క లోకేష్బాబుదే అన్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిల కృషి ఫలితంగానే తాళ్లపల్లి గ్రామం వద్ద కేంద్ర ప్రభుత్వ కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కాబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో కేసీపీ సిమెంటు కర్మాగారం చీఫ్ జనరల్ మేనేజరు రమణ, ఎలక్ట్రికల్ డీజీఎం రామకోటేశ్వరరావు, న్యూటన్స్ కళాశాల కరస్పాండెంట్ జొన్నా శ్రీనివాసరెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ కూనిశెట్టి వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు నాసరయ్య, తిక్కా కొండలు, దుర్బాకుల ప్రసాద్, గోలి వెంకటేశ్వర్లు, పాఠశాల టీచర్లు, విద్యాకమిటీ ఛైర్మన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మునిసిపల్ పబ్లిక్ హెల్త్ వర్కర్లకు ఘన సన్మానం

**మాచర్ల, జూన్ 30 ప్రభాతవార్త:** మాచర్ల పురపాలక సంఘ కార్యాలయంలో 42 సంవత్సరాలు సుదీర్ఘకాలం పబ్లిహెల్త్ వర్కర్లుగా పనిచేసిన చెరుకూరి అంజమ్మ, అవుట్సోర్సింగ్ పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా పని చేసిన కంభంపాటి గురవమ్మ, పి.యేసమ్మలు పదవీ విరమణ సందర్భంగా వారిని ఘనంగా




సన్మానించారు. మున్సిపల్ ఛైర్మన్ మదార్సాహెబ్, మున్సిపల్ వైస్ఛైర్మన్ వై.సిద్దమ్మ, కమిషనర్ డి.వేణుబాబులు వారి సేవలను కొనియాడారు. వారికి శుభాకాంక్షలు తెలియజేసి శాలువా కప్పి, పూలదండలతో ఘనంగా సన్మానించారు.

## రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి

### -మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి

**కొల్లిపర,జూన్ 30 ప్రభాతవార్త:** ఖరీఫ్లో నారుమళ్ళు పోసేటప్పుడు రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు.సోమవారం మండల పరిధిలోని వల్లభా పురం,మున్నంగి, కొల్లిపర, తూములూరు గ్రామాల్లో వరి విత్తనాల షాపులను ఆయన తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ లైసెన్స్లు లేకుండా గ్రామాల్లో వరి



విత్తనాలను అమ్మితే వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. మినుము పంటలు వేసే రైతులు ఈ క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ప్రధాన మంత్రి పసల్ భీమా యోజన పథకాన్ని వరి, మినుము పంటలు వేసే రైతులు సద్వినియోగించుకోవాలన్నారు.ఈ క్రాప్ చేయించుకుంటే భీమా పథకం పొందటానికి అవకాశం ఉందన్నారు.కౌలు రైతులు తప్పనరిసరిగా గుర్తింపు కార్డు తీసుకోవాలన్నారు.

## తెలుగువారి మదిలో చిరస్మరణీయుడు ముళ్ళపూడి వెంకటరమణ

**గుంటూరు కల్చరల్,జూన్ 30,ప్రభాతవార్త :** తెలుగు సాహిత్యవనంలో ఎన్నో సజీవపాత్రలు సృష్టించి ఓ చెరగని ముద్రగా నిల్చిన ముళ్ళమూడి వెంకటరమణ తెలుగు వారి మదిలో ఎప్పుడూ చిరస్మరణీయమేనని అవగాహన హాస్యవల్లరి బృంద సభ్యులు నివాళులర్పించారు.ప్రముఖ హాస్యరచయిత ముళ్ళపూడి వెంకటరమణ జయంతి కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ వి.వి.రామ్కుమార్ మాట్లాడుతూ సున్నిత హాస్యం,సునిశిత వ్యంగ్యం ముళ్ళపూడి వెంకటరమణ సొంతమన్నారు.తెలుగు సాహితీ లోకానికి ముళ్ళపూడి ఒక అపూర్వ కానుకగా కీర్తించబడ్డారన్నారు.

# ట్రాన్స్ఫార్మర్ల దొంగల అరెస్టు

### వివరాలు వెల్లడించిన డీఎస్పీ జగదీష్

**మాచర్ల, జూన్ 30 ప్రభాతవార్త:** సుమారు 67 ట్రాన్స్ఫార్మర్లు దొంగతనాల్లో చోరీకి పాల్పడిన అయిదుగురిని అరెస్టు చేసినట్లు గురజాల డీఎస్పీ జగదీష్ సోమవారం తెలిపారు. పట్టణంలోని



రూరల్ సర్కిల్ పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెల్దుర్తి ఎస్సై సమందర్వలి, సిబ్బందికి వచ్చిన సమాచారంతో శిరిగిరిపాడు అటవీ చెక్పోస్టు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా ట్రాన్స్ఫార్మర్లను దొంగతనం చేస్తున్నది వీరేనని తేలింది. వీరు మొత్తం 10 కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు తెలిపారు. వీరంతా ఒంగోలుకు చెందిన మొగిలి నాగరాజు, గడ్డం బయ్యన్న, ప్రతాప్ లక్ష్మీ, దారల భవాని, దేవర అంజమ్మలుగా గుర్తించినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 50 వేలు విలువ చేసే కేబుల్ వైరు, 2,69,620 విలువచేసే 308 కేజీల రాగిని రికవరీ చేసినట్లు తెలిపారు. వెల్దుర్తి పోలీసు స్టేషన్ పరిధిలో 13 ట్రాన్స్ఫార్మర్లు, మాచర్ల టౌన్లో 1, మాచర్ల రూరల్లో 7, దుర్గిలో 17, కారంపూడిలో 4, విజయపురిసౌత్లో 15, ప్రకాశం జిల్లాకు చెందిన పుల్లల చెరువులో 7, యర్రగొండపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో 3 ట్రాన్స్ఫార్మర్లను వీరు దొంగిలించినట్లు తెలిపారు. కాపర్, కేబుల్ వైరు కొనుగోలు చేసిన వారిపై కేసులు పెట్టినట్లు తెలిపారు. దొంగతనాల్లో నిందితులును పట్టుకుని, రికవరీలో పాల్గొన్న ఎస్సై, సిబ్బందిని అభినందించి వారికి రివార్డు అందేలా సిఫారసు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో అర్బన్ సీఐ సి.ప్రభాకరరావు, రూరల్ సీఐ అఫీజ్బాషా, ఎస్సైలు సమందర్వలి, అశోక్, సిబ్బంది దేవరనాయక్, విజయ్, వెంకటనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిల్ సమావేశంలో వైస్ ఛైర్మన్ ఆగ్రహం

తెనాలి, జూన్ 30 (ప్రభాతవార్త) : పురపాలక సంఘ సాధారణ సమావేశం సోమవారం పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో ఛైర్మన్ తాడిబోయిన రాధిక ఆధ్వర్యంలో నిర్వహించారు. జూన్ నెలకి సంబంధించి జరిగిన ఈ సమావేశంలో అధికార ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన పలు అంశాలు సభలో ప్రస్థావించారు. అన్ని అంశాలు సభ ఆమోదం పొందాయి. ముఖ్యంగా మున్సిపల్ వైస్ ఛైర్మన్, ఏడవ వార్డు కౌన్సిలర్ మాలేపాటి హరిప్రసాద్, తన వార్డులోని సమస్యలను ప్రస్థావించారు. వార్డులో మంచినీటి సరఫరా సరిగా లేదని, ఏఈకి ఫక్షన్ చేసినా స్పందించటం లేదని, ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.



వైస్ ఛైర్మన్కే గౌరవం లేకపోతే ఈ పదవీ ఎందుకని ప్రశ్నించారు. అనంతరం ఛైర్మన్ కమీషనర్ హామీతో ఆయన శాంతించారు. తదుపరి అజెండాలోని అన్ని అంశాలు ఆమోదించామని ఛైర్మన్ ప్రకటించారు.

## బులియన్ మర్చంట్స్ అధ్యక్షులు విజయకుమార్కు సత్కారం

**నరసరావుపేట, జూన్ 30 ప్రభాతవార్త :** రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కపలవాయి విజయకుమార్ నుకేరళ రాష్ట్ర బంగారు-నగల వర్తకుల సంఘం ఘనంగా



సత్కారించింది. కొచ్చిలో నిర్వహించిన బంగారు, వజ్రాభరణాల ప్రత్యేకఎగ్జిబిషన్ను ప్రారంభించిన విజయకుమార్కు ప్రముఖ సినీ నటి హాని రోజ్తో పాటు కేరళ పార్లమెంట్ సభ్యులు బెన్నీ బెహనమ్లు శాలువ, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఏపిలో వర్తకుల సంక్షేమం, వ్యాపారాల అభివృద్ధికి వారు చేస్తున్నకృషిని నిర్వాహకులు గుర్తు చేసారు. వినియోగదారులకు ప్రస్తుతం వస్తున్న ఆధునిక బంగారు ఆభరణాలపై అవగాహన కల్పిస్తూ కపలవాయి విజయకుమార్ ఆధ్వర్యంలో అనేక ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నారని వివరించారు. ఏపికి సంబంధించి అసోసియేషన్పరంగా ఎటువంటి అవసరం ఉన్న తమ వంతు సహకారం అందిస్తామని ఈ సందర్భంగా కేరళ అసోసియేషన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వివిధ రాష్ట్రాల నుండి బంగారు వర్తకులు, కేరళ రాష్ట్రానికి చెందిన ప్రజా ప్రతినిధులు,సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతో ప్రభుత్వ విద్యా వ్యవస్థ పటిష్టం : టిఎన్ఎస్ఎఫ్

నరసరావుపేట, జూన్ 30 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో విద్యా వ్యవస్థ బలోపేతం అవుతుందని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కూరపాటి హనుమంతురావు అన్నారు. సోమవారం స్థానిక టిడిపి జిల్లా పార్టీ కార్యా లయంలోవారు మాట్లాడారు. గత వైకాపా పాలనలో విద్యా వ్యవస్థ మొత్తం సమస్యలతో ఉండేదన్నారు. మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు అనేక చర్యలు



తీసుకుంటున్నారని తెలిపారు. టిడిపి హాయంలో నూరుశాతం అక్షరాస్యత లక్ష్యంగా బడి పిలుస్తోంది, అమ్మఒడి, మన ఊరు-మన బడి వంటి కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లా పరిషత్ పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా మార్చడంతో పాటు స్వయంసిద్ధ పథకం ద్వారా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు అమలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. బాలికల కొరకు రూ.79.50కోట్లతో 1.89 లక్షల సైకిళ్ళను పంపిణీ చేసామని, విద్యా రంగానికి అండగా కూటమి ప్రభుత్వం నిలిచిందని ఈ సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ నాయకులు కూరపాటి హనుమంతురావు వివరించారు.

## ఆశ వర్కర్స్ నియామకాల్లో పారదర్శకత పాటించాలి : బిసీ సంక్షేమ సంఘం

నరసరావుపేట, జూన్ 30 ప్రభాతవార్త : ఆశ వర్కర్స్ నియామకాల్లో పారదర్శకత పాటించాలని , రిజర్వేషన్ పద్దతిలో నియమకాలు జరగాలని బిసీ సంక్షేమ సంఘం నాయకులు సోమవారం కోరారు. ఈ మేరకు వారు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 1294 ఆశా వర్కర్ల పోస్టులకు సంబంధించి గ్రామీణ ప్రాంతాలలో నియామక విధానాన్ని రాజకీయ జోక్యం లేకుండా అర్హత ఉన్న అభ్యర్దులకు అవకాశం కల్పించాలన్నారు. సచివాలయాల్లో కనీసం అభ్యర్దులకు దరఖాస్తులు ఇవ్వటం లేదని, రాజకీయ నాయకులు



చెబితే ఇస్తామని అక్కడ చెప్పాటం దారుణంగా ఉందన్నారు. అదే విధంగా దరఖాస్తు చేసుకునే గడువు సమయాన్ని పెంచాలని బిసీ సంక్షేమ సంఘం నాయకులు బాదుగున్నల శ్రీను,మురళీ గౌడ్, కాకుమాను రమేష్, తోట శివశంకర్లు విజ్ఞప్తి చేసారు.

## సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటాం

### గుంటూరు నగర అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు

**గుంటూరు తూర్పు, జూన్ 30 (ప్రభాతవార్త) :** నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్



యువర్ కమీషనర్, పిజిఆర్ఎస్లో ప్రజలు ఇస్తున్న అర్జీల్లోని ఫిర్యాదులకు సంబంధించి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని గుంటూరు నగర అదనపు కమీషనర్ చల్లా ఓబులేసు అన్నారు. సోమవారం కమీషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు కమీషన్ ఛాంబర్లో డయల్యువర్ కమీషనర్, నగరపాలక సంస్థ బర్త్ అండ్ డెత్ విభాగం వద్ద పిజిఆర్ఎస్ని అదనపు కమీషనర్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమీషనర్తో తొలుత డయల్యువర్ కమీషనర్ ద్వారా ప్రజల నుండి 16ఫిర్యాదులు అందుకొని మాట్లాడుతూ డయల్ యువర్ కమీషనర్కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్ళాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమీషనర్ ఛాంబర్కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం నగరపాలక సంస్థ బర్త్ అండ్ డెత్ విభాగం వద్ద పిజిఆర్ఎస్ ద్వారా 24ఫిర్యాదులు అందుకొని మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక విభాగం 16, ఇంజనీరింగ్ విభాగం 4, రెవెన్యూ విభాగం 4, ప్రజారోగ్య విభాగానికి సంబంధించిన 3 ఫిర్యాదులు అందాయన్నారు. పిజిఆర్ఎస్లో ప్రజల నుండి అందిన అర్జీలను విభాగాల వారిగా విబజించి సంబంధిత విభాగాధిపతులకి పంపి సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, మేనేజర్ బాలాజీబాష, విభాగాల సూపరింటెండెంట్లు ఎస్ఎస్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన సమాజమే జయప్రద ఫౌండేషన్ లక్ష్యం : టిడి జనార్ధన్

**వత్సవాయి, జూన్ 30, ప్రభాతవార్త :** జయ ప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో వత్సవాయి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్యతో కలసి సోమవారం ప్రారంభించారు. అనంతరం జయప్రద ఫౌండేషన్ ఛైర్మన్ టిడి జనార్ధన్ మాట్లాడుతూ ఈ రోజుల్లో ధనము ఉన్నవాడు అదృష్టవంతుడు కాదని, సంపూర్ణ ఆరోగ్యం ఉన్నవాడే అదృష్టవంతుడని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కొరకు అనేక విధాలుగా కృషి చేస్తుందని, ఇప్పటికే ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8 గ్రామాల్లో వైద్య శిబిరాలు విజయవంతంగా నిర్వహించగా, విశేషమైన స్పందన లభించిందని, నేను ఈ స్కూల్లో పూర్వ విద్యార్థి కారణంగా హైస్కూలు అభివృద్ధికి కూడా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ట్రిబుల్ ఐటిలో సీట్లు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతిగా ఒక్కొక్కరికి పదివేల రూపాయలు నగదు అందచేసినట్లు పేర్కొన్నారు. ఈవైద్య శిబిరములో కంటి పరీక్షలు ఉచిత కళ్ళజోళ్లు శుక్లముల ఆపరేషన్లు మరియు మోకాళ్లు, కీళ్ల నొప్పులకు ఆర్థోపెడిక్ ఈఎన్టి షుగరు సాధారణ వైద్య పరీక్షలు ప్రజలకు స్కూలు విద్యార్థులకు నిర్వహించి ఉచిత మందులు అవసరం మేరకు కళ్లజోళ్లు మరియు ఆ క్రమంలో అవసరం



మేరకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ వైద్య శిబిరములో వివిధ విభాగాల్లో నిపుణులైన వైద్యులు ఉచిత వైద్య సేవలందించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు జొన్నలగడ్డ రాధాకృష్ణమూర్తి తొండపు జగన్మోహన్రావు, కట్టా వెంకట నరసింహారావు, వడ్లమూడి రాంబాబు పెద్ది రామారావు, నెల్లూరి శ్రీనివాసరావు, చిట్టూరి రమేష్, కనతల రామకృష్ణ, ఉప్పుగండ్ల వెంకటేశ్వర్లు హైస్కూలు ప్రదానోపాద్యాయురాలు అనితశ్రీ మరియు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# ధరభారం..బతకు దుర్భరం

-ఇటు రైతులకు, అటుమధ్య తరగతి ప్రజలకు జూన్ నెల గండం
-రైతులకు పెరిగిన పెట్టుబడి వ్యయం...
-విద్యా సంస్థల నిలువుదోపిడి - వడ్డీ వ్యాపారుల దందా...

**గుంటూరు తూర్పు, జూన్ 30 (ప్రభాతవార్త) :** ద్రవోల్బణం లాంటి పెద్ద మాటలకు అర్థాలు తెలియని సామాన్యుడి బతుకు...పెరుగుతున్న ధరలతో భారంగా మారింది. తెల్లవారు ఘూమున నిద్రలేవగానే కొనుక్కొచ్చుకునే పాల దగ్గర నుండి...పొద్దుపోయేదాకా ఏ వస్తువు కొనాలన్నా వాటి ధరలు వినగానే వెన్నులో వణుకు పుట్టే పరిస్థితి. ధరాభారం పెరిగిపోవడంతో పేద, దిగువ మధ్య తరగతి, మధ్య తరగతి జీవనం దుర్భరంగా మారింది. దీనికి తోడు జూన్ మాసం వచ్చిందంటే అందరికీ ఆర్ధిక కష్టాలు మొదలౌతాయి. రైతులు పంటలు చేయటానికి పెట్టుబడి సాయం కోసం, పేద, మధ్య తరగతి ప్రజలతే తమ పిల్లల విద్య కోసం తప్పనిగా డబ్బులు కోసం చేయి చాపాల్సిన పరిస్థితి నెలకొని ఉంటుంది. దీంతో జూన్ నెల వస్తుందంటే చాలు అమ్మో జూన్ అంటూ భయపడాల్సిందే.

**రైతులకు పెరిగిన పెట్టుబడి వ్యయం...**

నానాటికి పెట్టుబడి వ్యయం పెరిగిపోతుంది. రసాయన ఎరువుల ధరలు పెరగడంతో పాటు ట్రాక్టర్ బాడుగులు, లేబర్ చార్జీలు ఎక్కువ కావడంతో ఎకరాకు రూ.10వేల వరకు అదనపు ఖర్చు వస్తోంది. కుటుంబ సభ్యులందరూ రేయింబవళ్ళు పొలంలోనే పనులు చేస్తున్నా ఎకరాకు పెట్టుబడి వ్యయం తగ్గడం లేదు. భూముల కౌలు భారీగా ఉంది. తొలకరి మొదలైనప్పటి నుంచి దుక్కిదున్నడం, విత్తనాలు కొనుగోలు చేయడం, కూలీలను తరిలించటానికి రవాణా ఖర్చు పెరిగి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. దీంతో పెట్టుబడి ఖర్చు భారంగా మారింది. గత ఖరీఫ్ సీజన్‌లో వాతావరణం అనుకూలించక, రైతులపై అదనపు భారం పడింది. నాట్లు వేసే సమయంలో వర్షాభావ పరిస్థితులు, పెట్టుబడి వ్యయం పెరిగింది. దిగుబడి మాత్రం తగ్గింది. ప్రతి సారి వ్యవసాయ జూదంలో ఓడిపోతున్న రైతులు మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకొనేందుకు సిద్ధమౌతున్నాడు.

**విద్యా సంస్థల నిలువుదోపిడి....**

విద్య పూర్తిగా వ్యాపారంగా మారిపోయింది. చదువుకునే రోజులు పోయి చదువు కొనుక్కొనే రోజులు వచ్చాయి. ప్రాధమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు పేదవాడి శ్రమ దోపీడీగా మారింది. ఈ పోటీ ప్రపంచంలో పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు చేసిన తపన, ప్రైవేటు విద్యా సంస్థలకి లాభ మార్గంగా మారింది. చదువు పేరుతో డబ్బులు దోపిడికి తెరలేపారు. పల్లె పల్లెల్లోకి వెళ్ళి అడ్మిషన్ల పేరుతో ఫోన్లు చేస్తూ టాలెంట్, టెక్నో, కాన్సెప్ట్, ఒలంపియాడ్, ఇంటర్నేషనల్, కిడ్స్ వంటి పేర్లతో మల్టీకలర్ బ్రోచర్లతో ఆకట్టుకుంటున్నారు. కానీ ఇద్యా సంస్థల స్థితిగతులు మాత్రం నామ మాత్రం. చదువు బోధనకే గదులుండవు. ఇరుకైన గదుల్లో 40నుంచి 60మంది విద్యార్థులను కుక్కుతున్నారు. అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు, ఎగ్జామ్స్ ఫీజు, వ్యాన్ ఫీజు యూనిఫామ్, షూ, ఐడీ కార్డు, ల్యాబ్, లైబ్రరీ పేర్లతో వేర్వేరు తలంపులతో ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. నర్సరీ నుండి పదవ తరగతి వరకు తల్లిదండ్రులు రూ.20,000నుంచి రూ.50,000వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి పాఠశాలలు తమదైన రైతీలో ఫీజులు నిర్ణయించుకుంటున్నాయి. అయినా సరే మధ్య తరగతి ప్రజలు తమ పిల్లలను ప్రైవేటు విద్యా సంస్థల్లోనే చదివించటానికి ఇష్టపడుతున్నారు. ఫీజులు చెల్లించటానికి తల్లిదండ్రులు అప్పులు చేయటానికి సిద్ధం అయ్యారు.

**వడ్డీ వ్యాపారుల దందా...**

జూన్ మాసం ఇటు రైతులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు కష్టకాలం అయితే వడ్డీ వ్యాపారులకు వ్యాపారం లాభసాటిగా నడిచే కాలం, వడ్డీ వ్యాపారులు రెచ్చిపోతున్నారు. అవసరార్థం అప్పు కోసం వచ్చిన వరాఇ నుంచి అధిక వడ్డీ వసూలు చేస్తూ పేదల నడ్డి విరిస్తున్నారు. అప్పు చెల్లించడంలో ఆలస్యమైతే దాడులకు దిగుతున్నారు. ఈ వడ్డీ వ్యాపారులు బంగారం తాకట్టు పెట్టుకోవడంతో పాటు, భూములను, ప్లాట్లను, ఇండ్లను ముందుస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకుని ఎక్కడా లేని వంద రూపాయలకు షుమారు నాలుగు రూపాయల నుంచి రూ.10వరకు వడ్డీతో దందా చేస్తుంటారు. డబ్బులు కావాలంటే అధిక వడ్డీకే అప్పు ఇస్తామంటూ నిబంధనలు పెట్టడంతో తప్పనిసరిగా ఇబ్బందుల్లో ఉన్న సామాన్యులు వాటికి అంగీకరించి అప్పులు తీసుకున్నారు. అప్పట్నుంచి వారికి చుక్కలు కనిపిస్తున్నాయి. అప్పులకు వడ్డీలు కట్టలేక అల్లాడిపోతున్నారు. ముందుగానే తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న వరాఇకి ఇది మరింత భారంగా మారింది. వడ్డీలు కట్టలేక చేతులెత్తేస్తున్నారు. వారిపై వడ్డీ వ్యాపారుల ఒత్తిళ్ళు మామూలుగా ఉండట్లేదు, ఇళ్ళ వద్దకెళ్ళి గొడవలకు దిగుతున్నారు. దీంతో ఎక్కడ ఇళ్ళ వద్దకు వస్తారోనని ఊళ్ళు వదిలి వెళ్ళిపోతున్నారు. తనఖా పెట్టిన ఆస్తులను దౌర్జన్యంగా స్వాధీనం చేసుకుంటున్నారు. తనఖా పెట్టకపోయినా అప్పు కట్టలేదని ఆస్తులను తక్కువకే లాగేసుకుంటు న్నారు. దీంతో అప్పులు తీసుకున్న కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

**ఖరీదుగా మారిన విద్య, అప్పుల పాలవుతున్న మధ్య తరగతి**

నేడు తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువు కొనుక్కోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. ప్రభుత్వాలు ఫీజుల నియంత్రణ చేపడతామని చెబుతూ నియంత్రణ మాటేటు విచ్చల విడిగా ఫీజులు పెంచుకునే దానికి అవకాశాలు కల్పిస్తూ ప్రైవేటు విద్యా సంస్థలను ప్రోత్సహిస్తున్నారు. నేడు మంచి విద్య అంటే ప్రైవేటు కార్పోరేట్ విద్యా సంస్థలను చదివితేనే మంచి విద్య వస్తుందన్న భావనను పేద, మధ్య తరగతి ప్రజల్లోనూ కల్పించిటువంటి పరిస్థితి ఉంది. దీని కోసం తమ పిల్లల భవిష్యత్తు కోసం ఆస్తులు తనఖా పెట్టి అప్పులు చేసి చదివించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో అప్పులు తీర్చలేక ఆత మృత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఇది నా సామాన్య ప్రజలు అందుబాటులో ఉండే విధంగా ఫీజుల్నీ నిర్ణయించాలని కోరారు. మరోపక్క న్యూ ఎడ్యుకేషన్ పాలసీలో భాగంగా కొన్ని స్కూల్స్‌ని మూసి వేస్తున్న పరిస్థితి ఉన్నదని ఇది విరమించుకొని ప్రభుత్వ స్కూల్స్‌ను ఎక్కువగా ఏర్పాటు చేసి సామాన్య ప్రజలకి విద్యను దగ్గర చేయాలని డిమాండ్ చేశారు.





**డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి**

వ్యవసాయ సీజన్ ప్రారంభమైనది, ఈ సందర్భంగా ప్రారంభమైన రైతులు పెట్టుబడుల కోసం రకరకాల రూపంలో అప్పులు తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతుంది. కొందరు బంగారం తాకట్టుపెట్టి బ్యాంకులో లేక ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తులు దగ్గర లేక నివాసం ఉంటున్న సొంతిల్లు తాకట్టు, అరెకరం, ఎకరం భూమి తాకట్టుపెట్టి రుణాలు తీసుకోవడం మరి కొందరు అధిక మొత్తంలో వడ్డీ చెల్లించే విధంగా పద్ధతులను కొనసాగుతున్నాయి. గత ఏడాది ప్రత్యామ్నాయ పంటగా పొగాకు పంటను పేద రైతులు, కౌలు రైతులు సాగు చేయడం జరిగింది. రైతులందరూ అప్పులతో ఎకరాకు లక్ష రూపాయలు పెట్టుబడి అదనంగా రూ.40వేలు కౌలు ముందే చెల్లించి ఎకరానికి ఖర్చు పెట్టడం వల్ల చివరకు కొనే వాళ్ళు లేక చేసిన అప్పులు తీర్చలేక గుంటూరు జిల్లాలో ఇద్దరు, ప్రక్క జిల్లా పల్నాడు జిల్లాలో ముగ్గురు, బాపట్ల జిల్లాలు ఇద్దరు ఈ విధంగా మొత్తం షుమారు పది మంది పొగాకు రైతులు ఆత మృత్యలకు పాల్పడటం జరిగింది. ఇది సాగు రైతులకు బ్యాంకు రుణాలు అందినట్లయితే ప్రైవేట్ వడ్డీలకి వెళ్ళే అవసరం ఉండేది కాదు. ఇప్పుడు ప్రైవేటు వడ్డీలకు వెళ్ళి ఐదు రూపాయల నుంచి పది రూపాయలు వరకు వడ్డీలు చెల్లించడానికి ఒప్పదల అగ్రిమెంట్లు చేసుకోవడం జరిగింది. ఈ విధంగా అగ్రిమెంట్ చేసుకున్న రైతులు వాళ్ళకు అప్పులు తీర్చలేక ఉండే కొవ్వు సమాధానం చెప్పలేక కొందరు ఒత్తిడి భరించలేక ఆత్మహత్యలకు పాల్పడటం జరుగుతుంది. అందువల్ల ఈ సంవత్సర ప్రారంభం నుంచి విత్తనాలు దగ్గర నుంచి వ్యవసాయ ఖర్చుల కొరకు ముందుగానే డబ్బులు సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. అవసరాలను ఆసరా చేసుకుని ప్రైవేటు వ్యాపారస్తులు విపరీతంగా వడ్డీ వసూలు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ఉన్న పొగాకును కొనుగోలు చేసినట్లయితే ప్రైవేట్ వ్యాపారస్తులకు వెళ్ళే అవసరం ఉండదు. మిర్చి రైతుల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉన్నది. ఉన్న ఇబ్బందికర పరిస్థితులు బయటపడ్డాను వ్యాపారస్తులు వత్తులు చేయకుండా ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలన్నారు. దీంతో పాటు బ్యాంకులు విరివిగా రుణాలు ఇవ్వాల్సిన అవసరం ఉన్నది. ప్రతి ఏడాది పంట రాగానే ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తే అధిక వడ్డీ వైపు రైతులు వెళ్ళే అవకాశం ఉండదు.

# జనసేన కేంద్ర కార్యాలయంలో జనవాణి



**మంగళగిరి, జూన్ 30, ప్రభాతవార్త :** మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద జనవాణి కార్యక్రమం నిర్వహించారుఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చి తమ సమస్యలను విన్నవించగా,..సమస్యలను అర్జీ రూపంలో తీసుకుని, నాయకులచే తక్షణ పరిష్కారం జరిగే విధంగా చర్యలు చేపట్టారునేటి జనవాణి కార్యక్రమంలో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ , ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ మల్లెపు విజయలక్ష్మి, పార్టీ లీగల్ సెల్ వరగాని శివశంకర్ చౌదరి, శాలం శ్రీనివాస రాజా, జనసేన నాయకులు సీనియర్ కంకణాల శంకర్ పాల్గొన్నారు. జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు గత కొన్ని నెలలుగా జనసేన పార్టీ ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా మంగళగిరి కేంద్ర కార్యాలయం వద్ద జనావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా సోమవారం జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, జనసేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# పంచాయతీ రాజ్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీరం చేస్తుంది : మాజీ ఎమ్మెల్యే

**నరసరావుపేట, జూన్ 30 ప్రభాతవార్త :** పంచాయతీ రాజ్ వ్యవస్దను కూటమి ప్రభుత్వం



నిర్వీరం చేస్తుందని మాజీ ఎమ్మెల్యేడాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. సోమవారం వైకాపా పంచాయతీ రాజ్ విభాగం తరపున జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమస్యలు పరిష్కారించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ తక్షణమే కేంద్రం విడుదలచేసిన 1150కోట్ల రూపాయాల నిధులను పంచాయతీలకు చెల్లించాలన్నారు. అదే విధంగా గ్రేడ్ వన్ పంచాయతీ కార్యదర్శులకుతక్షణమే పోస్టింగులు ఇవ్వాలన్నారు. ఎన్ఆర్‌జిఏస్ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు చేస్తున్న అవినీతి పై తక్షణమే విచారణ చేయాలన్నారు. గ్రామాల్లో శానిటేషన్, మంచినీటి సరఫరాకు ఆటంకాలు లేకుండా, వర్షాకాలంలో కలరా,మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు రాకుండా నివారణ చర్యలు తీసుకోవా లన్నారు. ప్రజల చేత ఎన్నుకున్న సర్పంచ్‌లకు సంబంధించి హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ రాజ్ వ్యవస్థలోని సమస్యలు పరిష్కారం జరిగే వరకు రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సిపి తమ పోరాటం కొనసాగిస్తుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మినారాయణ, పడాల శివారెడ్డి, ఎం. హరినారాయణ, పచ్చవ రవీంద్ర, తన్నీరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఆర్ఐకు పల్నాడు జిల్లా ఎస్పీ హెచ్చరిక

**నరసరావుపేట, జూన్ 30 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా ఎస్పీ కె శ్రీనివాసరావు చిలకలూరిపేటకు చెందిన ఎన్ఆర్ఐ రావి మురళీ



మోహన్‌ను హెచ్చరించారు. తన అవసరాలకు సహకారం అందించలేదని పోలీస్ వ్యవస్థ పై ఇష్టనుసారం విమర్శలు,సోషల్ మీడియాలో అప్రజాస్వామికంగా వీడియోలు షేర్ చేస్తే సహించేదిలేదన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. చిలకలూరిపేటలో సాయి కార్తీక్ సెంటర్ పేరుతో షాపింగ్ మాల్ నిర్వహిస్తున్నారని ఇందుకు సంబంధించి మురళీ మోహన్‌కు, వారి పార్టనర్‌లకు మధ్య ఆర్థిక పరమైన విభేదాలు నడుస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై ఎన్నో సార్లు పోలీస్‌లకు ఇరు వర్గాల వారు పరస్పరం ఫిర్యాదులు చేసుకుని కేసులు పెట్టుకున్నారని తెలిపారు. పోలీస్‌లు తమ పరిధిలో ఆయా కేసులకు సంబంధించి విచారణ పూర్తి చేసి న్యాయస్దానాలకు తెలిపారని పేర్కొన్నారు. అయితే ఎన్ఆర్ఐ పదే పదే అనవసరంగా పోలీస్ వ్యవస్థతో పాటు ప్రజా ప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని ఆవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని, ఇటువంటి వాటిపై సహించేది లేదని చట్టపరమైన చర్యలు ఖచ్చితంగా తీసుకోవటం జరుగు తుందని ఎస్పీ కె శ్రీనివాసరావు అన్నారు.

# చట్ట పరిధిలో విచారించి అర్జీలు పరిష్కరిస్తాం

## బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి



**బాపట్ల, జూన్30, ప్రభాతవార్త:** అర్జీదారుల సమస్యలను చట్ట పరిధిలో విచారించి అర్జీలు పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఫిర్యాదీదారులకు భరోసా కల్పించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. ఈ కర్యాక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీ దారులు వారి వివిధ సమస్యలను స్వయంగా జిల్లా ఎస్పీకి విన్నవించుకున్నారు. వారి సమస్యలను విని, వారు ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాది దారుల సమస్యలను చట్ట పరిధిలో విచారించి నిర్దిష్ట గడువులో గా పరిష్కరించి, బాధితులకు న్యాయం చెయ్యాలని ఎస్పీ ఆదేశించారు. అర్జీలను చట్టపరిధిలో విచారించి పరిష్కరిస్తామని బాధితులకు భరోసా కల్పించారు. పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమంలో కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్తి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీ మోసాలు, ఇతర పలు సమస్యలతో 49 మంది ఫిర్యాది దారులు అర్జీలు బాదితులు అందించారు. ఈ కార్యక్రమంలో సిసిఎస్ డిఎస్పి జగదీష్ నాయక్, పి.జి.ఆర్.ఎస్ ఇంచార్జ్ సీఐ శ్రీనివాసరావు,,ఇతర అదికారులు పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా శ్రీ సుబ్రహ్మణ్య స్వామి కావడి సేవా మహోత్సవం

**బాపట్ల,జూన్30,ప్రభాతవార్త:** అత్యంత వైభవంగా శ్రీ సుబ్రహ్మణ్య స్వామి కావడి సేవా మహోత్సవం, అభిషేకం పుష్పయాగం సర్పసూక్త



హోమము నిర్వహించినట్లు శ్రీ లలితా త్రిపుర సుందరీ పీఠం అధ్యక్షులు నెమలికంటి హనుమంతరావు అన్నారు.సోమవారం స్థానిక కోన కళాక్షేత్రం లో శ్రీ లలితా త్రిపుర సుందరీ పీఠం ఆధ్వర్యంలో కావడి సేవా మహోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుర వీధులలో వందలాది భక్తుల నడుమ నేత్ర పర్వంగా పండిత శ్రీమాన్ ముత్తేవి శ్రీనివాస శశికాంత్ యాజ్ఞిక పర్యవేక్షణ లో మేదూరి వెంకట అప్పలాచార్యులు రొంపిచర్ల కేశవాచార్యులు రొంపిచర్ల గోపాలచార్యులు కొల్లిపర వెంకట శివ వర ప్రసాద్, శ్రీనివాసుల విఖనస మూర్తి గూడా సాయి వెంకట్, భీమవరపు సురేష్ శర్మ సహకారం తో సుబ్రహ్మణ్య స్వామి వారికీ విశేష అభిషేకం, కావడి సేవ పుష్పయాగం సర్పసూక్త హోమము అత్యంత దివ్య వైభవం తో నిర్వహించారు.అనంతరం సుమారు 2000 మందికి అన్నసమారాధన నిర్వహించామన్నారు.

# డొక్కా సీతమ్మ భోజన పథకంతో విద్యార్థుల్లో సంతృప్తి

## -విద్యా కమిటీ చైర్మన్ నాగుల్‌మీరా

**ఎ కొండూరు, జూన్ 30, ప్రభాతవార్త :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థుల కోసం సన్నబియ్యంతో ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతో దోహదపడు తుందని ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం చీమలపాడు జడ్పీ హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ ఎస్‌కె నాగుల్ మీరా (ఆటో బంగారం) అన్నారు. హైస్కూల్‌లో హెచ్‌ఎం హైమేశ్వరరావు



పర్యవేక్షణలో వంట ఏజెన్సీ నిర్వాహకులు విద్యార్థులకు పెడుతున్న సన్నబియ్యం భోజనాన్ని రుచి చూసి ఛైర్మన్ నాగుల్‌మీరా సంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యమైన సన్నబియ్యం కూటమి ప్రభుత్వం ప్రవేశపట్టిన తర్వాత విద్యార్థిని విద్యార్థులు సంతృప్తిగా భోజనం చేస్తున్నారని వీరు పేర్కొన్నారు. వంట ఏజెన్సీ నిర్వాహకులు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం పెట్టాలని చైర్మన్ నాగుల్‌మీరా కోరారు. హెచ్‌ఎం హైమేశ్వరరావు, ఎస్‌పిఎల్ ఎస్‌కె ఆఫ్రిద్ మధ్యాహ్న భోజనం డొక్కా సీతమ్మ భోజనం పథకాన్ని రుచి చూశారు.

# ప్రజా సమస్యలపై సత్వరమే చర్యలు తీసుకోవాలని ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించిన టిబిఎస్ ఉదయరాణి

**విజయవాడ క్రైం ,జూన్ 30,ప్రభాతవార్త:** ప్రజా సమస్యలపై సంబంధిత ఎస్‌హెచ్‌ఓలు సత్వరమే చర్యలు తీసుకోవాలని డిసిపి ఏబిటిఎస్



ఉదయరాణి ఆదేశించారు. సోమవారం సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ఆమె నగర పోలీస్ కమీషనర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. భాధితుల నుండి వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 79 ఫిర్యాదులను అందుకుని, వాటగి గురించి భాధితులతో మాట్లాడటంతో పాటు దివ్యాంగులు,వృద్ధుల వద్దకు ఆమే స్వయంగా వెళ్ళి వారి సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం అందిన ఫిర్యాదుల్లో భూవివాదాలు,ఆస్థి వివాదాలు,నగదు లావాదేవీలకు సంబంధించి-41, భార్యాభర్తలు ,కుటుంబ కలహాలకు సంబంధించి-6,చోరీలకు సంబంధించి-2,కొట్లాటలకు సంబంధించి-4, వివిధ మోసాలకు సంబంధించి-5,ఇతర చిన్న చిన్న వివాదాలు సమస్యలకు సంబంధించి-16 ఫిర్యాదులను అందుకున్నారు. కార్యక్రమంలో ఆమెతో పాటు ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# పిన్నెల్లిలో మెగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ స్టాల్స్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, జూన్ 30 ప్రభాతవార్తః మండలంలోని పిన్నెల్లి గ్రామంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం, భారతీయ ఆయిల్ ఫామ్ పరిశోధనా సంస్థ సాంకేతిక సహకారంతో జిల్లా హార్టికల్చర్ శాఖ, వ్యాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యాన మెగా ఆయిల్‌ఫామ్ ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. ఆయిల్ ఫామ్ పంటసాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించే బ్రౌజర్‌ను విడుదల చేసి రైతులకు తగు సూచనలు చేశారు. అనంతరం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించారు.

# ప్రజా ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారాలు చూపండి : ఇన్‌ఛార్జి కమిషనర్

**విజయవాడ కార్పొరేషన్ ,జూన్ 30,ప్రభాతవార్త:** ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారాన్ని చూపాలని



నగరపాలక సంస్థ అదనపు కమీషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన అధ్వర్యంలో ప్రధాన కార్యాలయం లోని కమాండ్ కంట్రోల్ రూంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను అధికారులు నిర్వహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను వేగంగా, సమర్థవంతంగా పరిష్కరించడం కార్పొరేషన్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల నుండి తీసుకున్న ఫిర్యాదులను శాఖాధిపతులు స్వీకరించి, తామే స్వయంగా వచ్చి పరిష్కారాన్ని కనుగొనే విధంగా చూస్తామని వారికి తెలియపర్చారు. నేటి పరిష్కార వేదికలో 13 ఫిర్యాదులు అందగా వాటిలో పట్టణ ప్రణాళికకు సంబంధించి -4,రెవిన్యూ-1, వైద్య,ఆరోగ్యం-3 ,ఎస్టేట్-1,పీఓ యుసిడి-1, హౌసింగ్-2,సెక్రటరీ-1లను అందుకున్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్,చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి,సూపరింటెండెంట్ ఇంజనీర్లు పి.సత్యకుమారి,పి.సత్యన్నారాయణ,డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి,అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాక్ పటన్‌బాబా నాగపూర్‌బాబాల జెండా ఉర్సు,గంధ మహోత్సవం

**ఎ కొండూరు, జూన్ 30, ప్రభాతవార్త :** పాక్ పటన్ షరీఫ్‌లో వేంచేసి ఉన్న హుజూర్ హజరత్ సర్కార్ సయ్యద్ బాబా ఫరీదుద్దీన్ గంజెషకర్ మహాత్ముల జెండా గంధ మహోత్సవం జులై 1న మంగళవారం సాయంత్రం 7 గంటలకు అలాగే నాగపూర్ షరీఫ్‌లో వేంచేసి ఉన్న హజరత్ సయ్యద్ బాబా తాజుద్దీన్ బాబా (ర.అ) ఉర్స్, షాహి సందల్ 22న ఉదయం 10 గంటలకు చట్టీషరీఫ్ ధార్మిక కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్దలతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఎ కొండూరు మండలం చీమలపాడు ఎఎంటికె దర్బార్ బాబె ఎ బాగ్దాద్ షరీఫ్ అతావుల్లా బాబా ఆధ్యాత్మిక వారసుడు పీఠాధిపతి మొహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షా ఖాదరీ బాబా సోమవారం మీడియాకు తెలిపారు. అతావుల్లా బాబా దర్బార్ అండ్ దర్గాలో మహాదివ్య అన్నసమారాధన కార్యక్రమాలు కులమతాలకతీతంగా బాబా భక్తులకు దిగ్విజయంగా నిర్వహిస్తున్నట్లు భారతదేశం నలుమూలల నుండి ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి బాబా భక్తులు పాల్గొని ఆధ్యాత్మిక ధార్మిక శోభకు భక్తిపారవశ్యంతో పునీతులవుతారని పీఠాధిపతి ఖాజా మొహియుద్దీన్ తెలిపారు. జాఫర్ షరీఫ్ బొగ్దాది తాజ్ ఖాదర్ బాబు పాల్గొన్నారు.

# గ్రామ సర్పంచి ఆధ్వర్యంలో చేతిపంపులకు మరమత్తులు

ఎ కొండూరు, జూన్ 30, ప్రభాతవార్త : ఎ కొండూరు మండలం కంభంపాడు గ్రామంలో సర్పంచ్ కోట పుల్లమ్మ ఎంపిటిసి మెంబర్ కోట పుల్లారావు దంపతుల ఆధ్వర్యంలో కొన్ని కాలనీల్లో చేతి పంపులను డ్రిల్లింగ్ చేసి కొత్త సామాన్లు వేసి కాలనీ వాసులకు చేతి పంపులను నీటి ఎద్దడి లేకుండా



అందుబాటులోకి తెచ్చారు. ఈ గ్రామంలోని కాలనీల్లో ఉన్న చేతిపంపులకు కొత్త సామాన్లు వేసి తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకున్న సర్పంచ్ పుల్లమ్మ పుల్లారావు దంపతుల సేవలను కాలనీవాసులు అభినందించారు.

# కాంట్రాక్టర్లు త్వరగా ఇళ్ళన్నీ పూర్తి చేయాలి : కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ కార్పొరేషన్,జూన్ 30,ప్రభాతవార్త: పేదల కోసం అందించే ఇళ్ళను కాంట్రాక్టర్లందరూ త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు.కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం లోని నూతన భవనం,మీటింగ్ హాల్లో కాంట్రాక్టర్లు,లబ్దిదారులు,హౌసింగ్,విఎంసి అధికారులతో కలిసి ఆయన సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్లు,అధికారుల మధ్యలో ఉన్న సమన్వయ లోపంలో ఉన్న సమస్యలను ముఖాముఖి చర్చించడంతో సమస్యలను పరిష్కరిస్తూ ప్రభుత్వం తరపు నుండి వారికి సంపూర్ణ సహాయం అందుతుందని వారికి ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. కాంట్రాక్టర్లకు కేటాయించిన ఇళ్ళ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి,సూపరింటెండింగ్ ఇంజనీర్(వర్క్స్)పి.సత్యన్నారాయణ,ప్రాజెక్ట్ ఆఫీసర్ (యుసిడి) విభాగం పి.వెంకట నారాయణ,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు,హౌసింగ్ డిపార్ట్‌మెంట్ పిడి రజనీకుమారి,హౌసింగ్ సిబ్బంది,విఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

# గుంటూరు నగరంలో సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుందాం

## - కౌన్సిల్ సమావేశంలో తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

**గుంటూరు తూర్పు, జూన్ 30 (ప్రభాతవార్త) :** నగరంలో సచివాలయ సిబ్బందిని సమన్వయ పరచుకోవడంలో అధికారులు విఫలమయ్యారు. కనీసం ఏ సిబ్బంది ఎక్కడెక్కడ పని చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితి. ఎవరిని ఎలాంటి విధులకు ఎలా విని యోగించుకోవాలో తెలి యడం లేదు. కనీసం సచివాలయాల్లో ఇంట ర్నెట్ కనెక్షన్ కూడా లేని దుస్థితి. గ్రీవెన్స్ చేయాలంటే ఇంటర్నెట్ లేదని చెబుతున్నారు. ఈ విషయం కార్పొరేషన్ అధికారులకు తెలుసా? లేదా? అని గుంటూరు



తూర్పు ఎమ్మెల్యే నసీర్ నిలదీశారు. సోమవారం గుంటూరు మున్సిపల్ కార్యాలయంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షతన నర్విమించిన కౌన్సిల్ సమావేశంలో పలు అంశాలపై ఎమ్మెల్యే నసీర్ అనేక ప్రశ్నలు సంధించారు. అధికారుల పనితీరు మార్చుకోవాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రజాప్రతి నిధులతో కలిసి పని చేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులను కలుపుకొని వెళ్ళాలన్నారు. ప్రభుత్వ పరంగా అమలు చేసే ఎలాంటి కార్యక్రమమైనా తమకు ముందుగా సమాచారం అందించాలని చెప్పారు. గుంటూరు నగరంలో మొక్కల పెంపకం విషయంపై నసీర్ మాట్లాడుతూ నగరానికి 10వేల మొక్కలు మంజూరు అయితే రెండు నెలల కాలంలో కేవలం 360మొక్కలు నాటడం ఏమిటని హార్టికల్చర్ అధికారులను ఎమ్మెల్యే నిలదీశారు. ఎక్కడెక్కడ ఎన్ని మొక్కలు పంపిణీ చేస్తున్నారు, ఇప్పటి వరకు వాటి సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు అనే అంశాలపై ప్రశ్నించారు. అనంతరం నగరంలో ప్రారంభించిన రోడ్ల నిర్మాణం విషయంలో ఇంజనీరింగ్ అధికారుల అలసత్వంపై నిలదీశారు. వెంటనే కొన్ని రోడ్లయినా పూర్తి చేసి ప్రజలకు అందించాలని సూచించారు. రోడ్ల నిర్మాణంలో అలసత్వం వహిస్తే వేరే మార్గాన్ని ఆలోచించాలని ఈ సందర్భంగా కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. వార్డుల్లో పర్యటిస్తున్నామని, ఈ సందర్భంగా పారిశుద్ధ్య సమస్య ఎక్కువగా కనిపిస్తోందని చెప్పారు. కార్పోరేషన్ అధికారులు, ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యం మెరుగుపై పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలను ఇబ్బంది పెడితే సహించవద్దు

## -సమ్మె చేసే వారిని ఉద్యోగాల నుంచి తొలగించండి - కమిషనర్‌కు మేయర్ ఆదేశాలు

**గుంటూరు తూర్పు, జూన్ 30 (ప్రభాతవార్త) :** నగర ప్రజలకు ఇబ్బందులు గురి చేసే విధంగా ఉద్యోగులు ప్రవర్తిస్తే ఎట్టి పరిస్థితిలో సహించవద్దని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అధికారులను ఆదేశించారు. సమ్మె చేసే వారిని వెంటనే ఉద్యోగాల నుంచి తొలగించాలని సోమవారం జరగిన కౌన్సిల్ సమావేశం వేదికగా నగర కమీషనర్ పులి శ్రీనివాసులను మేయర్ ఆదేశించారు. నగరంలో వీధిలైట్లు ఆపివేయటం, పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడం, త్రాగునీటి సరఫరా రాకుండా చేయడం వంటి కార్యకలాపాలకు సమ్మెను అడ్డంగా పెట్టుకుని ఆ ఉద్యోగుల తీరుపై కౌన్సిల్లో సభ్యులు గందరగోళం చేశారు. దీనిపై స్పందించిన మేయర్ రవీంద్ర ప్రజలు ఇలా ఇబ్బంది పడితే ఎలా అంటూ అధికారులను ప్రశ్నించారు. త్రాగునీటి సరఫరా లేదని, తాము సొంతగా లైట్లు వేస్తే సమ్మె చేసే ఉద్యోగులు వాటిని ఆపివేస్తున్నారని కౌన్సిల్లో కొంత మంది సభ్యులు ఫిర్యాదు చేశారు. వారి డిమాండ్ సాధన కోసం సమ్మె చేసుకోవటం వారి వ్యక్తిగత విషయమని, తాము వీధిలైట్లు వెలిగించినా ఆపటం ఏమిటని అనేక మంది కార్పోరేటర్ సభ్యులు సభ దృష్టికి తీసుకొని వచ్చారు. దీనిపై స్పందించిన మేయర్ ఈ మధ్య తాడేపల్లి కార్పోరేషన్‌లో సమ్మె చేసే ఉద్యోగులను తొలగించిన విషయం తెలుసుకదా వాళ్ళ ఇష్టం వచ్చినట్టు సమ్మె చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుంటే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని వెంటనే మొత్తం ఉద్యోగులను కమీషనర్ తొలగించాలని మేయర్ కౌన్సిల్ సమావేశం వేదికగా ఆదేశించారు.

# సాయిరాఘవ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

**తిరువూరు, జూన్ 30, ప్రభాతవార్త :** తిరువూరు సాయిరాఘవ కాలనీ 17వ వార్డు పరిధిలోని స్థానిక సాయి రాఘవ కాలనీ (టీచర్స్ కాలనీ)లో రహదార్లు సక్రమంగా లేవని డ్రైనేజి వ్యవస్థ లేకపోవడం వల్ల మురుగునీరు నిల్వ ఉంటుందని ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాలనీ వాసి రచయిత యం.రాంప్రదీప్ సోమవారం మునిసిపల్ కమీషనర్ కె.మనోజ మరియు మున్సిపల్ చైర్‌పర్సన్ కె.నిర్మలను కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రాలని అందచేశారు. ఆ సందర్భంగా తాము వార్డులో పర్యటించి, సమస్యలని అద్యయం చేసి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని వారు తెలిపారు.



01-07Pg5.qxd:01-07Pg5.qxd 01/01/01 8:17 AM Page 1



# 'సార్క్'కు ప్రత్యామ్నాయ కూటమి!

## చైనా, పాక్, బంగ్లాదేశ్ కొత్త కుట్ర?

**బీజింగ్,జూన్ 30:** దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంస్థ (సార్క్) కూటమిలో భారత్ పాటు భాగస్వాములుగా ఉన్న చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ క్రమంగా మన దేశానికి వ్యతిరేకంగా పావులు కదుపుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు వ్యతిరేకంగా కొత్త కూటమి ఏర్పాటు చేసే దిశగా అడుగులేస్తున్నాయి. ఇప్పటికే ఉన్న సార్క్ కూటమిలో పాకిస్థాన్ ఉందన్న కారణంతో భారత్ దూరంగా ఉంటున్న నేపథ్యంలో ఈ ప్రత్యామ్నాయ కూటమిని తెరపైకి తెస్తున్నాయి. సార్క్ కూటమిలో కీలక సభ్య దేశంగా ఉన్న భారత్ తీవ్రవాదానికి మద్దతిస్తుందన్న కారణంతో గతంలో 2016లో పాకిస్తాన్ ఆతిథ్యమిచ్చిన సమావేశానికి గైర్హాజరైంది.



అప్పటి నుంచి సార్క్ కూటమి కార్యకలాపాలు గాడితప్పాయి. తాజాగా అంతర్జాతీయంగా చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో చైనా, పాకిస్తాన్ ఉమ్మడిగా కుట్రకు తెరలేపాయి. ఇప్పటికే భారత్‌తో సంబంధాలు అంతంత మాత్రంగా ఉన్న బంగ్లాదేశ్‌ను కూడా కలుపుకుని సార్క్ స్థానంలో కొత్త కూటమి ఏర్పాటుకు అడుగులేస్తున్నాయి. ఈ కొత్తకూటమిలో భారత్‌తో పాటు దక్షిణాసియా దేశాలను సైతం ఆహ్వానించబోతున్నారు.

ఈ నెలలో చైనాలోని కున్మింగ్‌లో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలోని పాకిస్తాన్, ముహమ్మద్ యూనస్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ ప్రతినిధులు చైనా ఆధ్వర్యంలో జరిగిన త్రైపాక్షిక సమావేశంలోపాల్గొన్నారు. ఇందులో ఈ కొత్త కూటమిపై మూడు దేశాలూ చర్చించినట్లు పాక్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ కున్మింగ్‌లో జరిగిన సమావేశం ముఖ్యఉద్దేశం సార్క్‌లోని ఇతర దక్షిణాసియా దేశాలను కొత్త కూటమిలో చేరమని ఆహ్వానించడమే అని తెలుస్తోంది. ఈ ఏడాది మే నెలలో చైనా, పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ మధ్య త్రైపాక్షిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చైనా పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్‌ను విస్తరించడం, తాలిబాన్ పాలిత ఇస్లామిక్ ఎమిరేట్‌లో ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించడంపై చర్చించారు. అయితే ఈ కొత్త కూటమిపై ఇంకా క్లారిటీ రాకపోవడంతో దీనిపై స్పందించిన బంగ్లాదేశ్.. భారత్‌కు వ్యతిరేకంగా తాము ఎలాంటి కూటమి ఏర్పాటు చేయడం లేదని ప్రకటించింది.





# ట్రంప్, నెతన్యాహుపై ఇరాన్ 'ఫత్వా'!

## పశ్చాత్తాపపడేలా చేయాలి : ఇరాన్ పిలుపు

**టెహ్రాన్, జూన్ 30:** తమ దేశం విషయంలో అమెరికా, ఇజ్రాయెల్‌ల వైఖరిని ఇరాన్ తీవ్రంగా ఖండిస్తున్న విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులను లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పిస్తోంది. ఈ క్రమంలోనే ఇద్దరు నేతలపై ఇరాన్‌లో 'ఫత్వా' జారీ అయ్యింది. ట్రంప్, నెతన్యాహులను శత్రువులుగా పేర్కొన్న మత పెద్ద అయతుల్లా నాసర్ మకరెం షిరాజీ ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఇస్లామిక్ రిపబ్లిక్ నాయకత్వాన్ని బెదరిస్తున్న ఈ ఇరుదేశాల నాయకులను ఓడించాలని నాసర్ మకరెం షిరాజీ పిలుపునిచ్చారు. ఇస్లామిక్ దేశాలు వారికి సహకారం అందించడం నిషిద్ధమని, వారి తప్పులకు పశ్చాత్తాపపడేలా చేయడం అవసరమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఇస్లామిక్ రిపబ్లిక్ నాయకత్వానికి వ్యతిరేకులుగా పరిగణించిన వారికి ఇరాన్ చట్టాల ప్రకారం మరణశిక్ష కూడా విధించే అవకాశం ఉంటుంది.

**ఇరాన్‌పై అవలీలగా దాడి చేశాం : యుఎస్ అధ్యక్షుడు ట్రంప్**

ఇరాన్‌లోని మూడు అణు కేంద్రాలే లక్ష్యంగా అమెరికా ఇటీవల వాటిపై విరుచుకుపడింది. బి2 బాంబర్ల ద్వారా 'బంకర్ బస్టర్'లను జారవిడిచింది. ఈ దాడులపై ట్రంప్ మరోసారి స్పందించారు. తాము అత్యంత సులభంగా ఫోర్డో అణుస్థావరంపై దాడి చేసినట్లు తెలిపారు. బాంబులు ప్రవేశించకుండా ఇరాన్ ఏర్పాటు చేసుకున్నా.. ఆ ప్రయత్నాలేవీ ఫలించలేదని వ్యాఖ్యానించారు. ఫోర్డో సహా మూడు అణు కేంద్రాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని పునరుద్ఘాటించారు.

# సముద్రంలో ఆయిల్ టాంకర్‌లో మంటలు

## సిబ్బందిని కాపాడిన భారత్ నౌక

**మస్కట్, జూన్ 30:** గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో భారీ అగ్నిప్రమాదానికి గురైన ఒక ఆయిల్ ట్యాంకర్‌కు భారత నౌకాదళం అండగా నిలిచింది. ప్రమాదంలో చిక్కుకున్న 14 మంది భారతీయ సిబ్బందిని రక్షించేందుకు వేగంగా స్పందించి, సహాయక చర్యలు చేపట్టింది. విధి నిర్వహణలో ఉన్న ఐఎన్ఎస్ తబార్ నౌక, అత్యవసర సందేశం అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని తన కర్తవ్యాన్ని నిర్వర్తించింది. వివరాల్లోకి వెళ్తే, పలావు దేశానికి చెందిన 'ఎంటీ యీ చెంగ్ 6' అనే ఆయిల్ ట్యాంకర్, భారత్‌లోని కాండ్లా పోర్టు నుంచి ఒమన్‌లోని షినాస్‌కు బయలుదేరింది. ఈ నౌక గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో ప్రయాణిస్తుండగా దాని ఇంజిన్ రూమ్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ అగ్నిప్రమాదం కారణంగా నౌకలో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ట్యాంకర్ సముద్రంలో నిస్సహాయ స్థితిలో ఆగిపోయింది. ఆ సమయంలో ట్యాంకర్‌లో 14 మంది భారతీయ సిబ్బంది ఉన్నారు. ప్రమాదాన్ని గుర్తించిన వెంటనే ట్యాంకర్ సిబ్బంది అత్యవసర సహాయం కోసం సందేశాలు పంపారు. అదే సమయంలో గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో మిషన్‌లో ఉన్న భారత నౌకాదళానికి చెందిన స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తబార్‌కు ఈ సమాచారం అందింది. ప్రమాద తీవ్రతను గ్రహించిన ఐఎన్ఎస్ తబార్ సిబ్బంది ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆ ట్యాంకర్ ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. ఈ ఘటనపై భారత నౌకాదళం అధికారికంగా స్పందించింది. "గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో విధుల్లో ఉన్న మా ఐఎన్ఎస్ తబార్ నౌక నిన్న ఎంటీ యీ చెంగ్ 6 నుంచి వచ్చిన అత్యవసర సందేశానికి స్పందించింది" అని నేవీ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. భారత్ నుంచి ఒమన్ వెళ్తున్న ఈ నౌకలో 14 మంది భారత సిబ్బంది ఉన్నారని, ఇంజిన్ రూమ్‌లో మంటలు చెలరేగడంతో ప్రమాదం జరిగిందని వివరించింది. ఐఎన్ఎస్ తబార్ నౌక సకాలంలో స్పందించి, ట్యాంకర్‌లోని సిబ్బందికి అవసరమైన సహాయాన్ని అందించిందని వెల్లడించింది.

# 2029కి 52 మిలటరీ ఉపగ్రహాలు నింగిలోకి!



## రూ. 26వేల కోట్ల నిధులు కేటాయింపు

## ఇస్రో నుంచి 21 శాటిలైట్ల ప్రయోగం

**న్యూఢిల్లీ,జూన్ 30:** ఆపరేషన్ సిందూర్ తర్వాత సైనిక పరంగా మరింత బలోపేతమయ్యేందుకు భారత్ చర్యలు వేగవంతం చేసింది. పాకిస్థాన్, చైనాతో పాటు హిందూ మహాసముద్రంపై నిఘా కోసం 52 రక్షణ ఉపగ్రహాలను ప్రయోగించాలని నిర్ణయించింది. అందుకోసం ఇప్పటికే రూ.26 వేలకోట్లకు పైగా నిధులను కేంద్రం కేటాయించింది. 2029 నాటికి మిలిటరీ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు భవిష్యత్తులో నిఘా మిషన్ల కోసం భారత వైమానిక దళం హై ఆల్టిట్యూడ్ ప్లాట్‌ఫామ్ సిస్టమ్ విమానాలపై దృష్టి సారించింది. స్పేస్ బేస్డ్ సర్వైలెన్స్ అంటే అంతరిక్ష ఆధారిత నిఘా వ్యవస్థను అమలుచేస్తోంది. మూడోవిడత కార్యక్రమంలో భాగంగా ఇస్రో 21 ఉపగ్రహాలను ప్రయోగించనుంది. మిగిలిన 31 శాటిలైట్స్‌ను మూడు ప్రైవేటు సంస్థలు అభివృద్ధి చేసి కక్ష్యలోకి చేరనున్నాయి. తొలి ఉపగ్రహాన్ని 2026 ఏప్రిల్ నాటికి కక్ష్యలో ప్రవేశపెట్టాలని ఇస్రో భావిస్తోంది. 2029 చివరికల్లా మొత్తం మిలిటరీ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇస్రో స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ టెక్నాలజీని ప్రైవేటు సంస్థలకు బదలాయించి వాటికి ఈ ప్రాజెక్టులో కీలక భాగస్వామ్యం ఇవ్వనుంది.

అత్యవసర సమయాల్లో వేగంగా ఉపగ్రహాలను ప్రయోగించడానికి ఇది ఉపయోగపడనుంది. లోఎర్త్, జియో స్టేషనరీ కక్ష్యలపై దృష్టిపెట్టే ఈ ప్రాజెక్టును ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ పర్యవేక్షించనున్నారు. చైనా యాంటీ శాటిలైట్ సామర్థ్యానికి కౌంటర్‌గా కూడా ఈ ప్రాజెక్టు ఉపయోగపడనుంది. భారత్ వద్ద 9 నుంచి 11 మిలిటరీ ఉపగ్రహాలు ఉన్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఇస్రో వీటినుంచి డేటాను నిరంతరం సైనిక బలగాలకు చేరవేసింది. దీంతో పాటు ఓ కమర్షియల్ గ్లోబల్ ఆపరేటర్ నుంచి చిత్రాలను సేకరించింది. ఇస్రో సొంతంగా వాడే కార్టోశాట్ సిరీస్‌ను కూడా రంగంలోకి దించింది. వీటి సాయంతోనే మన దళాలు పక్కా ప్రణాళిక రచించి, పాక్ సైనిక స్థావరాలను దెబ్బతీశాయి. అమెరికాకు చెందిన మ్యాక్సర్, ఐరోపాకు చెందిన సెంటినెల్ సేవలు కూడా భారత్ వినియోగించుకుంది. వీటి ద్వారా రోజుకు ఒకసారి అయినా చిత్రాలను డౌన్‌లోడ్స్ చేసుకునే వీలు ఉంటుంది. ఇక మన దేశానికి చెందిన ఉపగ్రహాలు పీరియాడిక్ డేటాను 14 రోజులకు ఒకసారి తీసుకొనే అవకాశం ఉంది. తాజాగా చేపట్టిన ప్రాజెక్టు పూర్తయితే భారత్ చేతికి యుద్ధరంగంలోని రియల్‌టైమ్ డేటా వేగంగా అందే అవకాశం ఉంది.

# 8వతేదీ కంటే ముందే భారత్-యుఎస్ వాణిజ్య ఒప్పందంపై ప్రకటన!

**వాషింగ్టన్, జూన్ 30:** భారత్-అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు జోరుగా జరుగుతున్నాయి. దీనికి సంబంధించి కీలక ప్రకటన జూలై 8 కంటే ముందే వెలువడవచ్చని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఈ చర్చలకు నాయకత్వం వహిస్తున్న వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ వాషింగ్టన్‌లో ఉండి తుదివిడత సంప్రదింపులు మొదలు పెట్టారు. ఇప్పటికే ట్రంప్ విధించిన టారిఫ్‌ల సస్పెన్షన్ జూలై 9వ తేదీ వరకు మాత్రమే అమలులో ఉంటుంది. ఎందుకంటే ఈ డెడ్ లైన్‌ను మరోసారి పొడిగించే ఉద్దేశం తనకు లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫాక్స్ న్యూస్‌కు వెల్లడించారు. అతిత్వరలోనే టారిఫ్‌లు అమలులోకి వస్తాయని పేర్కొన్నారు.

ట్రంప్ భారత్ నుంచి చేసుకొనే దిగుమతులపై విధించిన 26 శాతం టారిఫ్‌లకు జూలై 9 వరకు అమలులోకి రావు. ఇక బేస్‌లైన్ టారిఫ్ 10 శాతం మాత్రమే వర్తిస్తోంది. ఈ చర్చల సందర్భంగా భారత్ 26 శాతం పన్నుపై రాయితీ కోరుతోంది. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంలో వ్యవసాయం, ఆటోమొబైల్, ఇండస్ట్రియల్ గూడ్స్, లేబర్ ఇంటిన్సివ్ ప్రొడక్టుల పైనే దృష్టి పెట్టింది.

ముఖ్యంగా వ్యవసాయం, డెయిరీ రంగాల విషయంలో ఇరు దేశాల మధ్య చిక్కుముడులు నెలకొన్నాయి. భారత్ పాల ఉత్పత్తుల మార్కెట్‌ను విదేశీ సంస్థల కోసం తెరిచేందుకు సిద్ధంగా లేదు. మరోవైపు అమెరికా కొన్ని రకాల ఇండస్ట్రియల్ గూడ్స్‌కు, ఆటో మొబైల్ రంగంలో కన్‌సెషన్లను కోరుతోంది. విద్యుత్ కార్లు, వైన్స్, పెట్రోకెమికల్స్, డెయిరీ, యాపిల్,నట్స్, జన్యుపరమైన మార్పులు చేసిన పంటల విషయంలో లబ్ధి కోసం పట్టుబడు తోంది. గత శుక్రవారం ట్రంప్ మాట్లాడుతూ భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకొనే అవకాశాలున్నాయని సూచన చేశారు. దీనిని అతిపెద్ద ఒప్పందంగా ఆయన పేర్కొన్నారు.

# ఇరాన్ అణు కార్యక్రమం నెలల్లోనే పుంజుకొంటుంది

## ఐఎఇఎ అధిపతి రఫేల్ గ్రాసీ

**టెహ్రాన్, జూన్ 30:** ఇరాన్ అణుకేంద్రాలపై అమెరికా చేసిన దాడుల ప్రభావం కొన్ని నెలలు మాత్రమే ఉంటుందని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఎఇఎ) అధిపతి రఫేల్ గ్రాసీ పేర్కొన్నారు. ఇరాన్ అణు కేంద్రాలను నుజ్జునుజ్జు చేశామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనకు ఇది పూర్తి భిన్నంగా ఉండటం గమనార్హం. టెహ్రాన్ మరికొన్ని నెలల్లోనే అణు ఇంధనం శుద్ధి చేయడాన్ని ప్రారంభించగలదని చెప్పారు. ఈ వ్యాఖ్యలు దాడి అనంతరం వెలువడిన పెంటగాన్ ఇంటెలిజెన్స్ నివేదికలో ఇచ్చిన సమాచారానికి మరింత బలం చేకూర్చేలా ఉన్నాయి.

'నిజం చెప్పాలంటే.. అంతా మాయమైపోయిందని, అక్కడేమీ మిగల్లేదని ఎవరూ చెప్పలేరు. అమెరికా రెండు అణుకేంద్రాలపై 14 బంకర్ బస్టర్ బాంబులు వేసింది. తీవ్రంగా నష్టం వాటిల్లింది. కానీ, పూర్తిగా నాశనమైపోలేదు' అని రాఫేల్ గ్రాసీ పేర్కొన్నారు. ఆ రెండు కేంద్రాల్లో 18,000 సెంట్రిఫ్యూజ్‌లు ఉండొచ్చని గతంలో ఆయన అంచనా వేశారు.

వాస్తవానికి డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ రిపోర్టు పూర్తిగా బంకర్ బస్టర్ బాంబులు ప్రయోగించిన యురేనియం శుద్ధి కేంద్రాలపైనే ఉంది. కానీ, ఇతర గ్రూపుల నుంచి వచ్చిన విశ్లేషణల ప్రకారం ఇరాన్‌కు అతిపెద్ద దెబ్బ ఇస్ఫహాన్‌లో తగిలింది. ఇక్కడ శుద్ధి చేసిన యురేనియంను లోహంగా మార్చేందుకు అవసరమైన ల్యాబ్ అమెరికా దాడిలో ధ్వంసమైంది. ఇది మాత్రం టెహ్రాన్‌కు ఇబ్బందికర విషయమే. అణ్వాయుధం తయారీకి ఈ ప్రక్రియ చాలా కీలకం.

మరోవైపు ఇరాన్ ఉన్నతాధికారుల సంభాషణలను ఇంటెలిజెన్స్ వర్గాలు పసిగట్టి విశ్లేషించాయి. వారు ఊహించినంత నష్టం వాటిల్లలేదని దీనిని బట్టి తెలుస్తోంది. ట్రంప్ మాత్రం ఇంటెలిజెన్స్ నివేదికలు లీక్ చేసిన సిఎన్ఎన్, న్యూయార్క్ టైమ్స్‌ను కోర్టుకు లాగాలని నిర్ణయించుకొన్నారు.

ఈ విషయాన్ని ఆయన ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో ప్రస్తావించారు. తాము చట్ట ప్రకారం వెళ్లి.. 'జాతీయ భద్రతకు సంబంధించిన సమాచారాన్ని వారికి ఎవరు ఇచ్చారో వెల్లడించాలి' అన కోరతామన్నారు. మరోవైపు ఇరాన్ దౌత్యవేత్త అమిర్ సయిదీ ఇరావని కూడా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ యురేనియం శుద్ధి ప్రక్రియ ఎప్పటికీ ఆగదని తేల్చి చెప్పారు. శాంతియుత అణుకార్యక్రమం కోసం ఇలా చేసే హక్కు ఇరాన్‌కు ఉందన్నారు.



# నిరసనకారుల కాళ్లు విరగ్గొట్టండి.. బహుమతి తీసుకోండి

## పోలీసులకు భద్రత విధుల్లో ఉన్న ఎసిపి విచిత్ర ఆదేశాలు

**పూరి,జూన్ 30:** ఒడిశాలో ఓ సీనియర్ పోలీసు అధికారి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ముఖ్యమంత్రి నివాసం వద్ద నిరసన తెలుపుతున్న ఆందోళనకారుల 'కాళ్లు విరగ్గొట్టండి' అంటూ ఆయన తన సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై విమర్శలు వెల్లువెత్తడంతో వెంటనే స్పందించి తన మాటలను వక్రీకరించారని ఆరోపించారు. ప్రసిద్ధ పూరీ జగన్నాథ రథయాత్ర సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ముగ్గురు భక్తులు మరణించిన ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. రద్దీని నియంత్రించడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ నివాసం సమీపంలో సోమవారం నిరసనకు దిగారు. ఈ క్రమంలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఓ పోలీసు అధికారి, ఆందోళనకారులను అడ్డుకోవాలని తన సిబ్బందికి సూచిస్తూ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. వైరల్ అయిన వీడియోలో భువనేశ్వర్ అదనపు పోలీసు కమిషనర్ (ఏసిపి) నరసింహ భోల్ తన సిబ్బందితో మాట్లాడుతూ.. "ఎవరైనా ఇక్కడికివస్తే కాళ్లు విరగ్గొట్టండి. వాళ్లను పట్టుకోవద్దు, కేవలం కాళ్లు విరగ్గొట్టండి చాలు. వారిని పట్టుకోవడానికి మేం కొంచెం దూరంలోఉన్నాం. ఎవరైతే కాలు విరగ్గొడతారో, నాదగ్గరికి వచ్చి బహుమతి తీసుకోండి" అని చెప్పడం స్పష్టంగా వినిపించింది. ఈ వీడియోపై దుమారం చెలరేగడంతో ఎసిపి నరసింహ భోల్ స్పందించారు. తన మాటలను వక్రీకరించారని, పూర్తి సందర్భాన్ని చూడకుండా కేవలం కొన్ని మాటలను మాత్రమే ప్రచారంచేస్తున్నారనిఆరోపించారు. "ప్రతిదానికీఒక సమయం, సందర్భం ఉంటాయి. ఆ వీడియోను పూర్తిగా చూస్తే, నిరసనకారులను అరెస్టు చేయడానికి మేం సిద్ధంగా ఉన్నామని సిబ్బందికి చెబుతున్న విషయం అర్థమవుతుంది" అని తెలిపారు.



# ప్రతిభావంతుల శాశ్వతనివాసంకోసం కెనడా కొత్తవీసాలు!

**టొరంటో,జూన్ 30:** విదేశాల నుంచి ప్రతిభావంతులు, ఆర్థిక వలసదారుల శాశ్వత నివాసానికి సంబంధించి కెనడా త్వరలోనే కొత్త విధానాన్ని అమలు చేయనుంది. ప్రస్తుతం కొనసాగుతున్న ఎకనామిక్ మొబిలిటీ పాత్‌వేస్ పైలట్‌లో మార్పులు చేస్తోంది. దీనివల్ల నైపుణ్యం కలిగిన శరణార్థులు, విదేశీ వ్యక్తులు కెనడాలో శాశ్వత నివాసం, ఉద్యోగ అవకాశాలు పొందనున్నారు. డిసెంబర్ 31తో ముగియబోతున్న పాత పాలసీకిముందే దీనిని ప్రారంభించనున్నట్లు పేర్కొంది. ఇఎంపీపీ విధానాన్ని 2018లో కెనడా ప్రారంభించింది. ఈ విధానం ద్వారా ఈ ఏడాది మార్చి వరకూ సుమారు 970 మంది శరణార్థులు కెనడాలో శాశ్వత నివాసం పొందారు. అమెరికా, కెనడాలు వీసాల విషయంలో కఠిన ఆంక్షలు, నిబంధనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇమ్మిగ్రేషన్. రెఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా (ఐఆర్‌సిసి) విధానంలో భాగంగా విదేశీ కార్మికులు, వ్యవసాయం, మత్స్య పరిశ్రమల్లో పని చేసే వారికి, విద్యార్థులకోసం ఉద్దేశించిన పిజి వర్క్ పర్మిట్, భాగస్వామి ఓపెన్ వర్క్ పర్మిట్ విధానంలోనూ మార్పులు చేయనున్నారు. విదేశీ కార్మికులు, అంతర్జాతీయ విద్యార్థుల జీవిత భాగస్వాములకుకూడా ఇది వర్తిస్తుంది. హెల్త్‌కేర్, ట్రేడ్ వర్కర్లు, ఎడ్యుకేషన్ వర్కర్లు, ఫ్రెంచ్ మాట్లాడే వ్యక్తులకు ఎక్స్‌ప్రెస్‌ఎంట్రీద్వారా ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. ఇప్పటికే కెనడాలో తాత్కాలిక నివాసితులుగా ఉన్నవారిలో కనీసం 40శాతం మందికి శాశ్వత నివాసం కల్పించనున్నారు. భారతీయులకు కెనడా, అమెరికా, యూకేలపై క్రమంగా మోజు తగ్గిపోవడం గనమార్హం. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో మొత్తం 8,34,010 తాత్కాలిక వీసా దరఖాస్తులను కెనడా ఆమోదించగా.. ఇందులో భారతీయులే అధికం 3,82,055 మందివరకూ ఉన్నారు.

# భోపాల్ గ్యాస్ వ్యర్థాల తొలగింపు ప్రక్రియ పూర్తి!

## భూగర్భగదుల్లో వ్యర్థాల అవశేషాలు నిక్షిప్తం

**భోపాల్,జూన్ 30:** దేశ చరిత్రలో పెను విషాదాన్ని మిగిల్చిన భోపాల్ గ్యాస్ దుర్ఘటనకు సంబంధించిన కీలక ప్రక్రియ ముగిసింది. యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీలో దశాబ్దాలుగా పేరుకుపోయిన అత్యంత ప్రమాదకరమైన 337 టన్నుల రసాయన వ్యర్థాలను అధికారులు ఎట్టకేలకు పూర్తిగా దహనం చేశారు. దాదాపు 40 ఏళ్ల తర్వాత ఈ వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్మూలించడంతో ఆ దుర్ఘటనకు సంబంధించిన ఒక అధ్యాయం ముగిసినట్టయింది. మధ్యప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారి ద్వివేది ఈ వివరాలను వెల్లడించారు. పీథాంపుర్‌లోని ప్రత్యేక డిస్పోజల్ ప్లాంట్‌లో ఈ వ్యర్థాల దహన ప్రక్రియను పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. మార్చి 27న హైకోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డుల సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో ఈ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా చేపట్టారు. తొలుత ప్రయోగాత్మకంగా 30 టన్నుల వ్యర్థాలను కాల్చివేయగా, మిగిలిన 307 టన్నులను మే 5 నుంచి జూన్ 30 మధ్య విజయవంతంగా దహనం చేశారు. ఈ వ్యర్థాలను దహనం చేస్తున్న సమయంలో పర్యావరణంపై ఎలాంటి ప్రభావం పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని ద్వివేది స్పష్టం చేశారు.

ప్లాంట్ నుంచి వెలువడే వాయువులను, కాలుష్య కణాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ యంత్రాంగం ద్వారా పర్యవేక్షించారు. పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి హాని కలగకుండా నిర్దేశిత పరిమాణంలోనే వ్యర్థాలను కాల్చివేసినట్లు ఆయన వివరించారు. దహన ప్రక్రియ పూర్తయ్యాక మిగిలిపోయిన బూడిద, ఇతర అవశేషాలను అత్యంత సురక్షితంగా ప్రత్యేక సంచుల్లో ప్యాక్ చేసి, లీకులు లేని కంటైనర్లలో ప్లాంట్‌లోని స్టోరేజ్ షెడ్‌కు తరలించారు. ఈ బూడిదను భూమిలో శాశ్వతంగా పాతిపెట్టేందుకు ప్రత్యేకంగా ల్యాండ్‌ఫిల్ సెల్స్ అంటే భూగర్భ గదులు నిర్మిస్తున్నామని, నవంబర్ నాటికి నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. ప్రణాళిక ప్రకారం అంతా సజావుగా సాగితే ఈ ఏడాది డిసెంబర్ నాటికి బూడిదను



శుద్ధి చేసి ఈ సెల్స్‌లో పాతిపెట్టే ప్రక్రియ కూడా పూర్తవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

1984 డిసెంబర్ 2వ తేదీ అర్ధరాత్రి భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ కర్మాగారం నుంచి మిథైల్ ఐసోసైనేట్ విషవాయువు లీకైన ఘటనలో అధికారిక లెక్కల ప్రకారం 3,787 మంది మరణించగా, 5 లక్షల మందికి పైగా తీవ్రంగా ప్రభావితమయ్యారు. ఆ దుర్ఘటన ప్రభావం తరతరాలపై పడిందని, బాధితులు నేటికీ ఆరోగ్య సమస్యలతో పోరాడుతూనే ఉన్నారని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

# ఐదేళ్లు సిద్ధరామయ్యే సిఎం

## మేం కలిసేఉన్నాం.. ఉంటాం..: డికె



**బెంగళూరు,జూన్ 30:** కర్ణాటక కాంగ్రెస్‌లో విభేదాలున్నాయనే ఊహాగానాలను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కొట్టివేశారు. ఐదేళ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వం స్థిరంగా ఉంటుందని స్పష్టం చేశారు. చేతులుకలిపి ఐక్యతను చాటుకున్నారు. సోమవారంనాడు మీడియా సమావేశంలో ఇద్దరు నేతలూ కలిసి పాల్గొన్నారు.మా ప్రభుత్వం ఐదేళ్ల పాటు దృఢంగా ఉంటుంది. మేము కలిసికట్టుగా ఉన్నాం, కలిసే పనిచేస్తామని సిద్ధరామయ్య తెలిపారు. కర్ణాటక కాంగ్రెస్‌లో గొడవలు ఉన్నాయనే ఊహాగానాలను ఆయన కొట్టివేశారు. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, రాష్ట్ర ఇన్‌చార్జి రణ్‌దీప్ సూర్జేవాలా రాష్ట్రానికి రావడంపై మాట్లాడుతూ, పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడంపై సూర్జేవాలా దృష్టి సారించనున్నట్టు చెప్పారు. పార్టీని పటిష్టం చేయడం కోసం వచ్చారని, ఆయన పని ఆయన చేస్తారని తెలిపారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలను సిద్ధరామయ్య ప్రారంభించడం లేదంటూ విపక్ష నేత ఆర్.అశోక చేసిన వ్యాఖ్యలపై సిద్ధరామయ్య మండిపడ్డారు. బీజేపీ ఒక అబద్ధాల పుట్ట. వాళ్ల పని అదే. డీకే శివకుమార్, నేనూ కలిసే ఉన్నాం. ఈ ప్రభుత్వం ఐదేళ్లు స్థిరంగా పనిచేస్తుంది. బీజేపీ కామెంట్లను మేము పట్టించుకునేది లేదని అన్నారు. ముఖ్యమంత్రి పదవిఅనేది అధిష్ఠానం నిర్ణయం పైనే ఆధారపడి ఉంటుందని కాంగ్రెస్‌అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే సోమవారం మీడియాతో చెప్పారు.

# భారత్ నిషేధంతో పాక్‌నుంచి నిలిచిపోయిన ఎగుమతులు

## ఓడరేవుల్లో లంగరువేసుకున్న భారీ నౌకలు

**కరాచి,జూన్ 30:** పహల్గాంలో ఉగ్రవాద దాడి తర్వాత.. మే 2 నుంచి పాకిస్థాన్‌పై భారత్ విధించిన నిషేధంతో ఆ దేశ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమవుతోంది. ముఖ్యంగా భారతీయ పోర్టుల్లో పాకిస్థానీ నౌకలను నిషేధించడంతో ఎగుమతులు, దిగుమతులపై తీవ్ర ప్రభావం పడుతోంది. పాకిస్థాన్ నౌకలపై నిషేధం విధించడంతో భారీ నౌకలు కరాచీ పోర్టులోనే లంగర్ వేసుకుని, ఎదురు చూస్తున్నాయి. భారత పోర్టుల్లో అనుమతి లేకపోవడంతో సాధారణంగా జరగాల్సిన ఎగుమతులు, దిగుమతుల్లో 30 నుంచి 50 రోజుల మేర ఆలస్యం నమోదవుతోంది. భారత్ విధించిన నిషేధంతో లాజిస్టిక్స్ ధరలు గణనీయంగా పెరిగాయని, బీమా ఖర్చులు కూడా పెరిగినట్లు కరాచీకి చెందిన వస్త్రాల ఎగుమతిదారుడు ఆమిర్ అజీజ్ వాపోయారు. ఫలితంగా షిప్పింగ్ ధరలు భారీగా పెరిగినట్లు వివరించారు. భారత్ నిషేధం విధించిన తొలినాళ్లలో పాకిస్థాన్ దొడ్డిదారిలో సరుకు రవాణాకు సిద్ధమైంది. భారత్‌లో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) ఈ తరహా దిగుమతులు, ఎగుమతులపై కొరడా ఝుళిపిస్తోంది. యూఏఈ, శ్రీలంక, సింగపూర్ వంటి దేశాల నుంచి పాక్ పంపే సరుకులను కట్టడి చేసేందుకు 'ఆపరేషన్ డీప్ మానిఫెస్ట్'ను ప్రారంభించింది. ఫలితంగా 39 కంటైనర్లలోని రూ.9 కోట్ల విలువ చేసే 1,100 మెట్రిక్ టన్నుల సరుకు సీజ్ అయ్యింది. పాక్ ఈ సరుకును యూఏఈలో తయారైనట్లు తప్పుడు రికార్డులను సృష్టించి, భారత్‌కు తరలించింది. కరాచీ, కాసీం పోర్టులు పాక్ ఎగుమతులు, దిగుమతులకు అత్యంత కీలకం. వీటికి దన్నుగా గ్వాదర్ పోర్టు ఉంది. ఈ మూడు పోర్టులు ఆ దేశ జీడీపీకి 0.5 వాటాను అందజేస్తున్నాయి.

## తిరుమల సమాచారం

# వేడుకగా బోగ్‌బండార్

### హథీరాంజీమఠంలో బంజారాలతో టిటిడి ఛైర్మన్ నాయుడు



**తిరుమల,జూన్30ప్రభాతవార్తప్రతినిధి:** బంజారాల కులగురువు హథీరాంబావాజీ 596వ జయంతి వేడుకలను తిరుమలలోని హథీరాంజీమఠంలో 'బోగ్‌బండార్' పేరుతో వేడుకగా జరుపుకున్నారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో తెలుగురాష్ట్రాల నుండి తరలివచ్చిన బంజారాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంజారాల మహంత్ రమేశ్ గిరిజీ మహరాజ్ మాట్లాడుతూ హథీరాం బావాజీ జయంతి వేడుకలను మఠంలో నిర్వహించామని, ఇందులో బంజారాలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని కోరారు. ఈ సందర్భంగా బంజారాలు సంప్రదాయం ప్రకారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బంజారాలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం అనంతరం వేణుగోపాలస్వామి ఆలయాన్ని సందర్శించి బంజారాలు మొక్కులు తీర్చుకున్నారు.

### మొదటిఘాట్‌లో ప్రమాదం

## నెల్లూరు భక్తురాలు అరీఫా మృతి , మరో ఇద్దరికి గాయాలు

**తిరుమల,జూన్30ప్రభాతవార్తప్రతినిధి:** కుటుంబంతో కలసి ద్విచక్రవాహనంపై వచ్చి తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణం లో ఘాట్‌దిగుతుండగా ఆర్టీసి బస్సు ఢీకొనడంతో భక్తురాలు సయ్యద్‌ఆరీఫా(41)మృతి చెందింది. భర్త సురేష్, కుమారుడు షామీర్ గాయాలకు గురయ్యారు. నెల్లూరు బుచ్చిరెడ్డి పాళెంకు చెందిన సురేష్ కుటుంబంతో కలసి ద్విచక్రవాహనంపై సోమవారం ఉదయం తిరుమలకు వచ్చి, శ్రీవారిని దర్శనం చేసుకున్నారు. తిరుగుప్రయాణంలో మొదటిఘాట్‌లో (డౌన్ రోడ్డులో)24వ మలుపువద్ద వీరిని ఆర్టీసిబస్సు ఢీకొంది. క్రిందపడిన ఆరీఫా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ద్విచక్రవాహనం నడుపుతున్న సురేష్, మధ్య కూర్చున్న షామీర్ క్షతగాత్రులయ్యారు.ప్రమాదం జరిగిన వెంటనే విజిలెన్స్ సిబ్బంది, తిరుమల ట్రాఫిక్ పోలీసులు సంఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తిరుపతి రూయాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



## వృత్తినైపుణ్య శ్రీవారి సేవకులకోసం నెలరోజుల్లో ప్రత్యేక అప్లికేషన్

### టిటిడిలో పది విభాగాల్లో సేవలకు ఆహ్వానం

**తిరుమల,జూన్ 30ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వ రస్వామి దర్శనానికి రోజుకు సరాసరి 90వేలమంది వరకు భక్తులు తిరుమలకు వస్తుండటంతో వారికి ఇతోధికంగా సేవలందించేందుకు ఇప్పటికే ఉన్న శ్రీవారిసేవకుల స్థానంలో నిష్ణాతులైన వారిని రంగంలోకి దించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం కార్యాచరణ సిద్దంచేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలకనుగుణంగా శ్రీవారిసేవను మరింత విస్తృతం చేసేదిశగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వృత్తినిపుణుల సేవలను వినియోగించుకుని భక్తులకు మరింత మెరుగైన సేవలందించేలా కృషి చేస్తున్నామని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి వెల్లడించారు. వృత్తినిపుణులను శ్రీవారిసేవద్వారా టిటిడిలో ముఖ్యమైన 10 విభాగాల్లో వారి సేవలను ఉపయోగించుకునేందుకు కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం తిరుమల అన్నమయ్య భవనంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, స్విమన్స డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వి రవికుమార్, బర్డ్ డైరెక్టర్ డాక్టర్ గూడూరు జగదీశ్, టిటిడి సిఇ సత్యనారాయణ, ఐటి జిఎం శేషారెడ్డి, సిఎంఒ నర్మద, డిప్యూటీ ఇఒలు లోకనాథం, రాజేంద్ర, డిఇఒ వెంకటసునీల్, ఎస్వీ గోశాల డైరెక్టర్ శ్రీనివాసులు, హెచ్‌డిపిపి కార్యదర్శి రఘునాథ్ తదితరులతో అదనపు ఇఒ వెంకయ్యచౌదరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తినైపుణ్య శ్రీవారిసేవకుల కోసం నెలరోజుల్లో ప్రత్యేక అప్లికేషన్ రూపొందిస్తామన్నారు. సాంకేతిక విభాగాల్లోనూ సాంకేతిక నిపుణుల సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించామన్నారు. ప్రతి విభాగంలో అవసరాన్ని బట్టి శ్రీవారి సేవద్వారా వృత్తినైపుణ్య సేవకుల సేవలను వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న వృత్తినైపుణ్యుల సేవలను వినియోగించుకుని భక్తులకు మరింత నాణ్యంగా మెరుగైన సేవలందించేలా కృషి చేస్తామన్నారు. ప్రయోగాత్మంగా ఈ విధానాన్ని ప్రవేశపెట్టి తరువాత పూర్తిస్థాయిలో అమలుచేస్తామని చౌదరి తెలిపారు. త్వరలోనే దీనిపై నిర్దిష్టవిధానాన్ని రూపొందించి సుస్థిర వ్యవస్థగా మార్చేందుకు కృషి చేయాలని ఆయన సంబంధిత అధికారులకు తెలిపారు. మారుతున్న కాలం, అవసరాలు ,అత్యవసర సమయాల్లో కూడా సేవలందించేలా శ్రీవారి సేవకులకు శిక్షణ ఇచ్చి అత్యుత్తమ సేవకులుగా తీర్చిదిద్దాలని అదనపు ఇఒ తెలిపారు.

## టిటిడి వినూత్న ఆలోచన ఆచరణ సాధ్యమేనా!?

### ఉచిత బీమా సౌకర్యం అమలుకు ముందే తర్జనభర్జనలు



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** తిరుమలకు వస్తున్న లక్షమందివరకు భక్తులకు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని టిటిడి తీసుకుంటున్న వినూత్న ఆలోచన ఆచరణ సాధ్యమవుతుందా?అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ ఆలోచన టిటిడిపై ఆర్థికంగా భారంపడుతుందనేది టిటిడి ఉద్యోగవర్గాల్లోనూ చర్చగా మారింది. సాధారణ సర్వదర్శనంలోనూ నేరుగా కొండకు చేరుకున్న భక్తులు కిలోమీటర్ల దూరం విస్తరించిన ఆలయం వెలుపల క్యూలైన్లనుండి వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్ మీదుగా శ్రీవారి దర్శనానికి వచ్చే వారి పరిస్థితి ఏంటనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా భక్తులు కాలినడకన వచ్చే సమయంలో వన్యప్రాణులు దాడిచేసినా, మరణించినా, రద్దీ సమయంలో క్యూలైన్లలో తొక్కిసలాటలు వంటి కారణాలతో ప్రమాదాలు జరిగితే బాధితులకు పరిహారం చెల్లించేవిధంగా పథకం రచిస్తున్నారు. అయితే అసలు ఏ హిందూ ఆలయంలో అమలులో లేని వినూత్న ఆలోచన టిటిడి పాలకమండలి చర్చించి బీమా ప్రతిపాదనపై తర్జనభర్జనలు మొదలయ్యాయి. ఈ ప్రతిపాదనలపై కూడా భక్తుల నుండి ,మేధావుల నుండి అభిప్రాయసేకరణ మొదలైంది. అమలుచేసే విషయంలో మాత్రం అనేక సందిగ్ధతలు, సంశయాలు వినిపిస్తున్నాయి. దేశవిదేశాల నుండి తిరుమలకు రోజుకు లక్షమంది వరకు భక్తులు వస్తున్నారు. సాధారణరోజుల్లోనే 80వేలమంది వరకు భక్తులకు దర్శనం చేయిస్తుంటే వారాంతంలో 90వేలమందివరకు దర్శనం చేసుకోగలుగుతున్నారు. ఈ నేపథ్యంలో భక్తులు దర్శనం టిక్కెట్, టైమ్‌స్లాట్ టోకెన్ లేని వారికి బీమా ఎలా అమలుచేయాలనేది అనుమానంగా మారింది. తిరుమలకు వచ్చిన భక్తులు అనారోగ్యంబారిన పడినా, గాయపడినా ఇప్పటివరకు టిటిడినే సొంత ఖర్చులతో వైద్యసదుపాయాలు అందిస్తుంది. ఎవరైనా కాలినడకమార్గాల్లో, ప్రమాదాల కారణంగా మరణిస్తే ఆర్థికసాయం అందిస్తుంది. తిరుమలకు వస్తున్న భక్తులు ఘాట్‌రోడ్లపైగానీ, కాలినడక మార్గాల్లో చేరుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఘాట్‌రోడ్లపై ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతే, నడకమార్గాల్లో వన్యప్రాణుల వల్ల ప్రమాదాలు జరిగి మరణిస్తే ఆ భక్తులకు ఆర్థికసాయం టిటిడి అందిస్తున్న విషయం తెలిసిందే. ఇదేగాక సాధారణంగానే ప్రతి ఒక్కరూ ఏదో ఒక రూపంలో బీమా సౌకర్యం కలిగిఉంటారు. అయినా వారికి ఇతోధికంగా ఆర్థికసాయం అందించాల్సి ఉందనే అభిప్రాయాలను ప్రస్తుత పాలకమండలి గట్టిగానే నిర్ణయించింది. ఇందుకు బీమా సదుపాయం కల్పించడమే ప్రధానమని ఆలోచనకు వచ్చేసింది. రోజుకు 80వేలమంది వరకు భక్తులు తిరుమలకు వస్తున్నారు. వీరందరికీ బీమా సదుపాయం కల్పించడం సాధ్యమేనా అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.భక్తులకు బీమా సంస్థలకు టిటిడి నే ఏ విధంగా ప్రీమియం చెల్లిస్తుందనేది కూడా సమాధానాలు లేని ప్రశ్నలే. భక్తుల వివరాలను వారి కుటుంబంలోని నామినీతోసహా సేకరించాల్సిన అవసరం ఉంది. అసలు ఏ ప్రాతిపదికన టిటిడి భక్తులకు బీమా సదుపాయం కల్పిస్తుందనేది ఇప్పుడు సర్వత్రా వ్యక్తమవుతున్న అనుమానాలు. ఇప్పటికే తిరుమలకు వస్తున్న 80వేలమంది భక్తుల్లో ఆన్‌లైన్‌లో పలు రకాల దర్శనాలు 25-30వేల మంది భక్తులు, ఆఫ్‌లైన్‌లో 20వేలమంది, ఆర్జితసేవలు ఐదారువేలమంది, ఇదేగాక పలురకాల సిఫార్సులేఖల ద్వారా వస్తున్న భక్తులు మరో ఐదువేలమంది వరకు ఉంటున్నారు. వీరందరికీ ఎలా వర్తింపజేస్తారనేది ఇప్పుడు సందిగ్ధం. అయితే ఇప్పుడు ఈ బీమా సదుపాయం మాట పాలకమండలి బ్రాండ్‌కోసం ప్రాకు లాటనా?లేక భక్తులకు అమలుచేసేదిశగా ఆర్థికభారమేనా అనేది ముందు ముందు తేలిపోనుంది.

# ఎపిలో రానున్న సాంకేతిక అద్భుతాలు

### కేంద్ర శాస్త్ర, సాంకేతికశాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్



**విజయవాడ,జూన్ 30,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలోనే సాంకేతికరంగంలో అద్భుతాలు ఏపీలో రానున్నాయని కేంద్రశాస్త్ర సాంకేతిక శాఖ సహాయమంత్రి జితేంద్ర సింగ్ అన్నారు. అమరావతిలో ప్రతిష్ఠాత్మకమైన క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుకు నడుంబిగించిన సీఎం చంద్రబాబుకు, ఏపీ ప్రభుత్వానికి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ, ఆంధ్రప్రదేశ్ మధ్య కుదిరినది కేవలం సాంకేతిక సయోధ్య మాత్రమే కాదు. భావి భారత సాంకేతిక సారథ్యానికి వ్యూహాత్మక పెట్టుబడిగా భావించాలన్నారు. సోమవారం విజయవాడలో జరిగిన క్వాంటం వ్యాలీ నేషనల్ వర్క్ షాప్‌కు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జితేంద్ర సింగ్ హాజరయ్యారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని 4 ప్రాంతాల్లో క్వాంటం పరిశోధనా కేంద్రాలను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. 17 రాష్ట్రాల్లో 152 సంస్థలు ఈ సాంకేతికతపై పనిచేస్తున్నాయని అన్నారు. ఏఐసీటీఈ ద్వారా బీటెక్ క్వాంటం టెక్నాలజీలో అందిస్తున్నట్లు వివరించారు. నేషనల్ క్వాంటం మిషన్ డిజిటల్, మేక్ ఇన్ ఇండియా లక్ష్యాలను పర్యవేక్షిస్తోందని చెప్పారు. టెక్నాలజీ ఇండియాను సాధించటంలో క్వాంటం వ్యాలీ కూడా భాగస్వామి అవుతుందని స్పష్టం చేశారు. 9 జాతీయ మిషన్లలో క్వాంటం టెక్నాలజీ విప్లవం ఒకటని అందుకే నేషనల్ క్వాంటం మిషన్ ఏర్పాటు అయిందన్నారు.

### రేపటి నుంచి

## కన్యాకుమారికి ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే, జూన్ 30,ప్రభాతవార్త:** ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రైల్వే శాఖ ఆంధ్రప్రదేశ్ మీదుగా కన్యాకుమారికు ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. హైదరాబాద్ నుంచి కన్యాకుమారి వెళ్లే నెంబర్ 07230 ఎక్స్‌ప్రెస్ జూలై 2,9,16,23వ తేదీల్లో ప్రతి బుధవారం సాయంత్రం 5.20గంటలకు హైదరాబాద్ నుండి బయలుదేరి శుక్రవారం తెల్లవారుజామున 2.30గంటలకు కన్యాకుమారి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కన్యాకుమారి నుంచి హైదరాబాద్ వెళ్లే నెంబర్ 07229 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ జూలై 4,11,18,25వ తేదీల్లో ప్రతి శుక్రవారం తెల్లవారుజామున 5.15గంటలకు కన్యాకుమారి నుంచి బయలుదేరి శనివారం మధ్యాహ్నం 2.30గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్లు మార్గమధ్యంలో తెలుగు రాష్ట్రాల్లో సికింద్రాబాద్, చర్లపల్లి, నల్గొండ,మిర్యాలగూడ, నడికూడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, తిరుపతి, పాకాల, చిత్తూరుతో పాటు తమిళనాడులోని ముఖ్యమైన స్టేషన్లలో నిలుస్తాయి.

## పంచాయతీల్లోనూ స్మార్ట్ సేవలు

**విజయవాడ,జూన్30,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామ పంచాయతీల్లోనూ స్మార్ట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. పంచాయతీల్లో వివిధ సేవలకు సంబంధించిన లింక్‌ను వాట్సప్ మన మిత్ర సేవలకు ప్రభుత్వం అనుసంధానిస్తోంది. ఈ నేపథ్యంలో ఇక నుంచి స్మార్ట్‌ఫోన్ నుంచే ఆస్తి పన్ను, తాగునీటి కుళాయి కనెక్షన్లపై రుసుములు, వ్యాపార లైసెన్స్ ఫీజులను చెల్లించొచ్చు. రాష్ట్రంలో 13,326 పంచాయతీల్లో ఉన్న ఇళ్లు, భవన యజమానుల్లో చాలా మంది రాష్ట్రం బయటే ఉంటున్నారని అధికారులు అంచనా వేస్తున్నారు. వాట్సప్ సేవల చెల్లింపులతో పంచాయతీల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ అంచనాల ప్రకారం పంచాయతీల ద్వారా ఏటా రూ.822.46 కోట్ల ఆస్తి పన్ను వసూలు కావాలి. కొందరు కార్యదర్శులు, సిబ్బంది ప్రజల చేతిలో రశీదులు పెడుతున్నా చెల్లింపుల వివరాలు రికార్డుల్లో నమోదు చేయట్లేదు. ఇలాంటి అక్రమాల నియంత్రణకు ప్రభుత్వం గత ఏడాది 'స్వర్ణ పంచాయతీ పోర్టల్' ప్రారంభించింది. డైనమిక్ సిస్టంలో చెల్లింపులకు క్యూఆర్ కోడ్ జనరేట్ చేసి స్మార్ట్ ఫోన్ల ద్వారా స్కాన్ చేయించి చెల్లింపులు చేయిస్తున్నారు. ఈ విధానంతో 2024-25లో ఆస్తి పన్నువసూళ్లు రూ.486.10 కోట్లకు పెరిగాయి.

## అరోఇన్‌ఫ్రా పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్ ప్రాజెక్టు రద్దు

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

**విజయవాడ జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలోని నంద్యాల జిల్లాల్లో అరోఇన్‌ఫ్రా పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్ ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం రద్దు చేసింది. 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టును నిర్మాణ కేటాయింపులను రద్దు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. డీపీఆర్ పూర్తి చేయడంలో జాప్యం దృష్ట్యా కేటాయింపులు రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు సత్యసాయి జిల్లాల్లో 83 మెగావాట్ల విండ్ సోలార్ హైబ్రిడ్ పవర్ ప్రాజెక్టుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. కనగానపల్లి మండలంలో బ్రెరీ అలైన్ సంస్థ ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ కింద ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటించింది. అంతేకాకుండా అదానీ గ్రూప్‌నకు చెందిన 2 హైడ్రో పవన్ ప్రాజెక్టుల సామర్థ్యం పెంపునకు ఏపీ ప్రభుత్వం అనుమతిచ్చింది. అల్లూరి జిల్లా పెదకోటలోని అదానీ ఎనర్జీ-4 అభ్యర్థన మేరకు ప్రాజెక్టు సామర్థ్యాన్ని వెయ్యి నుంచి 1800 మెగావాట్లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విజయగనం అనకాపల్లి జిల్లాల పరిధిలోని రైవాడ పంప్డ్ స్టోరేజ్ సామర్థ్యాన్ని పెంచింది. అదానీ హైడ్రో ఎనర్జ వన్ లిమిటెడ్ అభ్యర్థనను కూడా ప్రభుత్వం ఆమోదించింది. కడప జిల్లా గండికోట అదానీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు సామర్థ్యాన్ని పెంచింది.దీని సామర్థ్యాన్ని కూడా వెయ్యి నుంచి 1800 మెగావాట్లకు పెంచేందుకు అనుమతిచ్చింది. అదానీ రెన్యూవబుల్ ఎనర్జీ 51 ప్రతిపాదనను ఇంధన శాఖ ఆమోదించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

# సిట్ అదుపులో చెవిరెడ్డి పిఎలు

**విజయవాడ,జూలై30,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మద్యం కుంభకోణం కేసులో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పీఏలు బాలాజీ, నవీన్‌ను సిట్ బృందం అదుపులోకి తీసుకుంది. ఎన్నికల సమయంలో తెలంగాణ నుంచి ఏపీ సరిహద్దుల్లోకి వస్తున్న రూ.8 కోట్ల 20 లక్షలసొమ్మును బాలాజీ తీసుకొచ్చినట్లు అభియోగాలు ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా శివారుల్లో పట్టుబడిన భారీ సొమ్ము ఉన్న వాహనాన్ని ఎన్నికల సంఘం స్వాధీనం చేసుకుంది. ఈ సొమ్ము ఎవ్వరిదనే అంశంలో అనుమానాలు వచ్చినప్పటికి సిట్ విచారణలో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. మద్యం కుంభకోణం పరిధిలో చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఈ సొమ్మును తరలిస్తున్నట్లు గుర్తించింది. వీటిని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పీఏలు బాలాజీ, నవీన్‌ను తరలిస్తున్నట్లు ఆధారాలతో సహాతెలుసుకుంది. వారి గురించి గాలిస్తుండగా, సిట్ బృందం వెంటాడుతుందనే భయంతో వీరిద్దరూ ఇండోర్ పారిపోయారు. ఇండోర్ నుంచి ఏపీలో వైకాంగ్రెస్‌పార్టీ నేతలకు ఫోన్ చేస్తుండడంతో లోకేషన్ ఆధారంగా ఇండోర్‌కు వెళ్లాయి సిట్ బృందాలు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ఇద్దరిని సిట్ బృందం ఇండోర్‌లో అదుపులోకి తీసుకుంది. గతంలో బాలాజీని పోలీసులు అరెస్టు చేశారని కోర్టులో వైసీపీ నేతలు హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. తమ అదుపులో లేరని అప్పట్లోనే సిట్ బృందం కోర్టుకు తెలిపింది. ఇక అప్పటి నుంచి బాలాజీ, నవీన్ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసిన సిట్ ఎట్టకేలకు ఇండోర్‌లో అదుపులోకి తీసుకున్నారు.

## వాయిదా పడిన డిఎస్సీ పరీక్షలు నేటి నుంచి


**విజయవాడ,జూన్30,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా మెగా డీఎస్సీ ఆన్‌లైన్ రాత పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలు ఈ నెల 6వ తేదీ నుంచి మొత్తం 154 పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్నాయి. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 30వ తేదీ నాటికి ఈ పరీక్షలు పూర్తి కావల్సి ఉంది. అయితే జూన్ 20,21 తేదీల్లో నిర్వహించవల్సిన పరీక్షలను అంతరాజతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం వాయిదావేసారు. ఈ పరీక్షలను జులై 1, 2వ తేదీల్లో నిర్వహించనున్నట్లు విద్యా శాఖ అప్పట్లో తెలిపింది. దీంతో మారిన ఈ రెండు రోజుల డీఎస్సీ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను తాజాగా విడుదల చేసింది. ఈ నేపథ్యంలో జూన్ 20, 21 తేదీల్లో జరగాల్సిన పరీక్షల తేదీలతోపాటు, పరీక్ష కేంద్రాలలోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ రెండు తేదీల్లో పరీక్షలు ఉన్న విద్యార్థులు మారిన కొత్త హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని అభ్యర్థులకు సూచించింది. ఈ మేరకు పరీక్షా కేంద్రాలు, పరీక్ష తేదీలు మార్చిన హాల్ టికెట్లు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

## జాతీయ క్రీడాపోటీల విజేతలకు ప్రోత్సాహకాలు

**విజయవాడ జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీకి చెందిన జాతీయ క్రీడాపోటీల విజేతలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఇటీవల ఉత్తరాఖండ్‌లో జరిగిన 38 వ జాతీయ పోటీల్లో గెలుపొందిన 15 మంది క్రీడాకారులకు స్పోర్ట్స్ అథారిటీ, ప్రభుత్వం ప్రోత్సాహకాలు విడుదల చేసింది. మొత్తం రూ.91.75 లక్షలు విడుదల చేసింది. ఈ అంశాన్ని క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ మీడియా సమావేశంలో ప్రస్తావిసూయ్త క్రీడాకారులకు ప్రభుత్వం సంపూర్ణ మద్దతును ఇస్తుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి గుర్తింపును తీసుకుని వచ్చిన టెన్నిస్ ఆటగాడు మైనేని సాకేత్ ప్రభుత్వంలో డిప్యూటీ కలెక్టరు ఉద్యోగం ఇచ్చిన విషయం గుర్తు చేసారు. పీవీ సింధు కూడా డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్నారన్నారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు.

## స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్



**విజయవాడ,జూన్30,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్తు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేసారు. ఇళ్లకు బిగిస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు వల్ల వినియోగదారులకు, ప్రజలకు కలిగే లాభం ఏమిటని నిలదీశారు. వినియోగదారుల గొంతు కోయడానికి, అదానీ, షిర్డీసాయి కంపెనీలను ఉద్ధరించడానికే వీటిని అమరుస్తున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, బిగించిన వాటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు ఈ మేరకు సీపీఎం రాష్ట్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఒక్కో స్మార్ట్ మీటర్ రూ.12వేల నుంచి రూ.18 వేల వరకు ఖర్చవుతుందని, ప్రతినెలా ఇచ్చే విద్యుత్ బిల్లులో దీనిని కలుపుతారని చెప్పారు. రాష్ట్రంలోని వినియోగదారులపై ఏడాదికి భారం రూ.50వేల కోట్లు ఉంటుందన్నారు. ఈ అంశంపై కరపత్రాలు ద్వారా తాము ప్రజలకు వివరిస్తున్నామని, ప్రజలు అంగీకరించి వీటికి వ్యతిరేకంగా దరఖాస్తులపై సంతకాలు చేస్తున్నారని చెప్పారు. కేంద్రం ఆదేశాలకు లొంగకుండా ప్రజల క్షేమం కోరుకుంటే వెంటనే స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆపకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేసేందుకు వామపక్ష పార్టీలు, వివిధ ప్రజా సం ఘాలతో భవిష్యత్ కార్యక్రమంపై చర్చిస్తామన్నారు.

## సార్వత్రిక సమ్మెకు వామపక్షాల మద్దతు: రామకృష్ణ

**విజయవాడ జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 9న చేపట్టిన సార్వత్రిక సమ్మెకు వామపక్ష పార్టీలు మద్దతు తెలుపుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ చెప్పారు. విజయవాడలోని దాసరి భవన్‌లో 10 వామపక్ష పార్టీల సమావేశం జరిగింది. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ పరిశ్రమల కోసం ఉలవపాడు వద్ద చేపట్టిన బలవంతపు భూసేకరణను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు చేపట్టిన నిరసనకు వామపక్ష పార్టీలు సంఘీభావం ప్రకటించాయన్నారు. జులై 2న ఆ గ్రామాల్లో పర్యటించి వారికి మద్దతుగా ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొంటామని చెప్పారు. ప్రజలపై భారంపడే అదానీతో సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను నిలిపివేయాలని వామపక్ష పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఇండోసోల్, గ్రీన్‌కో కంపెనీలు జగన్ బినామీలని ఆరోపించారు. కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక ఆ కంపెనీలకే భూములు కట్టబెట్టాలని చూడటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.

## చేనేతలకు సముచిత న్యాయం చేయాలి

### ప్రభుత్వానికి అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం నేతల విజ్ఞప్తి



సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మ సత్యనారాయణ, సూరేపల్లి రవికుమార్

**విజయవాడ,జూన్30,ప్రభాతవార్తప్రతినిధి:** చేనేత కులాలకు సముచిత సామాజిక న్యాయం చేయాలని, జనభాలో 6శాతం పైగా వున్న చేనేత కులాల అభివృద్ధికి ప్రభుత్వం ముందడుగు వెయ్యాలని అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు తుమ్మ సత్యనారాయణ, సూరేపల్లి రవికుమార్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం గాంధీ నగర్‌లోని బ్రాంచి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు తుమ్మ సత్యనారాయణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థికంగా వెనుకబడిన చేనేత కులాలను ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలిచ్చి ఆదుకోవాలన్నారు. అలాగే పద్మశాలి కార్పొరేషన్కి తగనన్ని నిధులు మంజూరు చేయాలని, దాంతోపాటు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తప్పనిసరిగా వారానికి ఒకసారి చేనేత వస్త్రాలను ధరించే విధంగా కఠినంగా అమలు చేయాలన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి సూరేపల్లి రవికుమార్ మాట్లాడుతూ చేనేత కులాల వారు ఆర్థిక వెనుకబాటుతనం వల్ల ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొనే పరిస్థితులు లేనందున వారికి ప్రభుత్వం నామినేటెడ్ పదవులు, శాసనమండలి, రాజ్యసభల్లోనూ, కార్పొరేషన్ ఛైర్మన్ పదవుల్లో ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు చెందిన పద్మశాలి, ఇతర చేనేత కులాల వారికి అవకాశం కల్పించి సముచిత సామాజిక న్యాయం చేయాల్సిందిగా కోరారు. అమరావతి మరియు సింహాచలం దేవస్థానాలలో పద్మశాలి అన్నసత్రాలకు స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కలిమిశ్రీ, చొప్పా రాఘవేంద్రశేఖర్ పాల్గొన్నారు.




### తిరుపతి-చిక్కమగళూరు

## మధ్య కొత్త రైలు

### రైల్వే బోర్డు గ్రీన్ సిగ్నల్

**గుంతకల్లు రైల్వే, జూన్ 30,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ తిరుపతి నుంచి నైరుతి రైల్వే మైసూరు డివిజన్ చిక్కమగళూరు మధ్య కొత్త రైలు సర్వీసులను నడిపేందుకు రైల్వే బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలోని రాయలసీమ, కర్ణాటక ప్రాంతాల మధ్యత్వరలో ప్రారంభం కాబోతున్న ఈ రైళ్ల నిర్వహణకు సంబంధించి రైల్వే బోర్డు కోచింగ్ విభాగం సంయుక్త సంచాలకులు వివేక్ కుమార్ సిన్హా ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి నుంచి చిక్కమగళూరు వెళ్లే నెంబర్ 17423వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతి గురువారం రాత్రి 9గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి శుక్రవారం ఉదయం 10.30గంటలకు చిక్కమగళూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో చిక్కమగళూరునుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 17424వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు చిక్కమగళూరు నుంచి ప్రతి శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి శనివారం ఉదయం 7గంటలకు తిరుపతి చేరుకుంటుంది. త్వరలో పట్టాలెక్కబోతున్న ఈ రైళ్లు మార్గమధ్యంలో పాకాల, చిత్తూరు,కాట్పాడి, జోలార్‌పేట్, కుప్పం, బంగారుపేట, వైట్ ఫీల్డ్,క్రిష్ణారాజాపురం, బెంగళూరు, చిక్‌భన్వరా, తుముకూరు, తిప్తూరు, అరిసికెర, దేవనూరు, బిరూర్, కడూర్, బసిలేహళ్లి, సకరాయపట్టణం స్టేషన్లలో నిలుస్తాయి.

## అన్నమయ్య జిల్లా రోడ్డు ప్రమాదంపై జగన్ దిగ్భ్రాంతి

**విజయవాడ జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** అన్నమయ్య జిల్లాల్లో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు వైఎస్ జగన్ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అన్నమయ్యజిల్లాల్లో సోమవారం తెల్లవారుజామున టెంపో వాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు మృతిచెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై జగన్ స్పందించారు. శ్రీవారి దర్శనానికి వెళ్లి తిరిగి వస్తూ ప్రమాదానికి గురి కావడం అత్యంత బాధాకరమన్నారు. ప్రమాదంలో గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## రాష్ట్రంలో అరాచక పాలన

### వైఎస్సార్సీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

**విజయవాడ జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని వైయస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. వైకాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగంచేపట్టాల్సిన కార్యాచరణపై సోమవారం జరిగిన కార్యక్రమంలో సజ్జల మాట్లాడుతూ పార్టీకి నిజమైన బలం కార్యకర్తలే అన్నారు. మన నాయకుడు జగన్ శక్తి కూడా కార్యకర్తలే. పార్టీ తన ప్రస్థానంలో అనేక రికార్డులు సృష్టించింది. సంక్షేమానికి నిజమైన అర్థం చెప్పిన పాలన మనది. అదే కూటమి ప్రభుత్వంపై ఏడాది పాలనతోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోందని, అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రశ్నించే గొంతులు నొక్కుతోంది. ఎక్కడికక్కడ అణిచివేసిన ధోరణితో పని చేస్తోందని, ఒక్క మాటలో చెప్పాలంటే రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోందన్నారు. పార్టీలో అన్ని కమిటీల నియామకం పూర్తయితే 18లక్షల మంది క్రియాశీలక సభ్యులవుతారు. అప్పుడు చంద్రబాబు చేస్తున్న దుర్మార్గాలు, రాష్ట్రానికి చేస్తున్న నష్టాలను ఇంకా గట్టిగా ప్రచారం చేయగలమన్నారు. అందుకే ఎన్నికలు ఎప్పుడొచ్చినా మైనారిటీలంతా మన వెంటే ఉండేలా మీరంతా కృషి చేయాలన్నారు.

### తిరుచానూరులో విషాదం

## కారులో యువకుల మృతదేహాలు

**తిరుపతి,జూన్ 30ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి నగరం సమీపంలోని తిరుచానూరులో విషాదం జరిగింది. ఈ విషాద సంఘటన సోమవారం మధ్యాహ్నం వెలుగు చూసింది. తిరుపతి జిల్లా కేంద్రానికి సమీపంలోని తిరుచానూరు రంగనాథంవీధిలో ఆదివారం సాయంత్రంకారులో వినయ్,దిలీప్ (30)ఇద్దరూ మద్యం సేవించారు. బీర్లుతాగిన మత్తులో కారులోనే అలానే నిద్రించారు. ఏసి ఆగిపోవడంతో కారులో ఊపిరాడక ఇద్దరూ ప్రాణాలుకోల్పోయారు. కారులో నాలుగు బీరు సీసాలు కూడా ఉన్నాయి.సోమవారం మధ్యాహ్నం వరకు కూడా కారు అలాగే ఉండటంతో అనుమానంతో స్థానికులు తిరుచానూరు పోలీసులకు సమాచారం అందించగా కారు అద్దాలు పలగలగొట్టి యువకుల మృతదేహాలను బయటకు తీశారు. మృతదేహాలను పోస్టుమార్టమ్ నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. తిరుచానూరు ఎస్ఐ సాయినాథ్ చౌదరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇద్దరు యువకులు తిరుచానూరు వాసులుగానే పోలీసులు గుర్తించారు.కాగా కారు ఢిల్లీ రిజిస్ట్రేషన్‌గా ఉండటాన్ని పోలీసులు కనుగొన్నారు. కాగా కారుపైభాగాన్ని పూర్తిగా కవర్‌తో కప్పి ఉంచారు. దీన్ని బట్టిపలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మద్యం సేవించడం ఎవరైనా చూస్తారేమోనని ముందుగానే ఊహించి ఇలా చేశారా అనే అనుమానాలు పోలీసులు వ్యక్తం చేస్తున్నారు.

# ఇంజనీరింగ్ కళాశాల నూతన తాత్కాలిక ప్రిన్సిపాల్‌గా ఆచార్య లింగరాజు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూన్30, ప్రభాతవార్త: వర్సిటీ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు నూతన తాత్కాలిక ప్రిన్సిపాల్‌గా సైన్స్ కళాశాల ఫిజిక్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ ఆచార్య సిహెచ్.లింగరాజు నియమితులయ్యారు.



ఈమేరకు తాత్కాలిక వీసి ఆచార్య కె.గంగాధరరావు ఆదేశాలతో తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఆచార్య లింగరాజు ఇంజనీరింగ్ కళాశాల తాత్కాలిక ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించనున్నారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభం నుంచి దినదినాభివృద్ధి చెందుతున్న ఈ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమితులైన అందరు తమవంతు కృషిచేసి వన్నెతెచ్చారు. కొత్తకోర్సులు, నూతన రీసెర్చ్ ప్రాజెక్టులు, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్, ఇంకుబేషిన్ సెంటర్‌లు, స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్, స్కిల్ కళాశాల ఇలా ఒక్కొక్కరి హయాంలో వారు కళాశాలకు అధికారుల సహకారంతో అభివృద్ధికి బాటలు వేశారు.

**అధికారులకు ధన్యవాదాలు**

నూతన ప్రిన్సిపాల్‌గా నియమితులైన ఆచార్య సి.హెచ్. లింగరాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతాయుతమైన పదవిని అప్పగించినందుకు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. అధికారుల ఆదేశాలతో తనవంతు బాధ్యతలు నిర్వర్తించి కళాశాల అభివృద్ధిలో భాగస్వామిగా నిలుస్తానని ఆచార్య లింగరాజు ప్రభాతవార్తకు తెలిపారు.

**వర్సిటీని వీడిన మరొక ప్రిన్సిపాల్!**

ఇంజనీరింగ్ కళాశాల అభివృద్ధికి కృషిచేసిన వారిలో ఆచార్య పి.సిద్ధయ్య ఒకరు. అధికారులకు, కళాశాల అధ్యాపకులకు, సిబ్బందికి, విద్యార్థులకు మధ్య వారధిగా సిద్ధయ్య తన విధులను విజయవంతంగా నిర్వహించారు. అయితే గడిచిన కొంతకాలంగా ప్రిన్సిపాల్ హోదాను భారంగా ఆయన పాలించినట్లు సమాచారం. నిరంతరం ఏదో ఒక సమస్య అంటు ఒత్తిడికి గురయ్యారని వినికిడి. కొందరు అధికారులు ఆయన్ను కొనసాగించాలని ఆశించినా కూడా తీవ్రఒత్తిడి ఆయన రాజీనామాకు కారణమైందని చెప్పవచ్చు. కాగా, గతేడాది ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న ఆచార్య ఈ.శ్రీనివాసరెడ్డి తన పదవికి రాజీనామా చేసి వెళిపోయారు. అప్పటినుంచి నేటి వరకు ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ కళాశాలకు ప్రిన్సిపాల్‌ను నియమించలేదు. ఆ కళాశాలను కూడా మూసివేస్తారనే ప్రచారం జరిగింది. వీరిద్దరి రాజీనామాల వెనుక బలమైన కారణాలు ఉన్నట్లు వర్సిటీలో చర్చమొదలైంది.

# నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్

**గుంటూరు తూర్పు, జూన్ 30 (ప్రభాతవార్త) :** నగరపాలక సంస్థ పరిధిలో ప్రధానంగా శివారు ప్రాంతాల్లో మౌళిక వసతులైన రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు చేపట్టడానికి ఏఈల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేసి, ప్రాధాన్యత క్రమంలో చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని నగర కమీషనర్ పులి శ్రీనివాసులు



ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కమీషనర్ నాయీబ్రాహ్మణ కాలనీ, తుఫాన్ నగర్, భాగ్యనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఏఈల వారీగా తమ పరిధిలో ముఖ్యమైన మౌళిక వసతులైన రోడ్లు, డ్రైన్ల త్రాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. ప్రతి ప్రాంతంలో సిసి రోడ్లు, కాకుండా తొలుత ప్రజల రాకపోకలకు వీలుగా జిఎస్బీ రోడ్లను డ్రైన్లతో కలిసి ప్రతిపాదించాలన్నారు. స్థానికులు అందించే ఫిర్యాదులను ఆయా ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్యం, మౌలిక వసతులను పరిశీలించి తక్షణం తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. సచివాలయ కార్యదర్శులు, స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజల నుండి అందే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం పారిశుద్ధ్య పనులపై ప్రజారోగ్య అధికారులతో మాట్లాడుతూ నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ జరిగితే రోడ్ల మీద, ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు ఉండవన్నారు. పర్యటనలో డిఈఈ శ్రీనివాస్, ఎస్ఎస్ ఎస్వీఎస్ ప్రసాద్, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# కేఎల్‌యు విద్యార్థుల ప్రతిభ

**తాడేపల్లి,జూన్ 30,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,4సైట్ ఏఐ అనే సంస్థతో కలసి సంయుక్తంగా నిర్వహించిన ఏపి పోలీస్ 4సైట్ ఏ హాక్ థాన్ 2025లో కేఎల్‌యు కి చెందిన విద్యార్థులు ప్రథమ బహుమతిని సాధించారని




మల్టీ డిసిప్లెనరీ డిపార్ట్‌మెంట్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూషిప్ (ఎండిఐ అండ్ ఇ) విభాగం డైరెక్టర్ నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండిఐ అండ్ ఇ విభాగం,సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఇంకుబేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూషిప్ (సిఐఐఇ) విభాగాల ఆధ్వర్యంలో ఏఐ డిఎస్ హానర్స్ బిటెక్ ద్వితీయ సంవత్సరం ఇన్నోవేషన్ కోర్సు అభ్యసిస్తున్న వేదానంద ప్రణీల్ తన బృందంతో కలసి ఈ ప్రతిష్టాత్మక పోటీలో పాల్గొని విజేతగా నిలిచారని తెలిపారు. ఈ పోటీలో సుమారు 150కి పైగా బృందాలు (అకడమిక్,ఇండస్ట్రీ కలిపి) పాల్గొనగా, 60బృందాలు తుది జాబితాలోనికి ఎంపికయ్యాయని అన్నారు. విజేత బృందం పరిష్కరించిన సవాల్ గురించి వివరిస్తూ వాట్సాప్ చాట్స్ మరియు గ్రూప్ డేటా ఆధారంగా కీలక అంశాలు, ముందస్తు హెచ్చరికలు గుర్తించే ఏఐ టూల్‌ను అభివృద్ధి పరిచారన్నారు. కేఎల్‌యు విద్యార్థుల సాంకేతిక నైపుణ్యం,ఆవిష్కరణాత్మక ఆలోచనకు ఇది నిదర్శమన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్,ఆచార్యులు వేదానంద ప్రణీల్ బృందానికి అభినందనలు తెలిపారు.

# ఇన్నర్ రింగ్‌రోడ్డులో అమరావతి మహా గణపతి

## -రాష్ట్రంలో అతిభారీ మట్టి వినాయక విగ్రహం

**గుంటూరు విద్య,జూన్ 30,ప్రభాతవార్త :** వినాయక చవితిని పురస్కరించుకొని గుంటూరులో అతిపెద్ద వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అమరావతి ఉత్సవ కమిటీ చైర్మన్ నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ ప్రతిష్టాత్మకమైన వినాయక విగ్రహాన్ని ఆగస్టు 27న ప్రతిష్ట చేసి అన్ని సాంప్రదాయ పూర్వక హోమాలు,పూజలు ఎంతో ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఆరోజు ముఖ్యఅతిధులుగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,రాష్ట్ర ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా,దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను చేస్తామని తెలిపారు. భక్తులకోసం వివిధ రకాల స్టాల్స్,ఆటలు,సాంస్కృతి కార్యక్రమాలు,మూవీ ఆర్టిస్టుల ఈవెంట్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వచ్ఛమైన నల్లమట్టి,ఎర్రమట్టి మరియు హాని కలిగించని రంగులతో చూడ ముచ్చటగా ఈ విగ్రహాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవంలో గుంటూరు జిల్లాతోపాటు పల్నాడు,బాపట్ల,కృష్ణాజిల్లా నుండి కూడా పెద్ద ఎత్తున భక్తులు వస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజేష్,లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

# మురుగు తొలగించండి

## దోమల మందును పిచికారీ చేయించండి

## - ఎంపీడీఓ విజయలక్ష్మీ

**కొల్లిపర,జూన్ 30 ప్రభాతవార్త:** చెత్తా..చెదారం లేకుండా చూచుకున్నప్పుడే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. సోమవారం మండల



కేంద్రం కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లోమురుగు కాల్వలలో మురుగు తొలగించి దోమల మందును పిచికారీ చేయించాలన్నారు. సమావేశంలో పరిపాలనాధికారి ప్రతాపరెడ్డి,ఈవోపీఆర్‌డి భార్గవ్,సీనియర్ అసిస్టెంటు శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ప్రాంగణ ఎంపికల్లో

## ఆర్‌విఆర్ జేసి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు

**గుంటూరు విద్య,జూన్ 30,ప్రభాతవార్త :** భారతదేశంలోని ప్రముఖ ఫార్మా మరియు కెమికల్ ప్రొడక్షన్ రంగ కంపెనీ గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ తమ కళాశాల్లో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 13మంది కెమికల్ ఇంజనీర్ విద్యార్థులకు రూ.3లక్షల ప్యాకేజీతో కూడిన ఉద్యోగాలు లభించడం ఆనందదాయకమని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్,ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్,డాక్టర్ జగదీష్ కె. పేర్కొన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను సోమవారం కళాశాల సిబ్బంది అభినందించారు. ప్రసిద్ధి చెందిన కంపెనీలు తమ విద్యార్థుల ప్రతిభను గుర్తించి ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు వస్తున్నాయని ఇది కళాశాలకు ఎంతో గర్వకారణమని సెక్రటరీ,కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ,ట్రెజరర్ కొండబోలు కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్,డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు,ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ సిహెచ్ శ్రీనివాసరావు,డాక్టర్ కె.సురేష్‌బాబు,కెమికల్ ఇంజనీరింగ్ ఇన్‌చార్జీ విభాగాధిపతి డాక్టర్ కె.రమేష్‌చంద్ర తదితరులు అభినందించారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ

**మంగళగిరి, జూన్ 30, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను స్థానిక టీడీపీ నాయకులు సోమవారం పంపిణీ చేశారు. 11వ వార్డుకు చెందిన సునగల వరప్రసాద్‌కు రూ. 71,800 వేలు, పగల అనసూర్యకు రూ 42,674 వేల విలువైన చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి తెలుగుదేశం పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, ఆంధ్రప్రదేశ్ పద్మశాలి డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల నాగార్జున, 11వ వార్డు అధ్యక్షులు కారంపూడి శివరామకృష్ణ, మాజీ కౌన్సిలర్ శ్రీనివాసరావు, జంజనం చిన్న శ్రీనివాసరావు , వెనిగళ్ళ ఉమాకాంతరావు, దామర్ల పరమేష్, అవ్వారు ప్రసాద్, కొమ్మూరి మారుతీ



# నృసింహుని ఎగువ దిగువ సన్నిధిలలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి వారిచే బస్ షెల్టర్ల నిర్మాణం

**మంగళగిరి, జూన్ 30, ప్రభాతవార్త:** శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం దిగువ, ఎగువ సన్నిధి లో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి వారిచే బస్ షెల్టర్ల నిర్మాణం



చేపట్టారు. దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధిగాంచిన శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో మంగళగిరి రోటరీ క్లబ్ స్వామివారి సేవలో తరించింది. మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు పదవీకాలం (20242025) ఈ రోజుతో ముగియనున్న నేపథ్యంలో చేపట్టిన సర్వీసు ప్రాజెక్టులో భాగంగా స్వామివారి కళ్యాణ ప్రాంగణంలోనూ, ఎగువసన్నిధిలోని పార్కింగ్ స్థలంలోనూ, సుమారు రూ.7లక్షలు వెచ్చించి ఆధ్యాత్మిక వాతావరణం ప్రతిబింబించేలా రెండు చక్కటి బస్ షెల్టర్లను నిర్మించారు. సోమవారం సాయంత్రం స్వామివారి కళ్యాణ ప్రాంగణంలో ఈ బస్ షెల్టర్లను దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణాధికారి కోగంటి సునీల్ కుమార్ లాంఛనంగా ప్రారంభించి భక్తులకు అంకితంచేశారు .మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు, కార్యదర్శి అందె మురళీమోహన్, చార్టర్ ప్రెసిడెంట్ అనిల్ చక్రవర్తి ఇసునూరు ఆర్థిక సౌజన్యంతో నిర్మించిన బస్ షెల్టర్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కోశాధికారి వడ్లమూడి శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ ఎలెక్ట్ ప్రెగడ రాజశేఖర్, రోటరీ ప్రతినిధులు పాలుపంచుకున్నారు. దేవస్థానం అర్చకులు శాస్త్రోక్తంగా పూజకార్యక్ర మాలు నిర్వహించగా, ముఖ్యఅతిథి సునీల్ కుమార్ రోటరీ ప్రతినిధులతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఈవో సునీల్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ ఈ బస్సు సర్వీసు ప్రతిరోజూ ఉదయ 7గంటలకు ప్రారంభమవుతు ందని, దిగువ సన్నిధి నుంచి ఎగువసన్నిధికి భక్తులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఈవో సునీల్ కుమార్ రోటరీ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు మాట్లాడుతూ రోటరీ ఇంటర్నేషనల్ లో రోటరీ క్లబ్ ల పాలకవర్గ పదవీకాలం ఏడాది పాటు వుంటుందని, తన పదవీకాలంలో తొలి సర్వీసు ప్రాజెక్టుగా శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం ఘాట్ రోడ్డు మార్గంలో మొక్కలు నాటామని, ఇప్పుడు చివరి రోజు కూడా స్వామివారికి సేవచేసేభాగ్యాన్ని కల్పించిన దేవస్థానం ఈవో సునీల్ కుమార్ కు ధన్యవాదాలు తెలిపారు. రోటరీ క్లబ్ కార్యదర్శి అందె మురళీమోహనరావు, చార్టర్ ప్రెసిడెంట్ అనిల్ చక్రవర్తి ఇసునూరు, ఎలెక్ట్ ప్రెసిడెంట్ ప్రెగడ రాజశేఖర్ లు మాట్లాడుతూ మంగళగిరి రోటరీ క్లబ్ అనేక సర్వీసు ప్రాజెక్టులు చేపడుతోందన్నారు. రోటరీ క్లబ్ సర్వీసు ప్రాజెక్టులు విజయవంతంగా నిర్వహించడం స్వామివారి ఆశీస్సులు తోడుకావాలనే సత్సంకల్పంతో స్వతహాగా స్వామి భక్తుడైన రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గాజుల శ్రీనివాసరావు తన పదవీకాలంలో తొలి, చివరి సర్వీసు ప్రాజెక్టులను స్వామివారి సన్నిధిలో నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు.

# స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ జిల్లా స్థాయి సమావేశం కీలక నిర్ణయాలు

**గుంటూరు విద్య,జూన్ 30,ప్రభాతవార్త :** 30వ తేదిన స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ జిల్లా సమావేశం పార్టీ జిల్లా కార్యాలయంలో స్వరాంధ్ర ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏసుబాబు మాదిగ అధ్యక్షతన జరిగినట్లు ఏసుబాబు మాదిగ తెలిపారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. జూలై 7వ తేదిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పడి 32సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా జరిగే వేడుకలకు ప్రతి ఒక్క కార్యకర్త నియోజకవర్గ మండల వర్గ నాయకులు మద్దతు తెలుపుతూ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఏసుబాబు మాదిగ పిలుపునిచ్చారు. స్వరాంధ్ర ఎమ్మార్పిఎస్‌ను వివిధ జిల్లాల్లో మరింత బలోపేతం చేయాడానికి,ఉమ్మడి గుంటూరు జిల్లాల్లోని నాయకత్వాన్ని మరింతగా బలపరచడానికి ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఎస్సీల ఉప వర్గీకరణలో మాదిగ ప్రజలకు సామాజిక న్యాయం అందించడానికి స్వరాంధ్ర ఎమ్మార్పిఎస్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. ప్రతి కార్యకర్త,నాయకులు ఈ విషయంలో క్రింది స్థాయి నుండి పోరాటం చేశారని వారిసేవలు మరువలేనని ఏసుబాబు మాదిగ పేర్కొన్నారు. 10వ తరగతి ఇంటర్మీడియట్ ల్లో మంచి మార్కులు సాధించిన మాదిగ సామాజిక వర్గ విద్యార్థులకు తగిన విధంగా చేయూతను అందించడమే కాకుండా ప్రభుత్వం తరపున కూడా సాధ్యమైనంత వరకు సాయం అందేలా తగిన చర్యలు చేపట్టడానికి తగిన సమాలోచనలు చేస్తున్నట్లు ఏసుబాబు మాదిగ పేర్కొన్నారు. ఈ సమావేశానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానోపాధ్యాయునికి ఘన సన్మానం

**బల్లికురవ, జూన్ 30, ప్రభాతవార్త**

మండలంలోని వల్లాపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కట్టా శ్రీనివాసరావు బదిలీపై పంగులూరు మండలం కోటపాడు వెళ్ళనున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయ బృందం సోమవారం ఆయనకు ఘనంగా సన్మానం ఏర్పాటు చేసింది. నాలుగు సంవత్సరాల పాటు ప్రధానోపాధ్యాయుడుగా పాఠశాల విద్యార్థుల ప్రేమను పొందడంతో పాటు, తల్లిదండ్రుల అభిమానానికి కూడా పాత్రుడయ్యారు. బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించడంలో ఎప్పటికప్పుడు ప్రత్యేక చొరువ చూపుతూ విద్యార్థుల సంఖ్య గణనీయగా పెరిగేందుకు తన వంతు కృషి చేశాడు. ఈ సన్మాన కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉదయ భాస్కర్, అనిత, జ్యోతి, రామకృష్ణ, రజనీకుమారి, సావిత్రి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# మీడియాపై దాడి హేయమైన చర్య

## - మంగళగిరిలో కథం తొక్కిన జర్నలిస్టులు -అంబేద్కర్ బొమ్మవద్ద రాస్తారోకో

## - తహశీల్ధార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేత

**మంగళగిరి జూన్ 30 ప్రభాతవార్త :** మీడియాపై దాడి చేయడం హేయమైన చర్యఅని మంగళగిరి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వానపల్లి బ్రహ్మనాయుడు అన్నారు. హైదరాబాదులో మహాన్యూస్ ఛానల్ కార్యాలయంపై బీఆర్ఎస్ పార్టీనేతలు చేసిన దాడికి నిరసనగా మంగళగిరి ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు కథం తొక్కారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం సోమవారం సాయంత్రం




రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ర్యాలీగా తహశీల్థార్ కార్యాలయానికి చేరుకుని డిప్యూటీ తహశీల్థార్ కి వినతి పత్రం అందజేశారు. అనంతరం బ్రహ్మనాయుడు మాట్లాడుతూ పాలకప్రభుత్వాలు మీడియా స్వేచ్చని హరిస్తున్నా యని అన్నారు. మహాన్యూస్ కార్యాలయంపై దాడికి పాల్పడినవారిపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకుని పత్రికా స్వేచ్చని కాపాడాలని కోరారు. సీపీఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ..మీడియాపై దాడిని అన్నిపార్టీలు ఖండించాలన్నారు. ప్రజలకు సమాచారాన్ని చేరవేసే మీడియా సంస్థలు, మీడియా ప్రతినిధులపై దాడులు సరికాదన్నారు. ఇందుకు బాధ్యులైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. దళిత సంఘాల నాయకులు కారుమంచి రామారావు మాట్లాడుతూ రాజకీయ నాయకులు వారి గొప్పలు చెప్పుకోవడానికి మీడియాలు కావాలి కానీ వారి తప్పులను వెలికితీస్తే దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. మీడియా ప్రతినిధులపై దాడులు అరికట్టాలంటే ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలను కోరుతున్నట్లు చెప్పారు. విద్యార్థి సంఘాల నాయకులు బాలాజీ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ ఏమిజరిగినా మీడియా ద్వారా తెలుస్తుందని అన్నారు. అటువంటి మీడియా సంస్థలపై దాడులు సరైంది కాదన్నారు. ఇప్పటికైనా దాడిచేసిన వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జర్నలిస్టులు బి.దయాకర్, ఎం.సిరి బాబు, ఈపూరి రాజారత్నం, ఎస్.శ్రీనివాసరావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, సీ.హెచ్ కళ్యాణ్, బత్తుల సాంబశివరావు, విడేల సాయిశ్రీనివాస్ (వాసు), ఎన్.శివన్నారాయణ, చదలవాడ సాయిచంద్, నాయుడు నాగరాజు, వెంకట్, ఎస్.కే.సుభాని, ఎం.మస్తాన్, ఎం.కిషోర్, బండారు సాంబశివరావు, జీ.దుర్గారావు, అన్వర్ ఖాన్, సురేష్, గుప్తా, శివరాత్రి శ్రీనివాసరావు, వేముల రాంబాబు, ఆరేపల్లి రాజు, సందు రామకృష్ణ, ఇందనం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మయ్యకు నరసింహారెడ్డి ఘన నివాళి

**బల్లికురవ, జూన్ 30, ప్రభాతవార్త**

మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు పరిధిలోని సుజాత నగర్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఆంద్ర లక్ష్మయ్య అనారోగ్యంతో మరణించాడు. సమాచారం అందుకున్న అద్దంకి వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జీ హనిమిరెడ్డి సోదరుడు నరసింహారెడ్డి సుజాతనగర్ కాలనీలో లక్ష్మయ్య మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

# ఇంజనీరింగ్ కార్మికుల జీతాలను వెంటనే పెంచాలి

**మార్కాపురం, జూన్ 30, ప్రభాతవార్త**

మున్సిపాలిటీలోని ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు వెంటనే పెంచాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సీఐటీయు) ఆధ్వర్యంలో సోమవారం కార్మికులు ఆందోళన నిర్వహించారు. మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో ఇంజనీరింగ్ కార్మికులుమోకాళ్లపై నిల్చుని డిమాండ్ల సాధన కోసం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కే.సుబ్బరాయుడు, గొట్టం హరికృష్ణలు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరికి సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని సమాన పనికి సమాన వేతనం కింద ఇరవై ఒక్క వెయ్యి జీతం పెంచాలని, చనిపోయిన కార్మికుల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పై సమస్యల పరిష్కారం కోసం గత కొన్ని నెలలుగా కార్మికులు పలు దఫాలుగా ధర్నాలు నిరసనలు చేయడం జరిగిందని, అయినా ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చి ఎందుకు ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హక్కుల సాధన కోసం కార్మికులు సమ్మెకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సమ్మె కాలంగా ఎలాంటి పరిస్థితులు ఎదురైనా అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని అన్నారు.

# పోరాటం ఫలితంగా కొన్ని హక్కులు సాధించాం


## -సీఐటీయూ తెనాలి డివిజెన్ కార్యదర్శి షేక్ హుస్సేన్‌వళి

**కొల్లిపర,జూన్ 30 ప్రభాతవార్త:** అంగన్‌వాడీలు ఐక్యంగా పోరాడిన ఫలితంగా కొన్ని హక్కులు సాధించడం జరిగిందని సీఐటీయూ తెనాలి డివిజెన్ కార్యదర్శి షేక్ హుస్సేన్‌వళి అన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మండల పరిధిలోని తూములూరు,కొల్లిపర గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు,ఈ సందర్భంగా హుస్సేన్‌వళి మాట్లాడుతూ జూలై 9 వ తేదీన జరిగే సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా నాయకుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో గోదా సుందరరావు,మల్లోల రమేష్,పొత్తూరు ఏసుపాదం,కొల్లిపర కోటేశ్వరరావు,గోదా ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.



# పేద ప్రజలను ఆదుకోవటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## తెదేపా మండల అధ్యక్షుడు భీమవరపు చిన కోటిరెడ్డి



కొల్లిపర,జూన్ 30 ప్రభాతవార్త: పేద ప్రజలను ఆదుకోవటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చిన కోటిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపర టీడీపీ కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన కోటిరెడ్డి మాట్లాడుతూ నిరు పేద కుటుంబాలైన నాగబుల్లెమ్మ,సావిత్రి ఇరువురు ఇటీవల అనారోగ్యానికి గురి కావటం..వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉండటంతో ఈ విషయాన్ని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ దృష్టికి తీసుకెళ్ళటంతో ఆయన సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపటం జరిగిందన్నారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు రావటంతో వారికి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# నగర పరిధిలోని ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పన : మేయర్

**గుంటూరు తూర్పు, జూన్ 30 (ప్రభాతవార్త) :** నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో 35ప్రశ్నలు, 105 ప్రియాంబుల్స్, ప్రతిపాదనలు ఆమోదం ద్వారా నగర పరిధిలోని ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులను చేపట్టడానికి అవకాశం కల్గిందని నగర మేయర్ కోడెలమూడి రవీంద్ర తెలిపారు. సోమవారం మేయర్ అధ్యక్షతన నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగిన నగరపాలక సాధారణ సమావేశంలో నగర కమీషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యేలు మహ్మద్ నసీర్, గల్లా మాధవి, డిప్యూటీ మేయర్ షేక్ సజిలా, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో తొలుత ఇటీవల కాలంలో అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి, అలాగే మాజీ కార్పొరేటర్ కారసాని సామ్రాజ్యం, మృతికి రెండు నిమిషాలు కౌన్సిల్ మౌనం పాటించడం జరిగింది.

# కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు

**వెలిగండ్ల, జూన్ 30, ప్రభాతవార్త :** సోమవారం మండల తహశీల్దార్ వి.వాసు అధ్యక్షతన కౌలు రైతుల కార్డుల గురించి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారి తమ్మినేని శిల్ప ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ ఎన్.వాసు మాట్లాడుతూ ఈ సంవత్సరం వెలిగండ్ల మండలానికి 920 మంది కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు జారీ చేయాలని, ప్రభుత్వం ఆదేశాలు జారీ చేశారని, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు గ్రామంలోని కౌలు రైతులకు, భూ యజమానులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వ్యవసాయాధికారి శిల్ప మాట్లాడుతూ కౌలుకు పొలం తీసుకుని సాగు చేసేటువంటి రైతులు కౌలు కార్డు తీసుకోవడం వలన కలుగు ప్రయోజనాలను రైతులకు తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వం వారు అందించే పంటల భీమా, పంట రుణం, అన్నదాత సుఖీభవ, వ్యవసాయశాఖ నుండి వచ్చేటువంటి రాయితీలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు గల రాయితీలు పొందుటకు తప్పనిసరిగా కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రం ఉండాలని తెలిపారు. పంట సాగు పత్రం ఇవ్వడం వలన భూమి యజమానులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. దేవాదాయ భూములకు కూడా పంట సాగు పత్రాలు ఇవ్వవచ్చని, మండలంలోని కౌలుకు సాగు చేసేటువంటి రైతులందరూ మీ గ్రామ రెవెన్యూ అధికారి లేదా గ్రామ వ్యవసాయ సహాయకులు లేదా గ్రామ ఉద్యాన వన సహాయకులను సంప్రదించి పంట సాగు పత్రం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఏఈఓలు ఎన్.పుల్లయ్య, బి.భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.



1-7pg10exH.qxd:1-7pg10exH.qxd 01/01/01 8:20 AM Page 1



# భారత్ 290 ఆలౌట్

## ఇంగ్లండ్‌తో అండర్19లో సూర్యవంశీ మెరుపు ఇన్నింగ్స్




**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్‌తో అండర్19లో భాగంగా రెండో వన్డేలో భారత్ 49 ఓవర్లలో 290 పరుగులకు ఆలౌట్ అయింది. ఇంగ్లండ్ బౌలర్ నాలుగు వికెట్లు పడగొట్టడంతో భారత్ 300 పరుగుల లక్ష్యాన్ని చేరుకోవాలనే ఆశలను దెబ్బతీసింది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ టాస్ గెలిచి భారత్‌ను తొలుత బ్యాటింగ్‌కు అహ్వానించింది. అధికారికంగా తొలి బందికే ఆయుష్ మాత్రే వికెట్ కోల్పోయిన భారత్ తదుపరి కుదురుకుంది. వైభవ్ సూర్యవంశీ 45 పరుగులు, విహాన్ మల్హోత్రా 49 పరుగులు, చవ్డా 22 పరుగులు, అభిగ్యాన్ కుందు 32 పరుగులు, రాహుల్ కుమార్ 47 పరుగులు, కనిష్క చౌహాన్ 45 పరుగులతో రాణించడంతో ఓ మోస్తరుకు మించి భారీ స్కోర్ చేసింది. వైభవ్ సూర్యవంశీ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. తొలి వన్డేలో 19 బంతుల్లో 48 పరుగులు చేసిన అతడు నేటి రెండో వన్డేలో 45 పరుగులు చేసి ఔటయ్యాడు. దీంతో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో అర్హమైన అర్థ సెంచరీలను మిస్ చేసుకున్నాడు. వైభవ్‌తో పాటు, ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన ఆయుష్ మాత్రే ఈ మ్యాచ్‌లో నిరాశపరిచాడు. మాత్రే తానెదుర్కొన తొలి బంతికే డకౌటయ్యాడు. అయితే చివరి వరుస ప్లేయర్లు వెంట వెంటనే ఔట్ కావడతో భారత్ ఇన్నింగ్స్ 49 ఓవర్లలో 290 పరుగుల వద్ద ముగిసింది. ఇంగ్లండ్ బౌలర్లలో ఫ్రెంచ్ 4 వికెట్లు పడగొట్టగా, జాక్ హోమ్, అలెక్స్ గ్రీన్ తలో 3 వికెట్లు తీశారు. కాగా భారత్ అండ్ 19 జట్టు 5 వన్డేలు, 2 టెస్ట్ మ్యాచ్‌ల కోసం ఇంగ్లండ్‌లో పర్యటిస్తోంది. హోవ్‌లో జరిగిన తొలి వన్డేలో భారత్ ఇంగ్లండ్‌పై 6 వికెట్లు తేడాతో ఘన విజయం సాధించింది. ఆ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 42.2 ఓవర్లలో 174 పరుగులకే కుప్పకూలగా, భారత్ కేవలం 24 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది.

# సురుచి సంచలన విజయం

## పిస్టల్ ఈవెంట్‌లో మను ఓటమి



**న్యూఢిల్లీ:** గ్రూప్ ఎ షూటర్స్ జాతీయ సెలక్షన్ ట్రయల్స్‌లో సురుచి ఇందర్ సింగ్ ఒలింపిక్ డబుల్ మెడలిస్ట్ మను భాకర్‌ను ఓడించి సంచలనం సృష్టించింది. మహిళల 10 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో ఇందర్ గెలుపుసాధించింది. అలాగే నేవీ షూటర్ నీరజ్ కుమార్ 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్ పురుషుల ఈవెంట్‌లో అద్భుతంగా రాణించాడు. డెహ్రాడూన్‌లో సోమవారం స్టార్ స్టడెడ్ ఫైనల్‌లో, సురుచి 245.6 స్కోరు సాధించింది. ఇది మను భాకర్ కంటే 1.1 పాయింట్లు మెరుగ్గా ఉంది. ఈ ఓటమి మను భాకర్‌కు చాలా నిరాశ కలిగించింది. భాకర్ 244.5 స్కోరుతో రెండవ స్థానంలో, రాహి సర్నోబత్ 223.1 స్కోరుతో మూడవ స్థానంలో నిలిచింది ఈ రోజు జరిగిన మొదటి ఫైనల్‌లో, సామ్రాట్ రాణా చివరి షాట్‌లో 10.5 స్కోరుతో మొదటి స్థానంలో నిలిచాడు, సౌరభ్ 9.6 మాత్రమే సాధించగలిగాడు. సామ్రాట్ 241.7 స్కోరుతో, సౌరభ్ మొత్తం 241.5 స్కోరుతో రెండవ స్థానంలో నిలిచాడు. ఆదిత్య మల్రా 217.8 స్కోరుతో మూడవ స్థానంలో నిలిచాడు. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3పి ఫైనల్‌లో నీరజ్ కుమార్ అద్భుతంగా రాణించి వరుసగా రెండు ట్రయల్స్ గెలిచాడు. ఈ నావికాదళ సైనికుడు 463 పాయింట్లు సాధించాడు, ఇది ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ కంటే రెండు పాయింట్లు మెరుగ్గా ఉంది. అలాగే ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతక విజేత అఖిల్ షెరాన్ 448.8 స్కోరుతో మూడవ స్థానంలో నిలవగా, పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత స్వాప్నిల్ సురేష్ కుసాలే 438.4 స్కోరుతో నాల్గవ స్థానంలో నిలిచాడు.

# యుఎస్ ఓపెన్ వరల్డ్ ఛాంపియన్‌గా ఆయుష్

## మహిళల విభాగంలో రన్నరప్‌గా తన్వీ




**న్యూఢిల్లీ:** భారత్ స్టార్ ప్లేయర్ ఆయుష్ శెట్టి తొలి యుఎస్ ఓపెన్-2025 వరల్డ్ టూర్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. అలాగే ఈ వరల్డ్ టూర్‌లో మహిళల విభాగంలో ఫైనల్‌కు చేరుకున్న అతి పిన్న వయస్కురాలైన తన్వి శర్మ రన్నరప్‌గా నిలిచింది. పురుషుల సింగిల్స్ ఫైనల్లో 20 ఏళ్ల ఆయుష్ మూడో సీడ్, కెనడా ఆటగాడు బ్రియాన్ యాంగ్‌ను 47 నిమిషాల్లో 21-18, 21-13 తేడాతో ఓడించాడు. అతను డెన్మార్క్‌కు చెందిన ప్రపంచ 85వ ర్యాంకర్ మాగ్నస్ జోహన్నెసెన్‌పై 21-17, 21-19 తేడాతో గెలిచి, ఆపై 16వ రౌండ్‌లో మన్నెపల్లి తరుణ్‌పై 21-12, 13-21, 21-15 తేడాతో విజయం సాధించాడు. క్వార్టర్ ఫైనల్స్‌లో ఆయుష్ ప్రపంచ 70వ ర్యాంకర్ కువో కువాన్ లిన్‌పై 22-20, 21-9 తేడాతో విజయం సాధించాడు. టోర్నమెంట్‌లో అతని అతిపెద్ద విజయం సెమీ ఫైనల్స్‌లో వచ్చింది, ఆయుష్ 67 నిమిషాల్లో టాప్ సీడ్, మరియు ప్రపంచ 6వ ర్యాంకర్ చౌ టియెన్ చెన్‌ను 21-23, 21-15, 21-14 తేడాతో ఓడించాడు. తైపీ ఓపెన్ సెమీఫైనల్లో అతను చెన్ చేతిలో ఓడిపోయాడు. అలాగే మహిళల సింగిల్స్ ఫైనల్లో తన్వి శర్మ 46 నిమిషాల్లో అమెరికాకు చెందిన టాప్ సీడ్ బీవెన్ జాంగ్ చేతిలో 11-21, 21-16, 10-21 తేడాతో ఓడిపోయి యుఎస్ ఓపెన్ 2025 వరల్డ్ టూర్ టోర్నమెంట్‌లో రన్నరప్‌గా నిలిచింది. అన్‌సీడెడ్ టీనేజర్ యుఎస్ ఓపెన్‌లో ఫైనల్‌కు చేరుకున్న అతి చిన్న వయస్కురాలైన భారతీయ ప్లేయరుగా రికార్డు సృష్టించింది. ఆమె తొలి రౌండ్‌లో 21-19, 21-9 తేడాతో 2వ సీడ్ వియత్నామీస్ క్రీడాకారిణి న్గుయెన్ తుయ్ లిన్హ్‌పై వరుస సెట్ల విజయంతో తన ప్రచారాన్ని ప్రారంభించింది. రెండవ రౌండ్‌లో థాయిలాండ్‌కు చెందిన మాజీ జూనియర్ ప్రపంచ ఛాంపియన్ ఒపట్నిపుత్‌పేను 21-18, 21-16 తేడాతో ఓడించింది. అలాగే తన్వి మలేషియాకు చెందిన కరుపతేవన్ లెట్షానాను 21-13, 21-6 తేడాతో ఓడించింది. సెమీఫైనల్లో తన్వి 21-14, 21-16 తేడాతో ఉక్రెయిన్‌కు చెందిన ఏడో సీడ్ పోలినా బుహ్రోవాపై ఆధిపత్య విజయం సాధించింది.






# 3 ఫార్మాట్లలో నం 1 హీరోలు

## టాప్3లో కోహ్లీ, బుమ్రాకు స్థానం

**న్యూఢిల్లీ:** సంవత్సరాలుగా, ఆటలో దిగ్గజాలుగా నిలిచిన క్రికెటర్లు చాలామంది ఉన్నారు. క్రికెట్‌లో హీరోలు ఉన్నప్పటికీ, కొంత మంది మాత్రమే టెస్ట్, వన్డేలు, టీ20లతో సహా ప్రతి ఫార్మాట్లో ఐసిసి ర్యాకింగ్స్‌లో నంబర్ వన్ పొజిషన్‌లోకి వస్తారు. కొంతమంది ఆటగాళ్ళు టెస్ట్‌లో నం1 ర్యాంక్స్‌ను సాధిస్తే, మరికొందరు వన్డేలు, ఇంకొందరు టి20ల్లో నంబర్ వన్‌గా నిలుస్తారు. అయితే ఈ మూడు ఫార్మాట్లలోనూ ముగ్గురు క్రికెటర్లు మాత్రమే నంబర్ వన్ ర్యాంక్స్ సాధించగలిగారు. ఈ ఎలైట్ జాబితాలో ఉన్న ఆటగాళ్లలో కోహ్లీ, బుమ్రా స్థానం సంపాదించారు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్స్ క్రికెట్లో లెజెండ్‌గా పరిగణిస్తారు. తన కెరీర్లో 560 మ్యాచ్‌ల్లో 27483 పరుగులతో అన్ని ఫార్మాట్లలో అత్యధిక పరుగులు సాధించిన నాల్గవ ప్లేయర్‌గా ఉన్నాడు. టెస్ట్, వన్డేల్లో ఒక్కొక్కటి 13000 పరుగులతో, అతను ఆడిన 17 టీ20ల్లో 401 పరుగులతో రాణించాడు. ఫిబ్రవరి 2005లో ఆస్ట్రేలియా-న్యూజిలాండ్ మధ్య జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో పాంటింగ్ 98 రన్స్ చేశాడు. ఈ ఫార్మాట్లో నంబర్ వన్ ర్యాంక్‌ను సాధించాడు. అంతేకాకుండా, రికీ 2005 నుండి 2007 వరకు వరుసగా మూడేళ్ళ వన్డే ఫార్మాట్లో నంబర్1 బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. అతడు 2003లో తొలిసారిగా టెస్ట్‌లో నంబర్ ర్యాంకింగ్స్‌ను కూడా సాధించాడు. అలాగే స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ భారత్ నుండి అన్ని ఫార్మాట్లలో అత్యధిక ఐసీసీఐ ర్యాంకింగ్ పొందిన మొదటి ఆటగాడు. అతను తొలిసారిగా 2013 నవంబర్‌లో ఒడిఐ ఫార్మాట్లో నంబర్ వన్ ర్యాంకింగ్స్‌ను సాధించాడు. ఆ తర్వాత, 50 ఓవర్ల ఫార్మాట్‌లోనూ అగ్రస్థానంలో ఉన్నాడు. 2017, 2018, 2019, 2020లో వరుసగా నంబర్ 1 ఒడిఐ బ్యాట్స్‌మెన్‌గా కొనసాగాడు. వన్డేలతో పాటు, కోహ్లీ వరుసగా 2014, 2016 టి 20 ప్రపంచ కప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్స్‌ను గెలుచుకున్నాడు. అంతేకాకుండా రెండు ఏళ్లలో పొట్టి ఫార్మాట్లో నంబర్ వన్ బ్యాటర్‌గా నిలిచాడు. టెస్ట్ ఫార్మాట్‌లో కోహ్లీ వరుసగా 2018, 2019లో పొడవైన ఫార్మాట్లో నంబర్ వన్ బ్యాటర్ స్థానాన్ని దక్కించుకున్నాడు. ఇక భారత స్టార్ ఫాస్ట్ బౌలర్‌లో జస్ప్రీత్ బుమ్రా ఇప్పటివరకు తన తొమ్మిదేళ్ల అంతర్జాతీయ కెరీర్లో అనేక మైలురాళ్లను సాధించాడు. ఏళ్ల తరబడి భారత్ తరపున ముందంజలో ఉన్న ఫాస్ట్ బౌలర్‌గా, స్వింగింగ్ డెలివరీలకు ప్రసిద్ధి చెందాడు. జనవరి 2016లో అంతర్జాతీయంగా అరంగేట్రం చేసిన బుమ్రా, జనవరి 2018లో స్వల్ప కాలానికే టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో నంబర్ సాధించాడు. ఆ తర్వాత వన్డే ఫార్మాట్లో బ్యాట్స్మెన్లకు పీడకలగా మారాడు. 2018, 2019లో వరుసగా ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ వన్డే బౌలర్‌గా నిలిచాడు. టెస్ట్‌లో కూడా తనను తాను ప్రమాదకరమైన బౌలర్‌గా అభివృద్ధి చేసుకున్నాడు. 2023, 2024లో ఐసీసీ ర్యాంకింగ్స్ ద్వారా వరుసగా నంబర్ 1 టెస్ట్ బౌలర్‌గా నిలిచాడు. ఇప్పటికీ ఆ ఫార్మాట్లో ఆ నెంబర్ 1 స్థానాన్ని నిలుపుకొన్నాడు.

# రగ్బీ ప్రీమియర్ లీగ్ తొలి ఛాంపియన్‌గా చెన్నై బుల్స్

## ఫైనల్లో ఢిల్లీ రెడ్జ్‌పై 41-0 తేడాతో విక్టరీ

**న్యూఢిల్లీ:** రగ్బీ ప్రీమియర్ లీగ్ ఫైనల్‌లో చెన్నై బుల్స్ 41-0 తేడాతో ఢిల్లీ రెడ్జ్‌ను ఓడించి తొలి ఛాంపియన్‌గా నిలిచింది. లీగ్ తొలి సీజన్‌లో ఇది అతిపెద్ద విజయంగా రికార్డయింది. చెన్నై సెమీఫైనల్స్‌లో ఆపేసిన చోటు నుంచి పుంజుకుని, తొలి మ్యాచ్‌ల్లో ఢిల్లీ రెడ్జ్‌పై గట్టి దెబ్బలు తిన్నది. ఫైనల్‌లో వాఫోసే మాలికో తొలి ట్రైను సాధించాడు. ఫిలిపే సౌతురాగా గోల్‌గా మార్చాడు. కొన్ని క్షణాల తర్వాత, జోసెవా తలకోలో అద్భుతమైన ఎత్తుగడను పూర్తి చేయడంతో రెడ్జ్ బుల్స్ దాడితో విలవిల్లాడింది. మరో ఐదు పాయింట్లతో గోల్‌గా మార్చింది. మొదటి అర్ధభాగం ముగిసేలోపు, బుల్స్ తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. టెర్రీ కెన్నెడీ మరో రెండు ప్రయత్నాలు చేసి రెడ్జ్‌ను అధిగమించాడు. మరియు గౌరవ్ కుమార్ కిక్ నుండి





మరో రెండు ప్రయత్నాలు జోడించాడు. హాఫ్ టైం ముగిసే సమయానికి, బుల్స్ పూర్తి నియంత్రణలో ఉండి, 24-0 ఆధిక్యంలో ఉంది. విరామం తర్వాత కూడా ఆధిపత్యం కొనసాగింది, కెన్నెడీ అతనికి సెట్ వేసిన తర్వాత షానవాజ్ అహ్మద్ లైన్ దాటాడు. ఫిలిప్ సౌతురాగా మరో రెండు పాయింట్లు జోడించాడు. ఆట ముగియడానికి నాలుగు నిమిషాలు మిగిలి ఉండగా, ఆధిపత్యం చెలాయించే బుల్స్ 31-0 ఆధిక్యంలో ఉంది. ఇక హైదరాబాద్ హీరోస్ మూడో స్థానంలో నిలిచింది. బెంగళూరు బ్రేవ్‌హార్ట్స్ నుండి ఉత్సాహభరితమైన సవాలును ఎదుర్కొని, హైదరాబాద్ హీరోస్ 2025 రగ్బీ ప్రీమియర్ లీగ్‌లో మూడవ స్థానాన్ని కైవసం చేసుకుంది. తొలి దశలో వెనుకబడిన హీరోస్ పూర్తి శక్తితో పోరాడి బ్రేవ్‌హార్ట్స్‌ను 17-12 తేడాతో ఓడించింది. బ్రేవ్‌హార్ట్స్ తరపున టోన్ షియు మరియు ఫిలిప్ వోకోరాచ్ ట్రైలు సాధించగా, అకుయిలా రోకోలిసోవా ఒక కిక్‌ను గోల్‌గా మలిచారు, అన్నీ మొదటి అర్ధభాగంలోనే. మొదటి అర్ధభాగంలో జోజి నసోవా ట్రై మరియు మాన్యుయెల్ మోరెనో గోల్ చేయడం ద్వారా తిరిగి పోరాటం ప్రారంభించిన హీరోస్ జట్టుకు, కెవిన్ వెకేసా మరియు భూపిందర్ సింగ్ ఆటను మార్చే ప్రయత్నాలను జోడించారు.

# క్షీణించిన పారిశ్రామిక ఉత్పత్తి

## మే నెలలో 1.2% మాత్రమే!

**న్యూఢిల్లీ, జూన్ 30:** భారత్ పారిశ్రామిక ఉత్పత్తి సూచీ మే నెలలో 1.2శాతం ఉన్నట్లు రికార్డయింది. అదే గత ఏప్రిల్‌నెలలో 2.7శాతం కంటే తక్కువ నమోదయింది. కేంద్ర అర్థగణాంక పథక అమలు శాఖ సోమవారం వివరాలను విడుదల చేసింది. 2024 సెప్టెంబరు నెలలో నమోదయిన 3.1శాతం తర్వాత అతి తక్కువ శాతం నమోదు కావడం ఇదే ప్రథమం. గత ఏడాది ఇదేనెలలో పారిశ్రామిక ఉత్పత్తి కార్యకలాపాలు 5.9శాతంగా నమోదయ్యాయి. పారిశ్రామిక ఉత్పత్తి సూచీ మే నెలలో 156.6గా ఉంది. అంతకుముందు ఏడాది ఇదే నెలలో 154.7 పాయింట్లుగా ఉంది. అంటే సుమారు 2.6శాతం పెరిగింది. అంతకుముందు నెలలోచూస్తే మూడుశాతం ఉంది. అప్పటి నుంచి తగ్గింది. ఇదిలా ఉంటే గనుల తవ్వకాల పరంగా 0.1శాతం తగ్గింది. విద్యుత్ ఉత్పత్తికూడా 5.8శాతం క్షీణించింది. ఇక ఉత్పత్తి రంగాలపరంగా 23 కీలక రంగాల్లో 13 రంగాలు సానుకూల వృద్ధిని నమోదుచేస్తే మెషినరీ యంత్రసామగ్రి రంగం 11.8శాతం వృద్ధి నమోదుచేసింది. బేసిక్ మెటల్స్ 6.4శాతంగా ఉంది. ఇతర నాన్ మెటాలిక్ మినరల్ ఉత్పత్తులు 6.9శాతంగా ఉంది. సిమెంట్, గ్లాస్ వేర్, ఇతర కొన్ని ప్రత్యేక ఉక్కు ఉత్పత్తులు కూడా ఈరంగంలో వృద్ధిని నమోదు చేసాయి. భారీ యంత్రసామగ్రి ఉత్పత్తులు 14.1శాంగా ఉంది. మౌలికవనరులు నిర్మాణరంగం ఉత్పత్తులు 6.3 శాతం పెరిగాయి. ఇక ఇంటర్మీడియేట్ ఉత్పత్తులు 3.5శాతంగా ఉంది. ప్రాథమికఉత్పత్తులు 1.9శాతం క్షీణించాయి. ఇక వినియోగరంగ ఉత్పత్తులు, వినియోగరంగం కిందికిరాని కేటగిరీలో 0.7శాతం, 2.4శాతం చొప్పున క్షీణించాయి.



# జిఎస్టీ వసూళ్లు రూ.22.08 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ, జూన్ 30:** వస్తుసేవల పన్ను వార్షిక పద్ధతిలో చూస్తే గడచిన ఐదేళ్లలో రెట్టింపు వసూళ్లు జరిగి ఆల్‌టైమ్ రికార్డుస్థాయిని నమోదు చేసాయి. 2024-25 సంవత్సరంలో 22.08 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయి. అదే 2021 ఆర్థిక సంవత్సరంలో అయితే 11.37లక్షల కోట్లు మాత్రమే వసూలు కాగా 2025 నాటికి 22.08 లక్షల కోట్లు వసూళ్లు జరిగినట్లు తేలింది. స్థూల జీఎస్టీ వసూళ్లు 2024-25 సంవత్సరంలోనే అత్యంత గరిష్టాన్ని తాకాయి. రూ.22.08 లక్షల కోట్లు వసూళ్లు జరిగితే 9.4శాతం వృద్ధిని నమోదు చేసాయి. నెలసరి సగటు వసూళ్లు 1.84 లక్షల కోట్లుగా ఉన్నట్లు తేలింది. 2024లో సగటున 1.68 లక్షల కోట్లు, 2022 సంవత్సరంలో సగటున 1.51 లక్షల కోట్లు నెలవారీగా వసూళ్లు నమోదయ్యాయి. ఎనిమిదేళ్లలో జీఎస్టీ పన్ను చెల్లింపు దారులు 65 లక్షలనుంచి 1.51 కోట్లకు పెరిగారు. జీఎస్టీ ప్రవేశపెట్టినప్పటి నుంచి కూడా సేవల పన్ను పటిష్టమైన వృద్ధిని నమోదు చేసింది. రెవెన్యూ వసూళ్లు, పన్ను బేస్‌ను కూడా విస్తరించింది. దీన్నిబట్టి చూస్తే భారత్ ఆర్థిక పటిష్టతను మరింతగా పెంచినట్లు తేలింది. పరోక్ష పన్నులు వరకూ చూస్తే మరింత పారదర్శకంగా ఉన్నట్లు తేలింది. జీఎస్టీ ప్రారంభించినప్పటి నుంచి సగటు వసూళ్లు 95 వేల కోట్లు తక్కువ కాకుండా వసూళ్లు జరిగాయి. 2017 జులై ఒకటవ తేదీని ప్రారంభించిన జీఎస్టీ ఇప్పటికి ఎనిమిదేళ్లు పూర్తి చేసుకుంది. జీఎస్టీ మొత్తం 17 స్థానిక పన్నులు, 13 సెస్‌లు విలీనం చేయడం ద్వారా ఐదు అంచెల పన్నుల వ్యవస్థను ప్రవేశపెట్టారు. నెలవారీ జీఎస్టీ వసూళ్లు రికార్డుస్థాయిలో వచ్చింది. 2025 ఏప్రిల్‌నెలలోనే 2.37 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయి. మేనెలలో చూస్తే 2.01 లక్షల కోట్లుగా ఉన్నాయి.




# నష్టాల్లో ముగిసిన స్టాక్ సూచీలు



**ముంబై, జూన్ 30:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల వరుస లాభాలకు బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల మద్దతు కొనసాగుతున్నప్పటికీ.. ఫైనాన్షియల్, ఆటోమొబైల్ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ, రిలయన్స్ షేర్లు సూచీలను కిందకు లాగాయి. దీంతో నాలుగు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఓ దశలో 500 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 25,550 దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 84,027.33 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,058.90) ఫ్లాట్‌గా ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 83,482.13 84,099.53 మధ్య చలించిన సూచీ.. చివరికి 452.44 పాయింట్ల నష్టంతో 83,606.46 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 120.75 పాయింట్ల నష్టంతో 25,517.05 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.74గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రాబ్యాంక్, మారుతీ సుజుకీ, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ట్రెంట్, ఎస్‌బీఐ, బీఈఎల్, టైటాన్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 67.58 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3299 డాలర్ల వద్ద కొనసాగింది.

# మిలీనియల్స్‌కు బీమాపై ఆసక్తి

**న్యూఢిల్లీ, జూన్ 30:** దేశంలోని జనరేషన్‌జెడ్, మిలీనియల్స్‌ల పెట్టుబడుల గురించి ఓ బీమా అగ్రిగేటర్ చేపట్టిన సర్వేలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. జెన్‌జెడ్ సిప్, స్టాక్స్ వంటి వాటిలో పెట్టుబడుల పెట్టేందుకు ఎక్కువగా మొగ్గు చూపుతున్నట్లు తేలింది. అయితే మిలీనియల్స్ లో ఎక్కువ శాతం మంది హెల్త్, టర్మ్ ఇన్సూరెన్స్ వంటి రక్షణ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసేందుకు ఇష్టపడుతున్నారని సర్వేలో వెల్లడైంది. జెన్‌జెడ్ వారికి ఇప్పటికీ బీమా రంగంపై అవగాహన చాలా తక్కువగా ఉంది. జెన్ జెడ్ లో 19 శాతం మంది సిప్‌లలో పెట్టుబడి పెడుతున్నారు. మిలీనియల్స్‌లో 14 శాతం మంది సిప్‌లలో ఇన్వెస్ట్ చేస్తున్నారు. స్టాక్స్‌లో 15 శాతం మంది జెన్‌జెడ్‌లు ఇన్వెస్ట్ చేయగా, మిలీనియల్స్ 13 శాతం మంది పెట్టుబడులు పెడుతున్నారు. అయితే బీమా వంటి రక్షణ సాధనాల విషయానికొస్తే జెన్ జెడ్‌లో తక్కువ ఆసక్తి ఉంది. 19 శాతం మంది మాత్రమే టర్మ్ ఇన్సూరెన్స్‌ను తీసుకోవాలని భావిస్తున్నారు. 35 శాతం మిలీనియల్స్ టర్మ్ ఇన్సూరెన్స్‌ను కొనుగోలు చేయడానికి ఇష్టపడుతున్నారు. ఇన్సూరెన్స్ పాలసీ విషయంలో మాత్రం మిలినీయల్స్‌తో పోలిస్తే జెన్ జెడ్ చాలా వెనుకబడి ఉన్నారు. 4620 మందిపై సర్వే 2025 మే-జూన్‌లో దేశం అంతటా 4,620 మందిపై నిర్వహించిన సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. జెన్ జెడ్ (18 28 ఏళ్లు), మిలీనియల్స్ (2943ఏళ్ల)ల నుంచి బీమా అవగాహన, పెట్టుబడి అలవాట్లను తెలుసుకుంది. హెల్త్ ఇన్సూరెన్స్‌ను తీసుకునేందుకు జెన్ జెడ్, మిలీనియల్స్ ఇద్దరూ ఆసక్తి కనబరిచారు. జెన్ జెడ్‌లో 61 శాతం మంది, మిలీనియల్స్‌లో 63 శాతం మంది ఆరోగ్య బీమాను తీసుకున్నారు. హెల్త్ ఇన్సూరెన్స్‌పై 32 శాతం జెన్ జెడ్‌లు నమ్మకంగా ఉండగా, టర్మ్ ఇన్సూరెన్స్‌పై వీరికి అంతగా నమ్మకం లేదు. దీనికి విరుద్ధంగా టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ గురించి మిలీనియల్స్ ఎక్కువ మంది ఆసక్తి కనబరిచారు. జెన్ జెడ్‌లో ఒక సానుకూల ధోరణి ఉంది. అదేంటంటే వారు ఆరోగ్య బీమాను తీసుకోవాలని నమ్ముతున్నారు. దాదాపు 78 శాతం మంది జెన్ జెడ్‌లు ఆరోగ్య బీమా పొందడానికి అనువైన వయసు 30 ఏళ్లలోపేనని నమ్ముతున్నారు.



# ఇన్నోవా హైక్రాస్‌కు ఫైవ్‌స్టార్ రేటింగ్..!

**ముంబై, జూన్ 30:** టయోటా ఇన్నోవా హైక్రాస్ కారు సరికొత్త రికార్డు సృష్టించింది. భారత్ ఎన్‌క్యాప్ (న్యూకార్ అసెస్‌మెంట్ ప్రోగ్రాం)లో ఎంపీవీ విభాగంలో ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించిన తొలికారుగా నిలిచింది. ఈ రేటింగ్స్ పరీక్షించి మూడు వరుసల సీట్లున్న కారులో ఈ స్థాయి స్కోరు సాధించింది కూడా ఇదే. దీంతో ఎంపీవీ విభాగంలో సురక్షితమైనదిగా నిలిచింది. ఈ పరీక్షల్లో స్ట్రాంగ్ హైబ్రీడ్, నాన్ హైబ్రీడ్ మోడల్ కార్లు పాల్గొన్నాయి. పెద్దల భద్రతకు సంబంధించి 32కుగాను 30.47 పాయింట్లు, పిల్లల రక్షణకు సంబంధించి 49కు గాను 45 పాయింట్లు సాధించింది. పెద్దలకు సంబంధించి ఫ్రంట్, సైడ్ క్రాష్ టెస్ట్‌లో అత్యధికస్కోర్ దీనికి లభించింది. తల, కాళ్లు, నడుము కింద భాగానికి రక్షణ ఇచ్చింది. ఇక డ్రైవర్ ఛాతి, ఎడమ కాలుపై కూడా ప్రమాద తీవ్రతను అడ్డుకొంది. సైడ్ ఇంపాక్ట్ టెస్ట్‌లో దీనికి 16కు 16 పాయింట్లు లభించాయి. ఈ కారు బేస్ మోడల్ నుంచే ప్రయాణికుల భద్రతకు సంబంధించి చాలా ఫీచర్లను ఇచ్చారు. ఆరు ఎయిర్ బ్యాగ్‌లు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, ఏబీఎస్, హిల్ స్టార్ట్ అసిస్ట్, మూడు వరుసలకు సీట్‌బెల్ట్ రిమైండర్ ఇలా అన్ని వేరియంట్లకు ఉన్నాయి. ఇక హైఎండ్ మోడల్‌కు అడాస్, 360 డిగ్రీ కెమెరా వంటి ఫీచర్లు లభిస్తున్నాయి. ఈ కారులో టయోటా ఫిఫ్త్ జనరేషన్ సెల్ఫ్ ఛార్జింగ్ స్ట్రాంగ్ హైబ్రీడ్ ఎలక్ట్రిక్ సిస్టమ్ ఇచ్చారు.



# వాణిజ్యం

## నేటి నుంచి అమల్లోకి వస్తున్న మార్పులు

**ముంబై, జూన్ 30:** చమురు కంపెనీలు ధరలను సవరిస్తున్నందున ప్రతి నెల ప్రారంభంలో గ్యాస్ సిలిండర్ ధరలు మారుతూ ఉంటాయి. ఈ విషయంలో జూలై 2025లో కూడా గ్యాస్ సిలిండర్ ధరలు మారుతాయని చెబుతున్నారు. పాన్ కార్డుకు ఆధార్ తప్పనిసరి: జూలై 1, 2025 నుండి పాన్ కార్డ్ (శాశ్వత ఖాతా సంఖ్య) పొందడానికి ఆధార్ తప్పనిసరి చేసింది. సిబిడిటి (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్) కొత్త నిబంధనల ప్రకారం.. పాన్ కార్డ్ పొందాలనుకునే వ్యక్తులు ఆధార్ కార్డు కలిగి ఉండటం తప్పనిసరి. దానితో పాటు,




పాన్ కార్డ్ కోసం ఆధార్ ధృవీకరణ కూడా తప్పనిసరి చేసింది. తత్కాల్ టికెట్ బుకింగ్: 2025 జూలై 1 నుండి తత్కాల్ టికెట్ బుకింగ్ కు ఆధార్ కార్డు తప్పనిసరి చేసింది భారతీయ రైల్వే. మొబైల్ యాప్ ద్వారా తత్కాల్ టికెట్ బుకింగ్‌కు ఆధార్ వెరిఫికేషన్ తప్పనిసరి చేసింది. 2025 జూలై 15 నుండి ఆన్‌లైన్‌లో తత్కాల్ టికెట్ బుకింగ్‌కు ఆధార్ వెరిఫికేషన్ తప్పనిసరి ఉండాలని రైల్వే పేర్కొంది. ఆదాయపు పన్ను దాఖలు: 2024-2025 ఆర్థిక సంవత్సరానికి ఆదాయపు పన్ను దాఖలు చేయడానికి చివరి తేదీ జూలై 31, 2025. ఈ పరిస్థితిలో దీటీదీగి దాని గడువును పొడిగించింది. దీని ప్రకారం, సెప్టెంబర్ 15, 2025ని చివరి తేదీగా ప్రకటించారు. ఏటీఎం ఛార్జీలు: ఐసీఐసీఐ బ్యాంక్ ఏటీఎం లావాదేవీలకు సంబంధించిన నియమాలను మార్చింది. ఇప్పుడు ఐసీఐసీఐ కస్టమర్లు ఏదైనా ఇతర బ్యాంకు ఏటీఎం నుండి నెలలో 3 సార్లు కంటే ఎక్కువ డబ్బును ఉపసంహరించుకుంటే, ప్రతి అదనపు ఆర్థిక లావాదేవీపై రూ.23, ఆర్థికేతర లావాదేవీపై రూ.8.50 ఛార్జీ విధించనుంది. ఇది ఏటీఎంను ఉపయోగించే ఖర్చును పెంచుతుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A, NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14